WWW.nindam.co.in
తెలుగు దినపత్రిక
# నినాదం
నిఖార్సైన జర్నలిజం
శనివారం, జూన్ 29, 2024 | సంపుటి - 20 | సంచిక 289 | వెల - 6 | పేజీలు - 12
Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

## కెసిఆర్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ
### తీర్పును రిజర్వ్ చేసిన ధర్మాసనం



**హైదరాబాద్, జూన్28(నినాదం):** హైకోర్టులో తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. విద్యుత్ కమిషన్ ఏర్పాటు జీవోను కొట్టివేయాలని కేసీఆర్ పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే.

## నేడు కొండగట్టుకు డి.సీఎం పవన్
### భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు

**హైదరాబాద్, జూన్28(నినాదం):** జనసేన చీఫ్, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శనివారం జగిత్యాల జిల్లాలోని కొండగట్టు పుణ్యక్షేత్రాన్ని దర్శించుకోనున్నారు.



▶▶2లో..

# రుణమాఫీ తరవాతే రైతుబంధుపై దృష్టి

### హామీ మేరకు 2లక్షల రుణమాఫీ | నాలుగు రోజుల్లో మార్గదర్శకాలు విడుదల

- రేషన్ కార్డు ఆధారంగా మాఫీ ఉండదు
- కేవలం పట్టాదారు పాస్ పుస్తకంతో సరిచూస్తాం
- బంగారం తాకట్టు రుణాలకు మాఫీ వర్తించదు
- అప్పులు తగ్గించుకునే పనిలో ఉన్నాం
- వాస్తవాలకు అనుగుణంగా బడ్జెట్ రూపకల్పన
- ధరణి, మండలాలు, జిల్లాలపై అసెంబ్లీలో చర్చ
- ఆర్టీసీ ఆక్యుపెన్సీ పెరిగింది.. ఆదాయం పెరిగింది
- కెసిఆర్ చేసిన తప్పులు మేం చేయబోం
- చేరికలు అంతటా జరుగుతూనే ఉన్నాయి
- కులగణన చేపట్టి తీరుతాం
- మీడియా సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి స్పష్టీకరణ

రుణమాఫీపై నాలుగు రోజుల్లో మార్గదర్శకాలు విడుదల చేయనున్నట్లు వెల్లడిరచారు. పంట రుణాల మాఫీకి రేషన్ కార్డు ప్రామాణికం కాదని.. అది కుటుంబాన్ని గుర్తించడం కోసం మాత్రమేనని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రూ. 2 లక్షల వరకు మాత్రమే రుణమాఫీ ఉంటుందని.. మరోసారి స్పష్టం చేశారు. బంగారం తాకట్టు పెట్టి తీసుకున్న రుణాలు మాఫీ కావని కూడా సీఎం చెప్పేశారు. పాస్ బుక్ ఆధారంగానే రుణ మాఫీ ఉంటుందని రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు.

▶▶2లో..

**న్యూఢిల్లీ, జూన్ 28(నినాదం):** తెలంగాణ సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతు రుణమాఫీకి రేవంత్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆగస్టు`15 లోగా ఈ హామీని నెరవేరుస్తానని పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మాటిచ్చిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించి ప్రక్రియ కూడా దాదాపు మొదలైంది. ఢిల్లీ పర్యటనలో బిజిబిజీగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రుణమాఫీ ప్రస్తావన వచ్చింది. దీనిపై మాట్లాడిన సీఎం.. రుణమాఫీకి నాలుగు రోజుల్లో మార్గదర్శకాలు విడుదల చేస్తామని అన్నారు. ఇందుకు రేషన్ కార్డు ప్రామాణికం కాదని స్పష్టం చేశారు.



## ఆగివున్న లారీని ఢీకొన్న మినీ బస్సు
### కర్నాటకలో ఘోర రోడ్డు ప్రమాదం
### ప్రమాదంలో 13మంది అక్కికక్కడే మృతి

**బెంగళూరు, నినాదం:** కర్నాటక రాష్ట్రం హావేరి జిల్లాలో శుక్రవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గుండెనహళ్లి శివారులోని పుణె`బెంగళూరు జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని మినీ బస్సు ఢీకొట్టడంతో 13 మంది చనిపోయారు. నలుగురు గాయపడడంతో వారిని ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులలో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని ఆస్పత్రి వర్గాలు వెల్లడిరచాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ▶▶2లో..

## మెదక్ జిల్లాలో ఘోరం
### లారీని ఢీకొట్టిన మరో లారీ • నలుగురు వ్యక్తుల దుర్మరణం

**మెదక్, నినాదం:** మెదక్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. లారీని మరో లారీ వెనక నుంచి ఢీకొనడంతో నలుగురు దుర్మరణం చెందారు. తెల్లవారుజామున కావడంతో లారీ డ్రైవర్ నిద్ర మత్తులో ఉన్నారో ఏమో కానీ పెను ప్రమాదం జరిగింది. ఒక లారీని వెనుక వస్తున్న లారీ ఢొకట్టింది. ▶▶2లో..



## షాద్‌నగర్ పరిశ్రమలో పేలిన కంప్రెషర్
### ఆరుగురు మృత్యువాత

**షాద్‌నగర్,నినాదం:** రంగారెడ్డి జిల్లాలోని షాద్‌నగర్‌లో పెను విషాదం చోటు చేసుకుంది. స్థానిక సౌత్ గ్లాసు ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో కంప్రెషర్ పేలడంతో ఆరుగురు మృతి చెందారు. పేలుడు ధాటికి కార్మికుల మృతదేహాలు ఛిన్నాభిన్నమయ్యాయి.



▶▶2లో..

## దొంగలతో కలిసేటోళ్ల గురించి బాధలేదు

- మెరికల్లాంటి నేతలను తయారు చేసుకుందాం
- తెలంగాణ ఆర్తి మనకే బాగా తెలుసు
- తెలంగాణ ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చేది మనమే
- పార్టీని నేతలెవరూ ప్రభావితం చేయలేరు
- నిజామాబాద్, కరీంనగర్ నేతలతో కెసిఆర్

**గజ్వేల్, నినాదం:** పార్టీని వీడి దొంగలతో కలిసేటోళ్ల గురించి బాధలేదని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. తెలంగాణ సాధించిన మనకు గిదో లెక్కనా? అని వ్యాఖ్యానించారు. ఎక్కడైతే పార్టీని వీడారో అక్కడ మెరికల్లాంటి నేతలను తయారు చేసుకుందామని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో తాను బయలుదేరినప్పుడు ఎంపిలు, ఎమ్మెల్యేలు లేరని గుర్తు చేశారు.



▶▶2లో..

## బిఆర్ఎస్‌లో మరో వికెట్ డౌన్



### కాంగ్రెస్‌లో చేరిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య
### కండువా కప్పి ఆహ్వానించిన సిఎం రేవంత్ రెడ్డి

**న్యూఢిల్లీ, నినాదం:** భారత రాష్ట్ర సమితి (భారాస)కు మరో షాక్ తగిలింది. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కాంగ్రెస్ పార్టీలో చేరారు. దిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. ఇటీవల జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, తెలంగాణ మాజీ స్పీకర్, భారాస బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి హస్తం గూటికి చేరిన విషయం తెలిసిందే. దీంతో యాదయ్యతో కలిపి ఇప్పటివరకు ఆరుగురు భారాస ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు.

▶▶2లో..

## ఇంత అధ్వానమా..

- ఏడాదికే ఎక్కడికక్కడ పగుళ్లు
- బన్నెచెరువుపై బీటీ రోడ్డు దుస్థితి
- తమ్మచెరువు, రావులచెరువుల పై నడక దారుల నిర్మాణాల్లోనూ కానరాని



**పెద్దపల్లి ప్రతినిధి (నినాదం):** అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపానికి పెద్దపల్లి జిల్లా మంథని అడ్డాగా మారింది. ఇక్కడ రూ. కోట్లు వెచ్చించి నిర్మించిన పనులు నాసిరకానికి సాక్ష్యంగా మిగిలాయి. నాణ్యత ప్రమాణాలను గాలికి వదిలి గుత్తేదారులు తూతూ మంత్రంగా పనులు చేస్తుండగా ఇంజనీరింగ్ అధికారులు చోద్యం చూస్తున్నారు అనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాగా ఏ పని చూస్తే ఏమున్నది గర్వకారణం అన్నట్లు.. నాణ్యతలేని పనులు వెక్కిరిస్తున్నాయి. మంథని పట్టణంలోని అంబేద్క ర్ భవనం సమీపం నుంచి ఖానాపూర్ వరకు 2.2 కిలో మీటర్ల దూరంలో రహదారి నిర్మా ణానికి ప్రభుత్వం డీఎంఎఫ్టీ నిధులు రూ.1.5 కోట్లు మంజూరు చేసింది.

▶▶2లో..



# కెసిఆర్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ

**మొదటిపేజీ తరువాయి**

జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి జారీ చేసిన నోటీసులు రద్దు చేయాలని కేసీఆర్ పిటిషన్ దాఖలు చేశారు. కేసీఆర్ పిటిషన్‌కు విచారణ అర్హత ఉందా లేదా అనే దానిపై వాదనలు ముగిశాయి. అనంతరం కేసీఆర్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్ చేసినట్లు హైకోర్టు ప్రకటించింది. అయితే కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణ స్వీకరించవద్దని అడ్వకేట్ జనరల్ కోరారు. పిటిషన్‌ను విచారణకు అనుమతించడం పైనే వాదనలు వినిపించాలని? మెరిట్స్‌లోకి వెళ్లవద్దని ఏజీకి ధర్మాసనం సూచించింది. ఏజీ వాదనలపై కేసీఆర్ న్యాయవాది ఆదిత్యా సోంధీ అభ్యంతర వ్యక్తం చేశారు. జ్యుడిషియల్ విచారణగా నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. దానిపై నివేదిక ఇవ్వాలే గానీ, మీడియాకు వివరాలు వెల్లడిరచకూడదు. విద్యుత్ రంగానికి తీవ్ర నష్టం వాటిల్లిందని ముందే చెప్పి కారకులెవరో తేల్చమన్నారు. ఇది సరికాదు అని ఆదిత్యా సోంధీ పేర్కొన్నారు. విద్యుత్తు కొనుగోళ్లు, థర్మల్ ప్లాంట్ల నిర్మాణంపై జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి నేతృత్వంలో విచారణ సంఘం ఏర్పాటును సవాల్ చేస్తూ కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌కు నంబర్ కేటాయించాలని హైకోర్టు గురువారం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం గురువారం హైకోర్టు రిజస్ట్రీకిఆదేశాలు జారీచేసింది. విద్యుత్తు వ్యవహారాలపై రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 14న జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి నేతృత్వంలో విచారణ సంఘాన్ని నియమించింది. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రాల నిర్మాణం, ఛత్తీస్‌గఢ్‌`తెలంగాణ మధ్య విద్యుత్తు కొనుగోలు ఒప్పందాల్లో అక్రమాలు జరిగాయని ప్రభుత్వం ఆరోపించింది. కమిషన్ ఏర్పాటు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కేసీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విద్యుత్తుశాఖ ముఖ్య కార్యదర్శిని, జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి విచారణ సంఘాన్ని, వ్యక్తిగత హోదాలో జస్టిస్ ఎల్ నరసింహారెడ్డిని ఇందులో ప్రతివాదులుగా పేరొన్నారు. అయితే, జస్టిస్ నరసింహారెడ్డిని ప్రతివాదిగా చేర్చడంపై హైకోర్టు రిజిస్టీ అభ్యంతరం తెలిపారు. నంబర్ కేటాయించేం దుకు నిరాకరించారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ పిటిషన్ గురువారం హైకోర్టు ధర్మాసనం ముందుకు వచ్చింది. దాదాపు 45 నిమిషాలపాటు వాదప్రతివాదనలు జరిగాయి. కేసీఆర్ తరపున సుప్రీంకోర్టు న్యాయవాది అదిత్య సోంధి బలంగా వాదనలు వినిపించారు. ఆయనతో ఏకీభవించిన ధర్మాసనం.. హైకోర్టు రిజిస్టీ లేవనెత్తిన అభ్యంతరాలను తోసిపుచ్చింది. పిటిషన్‌కు నంబర్‌ను కేటాయించాలని ఆదేశించింది. జస్టిస్ నరసింహారెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ పిటిషనర్ అభియోగాలు మోపిన నేపథ్యంలో, పిటిషన్‌పై శుక్రవారం విచారణ చేపడతామని వెల్లడిరచిన మేరకు విచారణ జరిగింది.

# నేడు కొండగట్టుకు డి.సిఎం పవన్

**మొదటిపేజీ తరువాయి**



దీంతో పవన్ కల్యాణ్ పర్యటన నేపథ్యంలో పోలీసులు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ మేరకు ఏపీ పోలీసులు పవన్ పర్యటన షెడ్యూల్‌ను విడుదల చేశారు. వారాహి అమ్మవారి దీక్షలో పవన్ కల్యాణ్.. శనివారం ఉదయం 7 గంటలకు మాదాపూర్‌లోని తన నివాసం నుంచి రోడ్డు మార్గంలో కొండగట్టుకు బయల్దేరనున్నారు. ఉదయం 11 గంటలకు కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి ఆయన చేరుకోనున్నారు. గంటన్నర పాటు కొండగట్టు పుణ్యక్షేత్రంలో పవన్ గడపనున్నారు. ఆంజనేయస్వామికి పవన్ ప్రత్యేక పూజలు చేయనున్నారు. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు కొండగట్టు నుంచి మాదాపూర్‌కు రోడ్డు మార్గంలో తిరిగి రానున్నారు. సాయంత్రం 4.30కు మాదాపూర్ చేరుకోనున్నారు. శనివారం రాత్రికి హైదరాబాద్‌లోనే డిప్యూటీ సీఎం పవన్ బస చేయనున్నారు. పవన్ కల్యాణ్ చేపట్టిన వారాహి దీక్ష వివాదాస్పదంగా మారిన సంగతి తెలిసిందే. ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో బంపర్ మెజారిటీతో గెలవడంతో పవన్ కల్యాణ్ జూన్ 26న వారాహి అమ్మవారి దీక్షను తీసుకున్నారు. 11 రోజుల పాటు నిష్ఠగా ఈ దీక్షను పవన్ కల్యాణ్ పాటించనున్నారు. పసుపు రంగు దుస్తుల్లో ఆధ్యాత్మిక భావం ఉట్టిపడేలా ఉన్న పవన్ కల్యాణ్ ఫొటోలు చూసి ఫ్యాన్స్ పండుగ చేసుకుంటున్నారు. అయితే ఈ దీక్ష దుస్తుల్లో ఉన్న పవన్ కల్యాణ్ చెప్పులు వేసుకుని కనిపించడం చర్చనీయాంశంగా మారింది.

# ఆగివున్న లారీని ఢీకొన్న మినీ బస్సు

**మొదటిపేజీ తరువాయి**



శివమొగ్గ జిల్లా భద్రావతి తాలూకాలోని ఈమ్మహట్టి గ్రామానికి చెందిన 17 మంది భక్తులు బెళగావి ప్రాంతం శవదత్తిలోని ఎల్లమ్మ ఆలయానికి వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతులలో పరుశురామ్(45), భాగ్య(40), నాగేశ్(50), విశాలక్షి(50), సుభద్రా బాయ్(65), పుణ్య(50), మంజుల బాయ్(57), డ్రైవర్ అదర్ష్(23), మానస(24), రూపా(40), మంజుల(50), ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# లారీని ఢీకొట్టిన మరో లారీ

**మొదటిపేజీ తరువాయి**



ఈ ప్రమాదంలో నలుగురుదుర్మరణం పాలయ్యారు. ఈ దుర్ఘటన మెదక్ జిల్లా చేగుంట మండలం వడియారం వద్ద బైపాస్ రోడ్డులో జరిగింది. ఒక లారీని వెనుక నుంచి వచ్చిన మరో లారీ ఢీ కొట్టడంతో వెనుక లారీలోని క్యాబిన్‌లో కూర్చొన్న నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఘటనకు సంబంధించి మరింత సమాచారం తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలిస్తున్నారు.

# షాద్‌నగర్ పరిశ్రమలో పేలిన కంప్రెషర్

**మొదటిపేజీ తరువాయి**

మంటలు చెలరేగడంలో మరికొంత మందికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్ని మాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని మంటలు అదుపు చేసేందుకు యత్నిస్తున్నారు. ఒకేసారి కంప్రెషర్ పేలడంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించారు. ఈ దుర్ఘటన ఎలా జరిగిందనే దానిపై ఇంకా ఆరా తీస్తున్నారు. మృతులు ఒడిశా, బిహార్, యూపీ వాసులుగా గుర్తించారు. తీవ్ర గాయాలైనవారిని మెరుగైన చికిత్స కోసం ఉస్మానియా, గాంధీ ఆస్పత్రికి తరలించే అవకాశం ఉంది. ఈ ఘటనలో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. గతంలో ఇక్కడ ఇలాంటి ఘటన జరిగినప్పుడే కార్మికుల భద్రత దృష్ట్యా జాగ్రత్తలుతీసుకోవాలని ఇచ్చిన సూచనల్ని ఏమేరకు పాటించారనే విషయాన్ని అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

# రుణమాఫీ తరవాతే రైతుబంధుపై దృష్టి

**మొదటిపేజీ తరువాయి**

రైతు రుణమాఫీ తర్వాత రైతుబంధు ఇతర పథకాలపై దృష్టి పెడతామని స్పష్టం చేశారు. కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన రెండు రోజుల తర్వాత తెలంగాణ బడ్జెట్ సమావేశాలుంటాయన్నారు. తెలంగాణ బడ్జెట్ వాస్తవ అంచనాలకు అనుగుణంగా ఉండాలని అధికారులకు చెప్పాం. అంచనాలకు మించి ఊహాజనిత లెక్కలతో బడ్జెట్ ఉండకూడదని అధికారులను ఆదేశాలు ఇచ్చాం. మండలాలు రెవెన్యూ డివిజన్ విషయంపై అసెంబ్లీలో చర్చించి కమిషన్ ఏర్పాటు చేస్తాం. కాళేశ్వరం సంబంధించిన వాస్తవాలను కూడా అసెంబ్లీ ముందుకు తెస్తాం. చర్చల తర్వాత డ్యాం సేఫ్టీ అథారిటీ నివేదిక, నిపుణుల సూచన మేరకు ముందుకు వెళ్తాం అని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు పథకం వల్ల రెవెన్యూ పెరిగింది. ఆర్టీసీకి ప్రతి నెలా రూ.350 కోట్లకు పైగా ప్రభుత్వం చెల్లిస్తోంది. 30శాతం నుంచి ఆక్యుపెన్సీ రేషియో 80 శాతానికి పెరిగింది. తద్వారా ఆర్టీసీకి నిర్వహణ నష్టాలు తగ్గాయి. గత అప్పులతో సంబంధం లేకుండా చుస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక లాభాలతో ఆర్టీసీ నడుస్తోంది. రాష్ట్ర ఖజానాకు ఆర్థిక భారం ఉన్నా సరే.. సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నాం. బీసీ కమిషన్ పదవీకాలం ఆగస్టుతో పూర్తవుతుంది. కొత్త వారిని నియమించిన తరువాత కుల గణన చేస్తాం అన్నారు. రాష్ట్రం రూ.7లక్షల కోట్ల అప్పుల్లో ఉంది. ప్రతి నెల రూ. 7వేల కోట్ల అప్పులు కడుతున్నాం. రాష్ట్రం విడిపోయినప్పుడు నెలకు రూ. 6,500 కోట్లు కట్టేవారు. గత ప్రభుత్వం 7 నుంచి 11 శాతం వడ్డీతో రుణాలు తెచ్చారు. రుణభారం తగ్గేలా రుణాల వడ్డీని తగ్గించుకునే పనిలో ఉన్నాం. ఒక్కశాతం తగ్గినా రూ. 700 కోట్లు ఆదా అవుతాయి. ఈ మేరకు కేంద్రంతో సంప్రదింపులు చేస్తున్నాం. బడ్జెట్ కు ముందే రాష్ట్రానికి కావాల్సిన అంశాలను కేంద్రం దృష్టిలో ఉంచి ఎక్కువ నిధులు పొందే ప్రయత్నం చేస్తున్నాం. అన్ని శాఖలకు సంబంధించిన రాష్ట్ర మంత్రులు.. కేంద్రమంత్రులను ఇప్పటికే ఒకసారి కలిశారు అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. కేసీఆర్ హయాంలో తీసుకొచ్చిన 'ధరణి'లో ఉన్న లోపాలు సరి చేసే పనిలో ఉన్నాము. ఆ తరవాత ఏ పేరు పెట్టినా నడుస్తుంది. కంప్యూటరైజ్ చేయాలా..? లేక మాన్యూవల్ పద్ధతి పాటించాలా..? రెండే పద్ధతులు. ఏది చేయాలో అసెంబ్లీ ముందు పెట్టిన తర్వాతే నిర్ణయం ఉంటుంది. ఏ పాలసీ అయినా... ముందు అసెంబ్లీలో పెట్టి చర్చించిన తర్వాతే మార్పు చేర్పులతో తుది విధానం ప్రకటన చేస్తామని అన్నారు.. ఐఏఎస్, ఐపీఎస్‌ల పోస్టింగ్స్‌లో రూల్స్ బ్రేక్ చేయం. కేసీఆర్ చేసిన తప్పులను మేం చెయ్యం' అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 'రాష్ట్రంలో విద్యుత్ కోత లేదు పంపిణీలో అంతరాయాలు మాత్రమే ఉన్నాయి. మేము అధికారంలోకి వచ్చే సరికి ప్రతి సంవత్సరం జరిగే నిర్వహణ పనులు జరగడం వల్ల అంతరాయం ఏర్పడిరది. బడ్జెట్ వ్యవహారంలో గత ప్రభుత్వం అనుసరించిన విధానాలు అనుసరించాల్సిన అవసరం లేదన్నారు. మహిళలకు ఉచిత రవాణా సదుపాయం వల్ల టెంపుల్ టూరిజం పెరిగింది. అక్కడ జీఎస్టీ కూడా పెరిగింది' అని రేవంత్ చెప్పుకొచ్చారు. 'రాష్ట్ర ఖజానాకు ఆర్థిక భారం ఉన్న సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నాం. రైతు రుణమాఫీ తరువాత రైతు బంధు ఇతర పథకాల పై దృష్టి పెడతాం. మండలాలు రెవెన్యూ డివిజన్ విషయం లో కమిషన్ ఏర్పాటు చేస్తామని చెప్పారు.

ఉచిత పథకాలను తప్పుపట్టడం సరికాదు. అవసరం ఉన్నవారికే సంక్షేమ పథకాలు అందాలి. మోదీ 10 ఏళ్లలో 16 లక్షల కోట్లు కార్పొరేట్లకు మాఫీ చేస్తే ఎవరు ప్రశ్నించరు..? కానీ మహిళలు, రైతులు, పేదలకు ఇస్తే మాత్రం తప్పుపడుతున్నారు' అని ఉదహరించి మరీ రేవంత్ మాట్లాడారు. ఈ సందర్భంగా.. మహిళలకు పీసీసీ ఇస్తే ఎలా ఉంటుందన్న ప్రశ్నకు మహిళలకు పీసీసీ ఇస్తే బానే ఉంటుందని సీఎం సమాధానం ఇచ్చారు. విలేకరుల సూచనలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానన్నారు. పీసీసీ రేసులో ఎవరైనా ఉండొచ్చని.. సామాజిక న్యాయంలో భాగంగా బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మహిళలు, ఈబీసీలు కూడా ఉండొచ్చన్నారు. ఫిరాయింపుల తెలంగాణ ఒక్కటే ప్రత్యేకం కాదని.. కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో ఎమ్మెల్యేలు ఫిరాయించారన్న విషయాన్ని గుర్తు చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన తప్పులు, తాము చేయమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తకొత్త పీసీసీ చీఫ్ నియామకం, సామాజిక సమీకరణాలు దృష్టిలో ఉంచుకుని హై కమాండ్ డిసైడ్ నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. కాంగ్రెస్ బీ ఫామ్ మిద గెలిచిన వారికి మాత్రమే పదవులు వచ్చాయి. పీసీసీ చీఫ్‌గా రెండు ఎన్నికలు పూర్తి చేశా. జూలై 7 తో మూడేళ్లు పీసీసీ పూర్తి కానుంది. పీసీసీ , కేబినెట్ విస్తరణ నిర్ణయాలు ఒకే సారి ఫైనల్ అవుతాయని అన్నారు.

# దొంగలతో కలిసేటోళ్ల గురించి బాధలేదు



**మొదటిపేజీ తరువాయి**

సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని తన నివాసంలో ఉమ్మడి నిజామాబాద్,కరీంనగర్ జిల్లా నేతలతో కేసీఆర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పార్టీ బలోపేతంపై చర్చించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. పార్టీయే నాయకులను తయారు చేస్తుంది తప్ప.. నాయకులు పార్టీని ప్రభావితం చేయలేరని స్పష్టం చేశారు. నాడైనా నేడైనా నాయకులను తయారు చేసుకున్నది పార్టీనే అని తెలిపారు. మెరికల్లాంటి యువ నాయకులను పార్టీ సృష్టిస్తదని చెప్పారు. రెట్టించిన ఉత్సాహంతో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రగతి ప్రస్థానంలో చేరుకోవాల్సిన మైలురాళ్లు ఇంకా చాలా మిగిలి ఉన్నాయని, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను, కలలను నెరవేర్చగలిగే అవగాహన మనకు మాత్రమే ఉందని అన్నారు. తెలంగాణ ఆత్మను అర్థం చేసుకుంటూ సమస్యల లోతును పట్టుకోగలిగి పరిష్కరించగలిగే సత్తా బీఆర్ఎస్‌కు మాత్రమే ఉందని అన్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు ధైర్య వచనాలు చెప్పారు. కోరుట్ల, జగిత్యాల నియోజక వర్గాల నుంచి వందలాదిగా బీఆర్ఎస్ కార్యకర్తలు, నేతలతో కేసీఆర్ సమావేశమయ్యారు. పలు సూచనలు చేశారు. కొన్ని కొన్ని సార్లు ప్రజాస్వామ్యంలో అబద్ధపు ప్రచారాలను నమ్మి ప్రజలు బోల్తాపడుతుంటారని, మొన్నటి ఎన్నికల్లో అదే జరిగిందని కేసీఆర్ వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయినంత మాత్రాన నిరుత్సాహపడొద్దతీ, అధికారం ఉంటేనే పనిచేస్తామంటే పద్ధతికాదని పార్టీ కేడర్‌కు హితబోధ చేశారు. ఏ హోదాలో వున్న కానీ ప్రజల కోసం పని చేయాల్సిందేనని, అంతిమ లక్ష్యం తెలంగాణ ప్రజల సంక్షేమం అభివృద్ధి మాత్రమేనని అన్నారు. ఇంకా నెరవేరాల్సిన ప్రజల కలలను బీఆర్ఎస్ మాత్రమే నెరవేరుస్తుందన్నారు. ఆనాడు ఉద్యమంలకు దిగినప్పుడు మనతో ఎవరున్నారు?. నాడైనా నేడైనా నాయకులను తయారు చేసుకునేది పార్టీనే. మొన్న జగిత్యాల నుంచి ఒకాయన పోయి దొంగలల్ల కలిసిండు. బాధ పడేదేమీ లేదు. ఆయనను తయారుచేసింది పార్టీనే. అంతకన్నా మెరుగైన నాయకత్వాన్ని పార్టీ తయారుచేసుకుంటదని కేసీఆర్ వ్యాఖ్యానించారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కే. సంజయ్ కుమార్ ఒక పక్క డాక్టర్‌గా మరోపక్క ఎమ్మెల్యేగా ప్రజాసేవలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని కేసీఆర్ అభినందించారు. గత 15 రోజులుగా కార్యకర్తలు, అభిమానులు, ప్రజలతో కొనసాగుతున్న ఆత్మీయ సమ్మేళనాలు శుక్రవారం కూడా కొనసాగాయి. కోరుట్ల, జగిత్యాల నియోజకవర్గాల నుంచి వందలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, నేతలతో కేసీఆర్ సమావేశమయ్యారు. అంతకు ముందు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నేతలతో కేసీఆర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పార్టీ బలోపేతంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు కేటీఆర్, ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్, పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, జీవన్ రెడ్డి, జాజాల సురేందర్, గంప గోవర్ధన్, హన్మంత్ షిండే, ఎల్ రమణ తదితరులు పాల్గొన్నారు. కాగా, బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలతో కొనసాగుతున్న కేసీఆర్ ఆత్మీయ సమావేశాలకు మూడు రోజులు బ్రేక్ ఇవ్వాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయించింది. కేసీఆర్‌తో పార్టీ ముఖ్యనేతలు చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆత్మీయ సమావేశాల పునఃప్రారంభ వివరాలను, ఏ నియోజకవర్గాల వారు ఎప్పుడు రావాలనే విషయాలను త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. ఎన్నికల అనంతరం ఇప్పటికే పలు దఫాలుగా పార్టీ కార్యకర్తలు, నేతలతో కేసీఆర్ సమావేశమవుతున్నారు. ఈ క్రమంలోనే గత రెండు వారాలుగానియోజకవర్గాల వారీగా కార్యకర్తలు, నేతలను భేటీ అవుతున్నారు. తనను చూసేందుకు ఎర్రవెల్లి నివాసానికి వస్తున్న ప్రజలతో ఓపికగా కలుస్తున్నారు. గంటల పాటు నిలబడి వారిని కేసీఆర్ ఆప్యాయంగా పలకరిస్తూ.. వారితో ఫొటోలు దిగుతున్నారు. గత 15 రోజుల్లో దాదాపు 50 వేలకు పైగా ప్రజలు తమ అభిమాన నేతను కలిసి తమ ఆనందాన్ని, కష్ట సుఖాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా కేసీఆర్‌తో ఫొటోలు, సెల్ఫీలు దిగారు.

# బిఆర్ఎస్‌లో మరో వికెట్ డౌన్

**మొదటిపేజీ తరువాయి**

ఈ క్రమంలో తాజాగా ఆ పార్టీ చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కాంగ్రెస్ లో చేరారు. ఢల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. సీఎం రేవంత్ ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. దీంతో అసెంబ్లీలో కాంగ్రెస్ బలం 71కి చేరుకుంది. కాగా ఇప్పటికే బీఆర్ఎస్ నుంచి కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, తెల్లం వెంకట్రావ్, సంజయ్ కుమార్, దానం నాగేందర్ కాంగ్రెస్ లో చేరారు.కాలె యాదయ్య కాంగ్రెస్ పార్టీతో తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. ఎంపీపీ, జెడ్పీటీసీగా పని చేసి, 2009లో చేవెళ్ల నియోజకవర్గం నుండి పోటిచేసి తెలుగు దేశం పార్టీ అభ్యర్థి కోరాని సాయన్న రత్నం చేతిలో ఓడిపోయాడు. 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి కోరాని సాయన్న రత్నంపై 781 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అనంతరం టీఆర్ఎస్ పార్టీలో చేరాడు. 2018లో జరిగిన తెలంగాణ ముందస్తు ఎన్నికల్లో టీఆర్ఎస్ నుంచి పోటీ చేసి 33 వేల 552 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఇక 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో గెలిచారు.

# ప్రతిష్ఠాత్మకంగా రాష్ట్రంలో రోడ్ల నిర్మాణం

## త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం
## కేంద్ర బృందం వచ్చేలోగా నివేదికలు సిద్ధం
## అధికారులతో మంత్రి కోమటిరెడ్డి సమీక్ష

హైదరాబా ద్:

మనం నిర్మించే ప్రతి రోడ్డు ప్రజలకు ఉపయోగపడాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో రోడ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాల్సి ఉందన్నారు. జూలై మొదటి వారంలో ఎన్‌హెచ్ ఉన్నతాధికారుల బృందం రానున్న నేపథ్యంలో ప్రస్తుతం మంజూరై పనులు నడుస్తున్నవి, పలు అనుమతుల కోసం పనులు ఆగిపోయినవి, అప్‌గ్రేడ్ కోసం విన్నవించిన జాతీయ రహదారులకు సంబంధించిన సమస్త సమాచారంతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల కారణంగా రోజూ పదుల సంఖ్యలో అమాయకులు ప్రాణాలు కోల్పోతుంటే నిర్లక్ష్యం తగదని అధికారులకు సూచించారు. ఎన్ని కోట్లు పెట్టిన పోయిన ప్రాణం తిరిగి రాదని.. ప్రభుత్వం నిర్మించాల్సిన రోడ్డు మూలంగా ప్రజల ప్రాణాలు పోతే.. ఇక ప్రభుత్వం ఉండి ఎందుకని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ హైటెక్ సిటీలోని న్యాక్ ఆఫీసులో జాతీయ రహదారులపై ఎన్‌హెచ్, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. రాష్ట్రానికి మణిహారంగా మారనున్న రీజినల్ రింగ్ రోడ్డు ( ఆర్‌ఆర్‌ఆర్ )పై మరింత పకడ్బందీగా కసరత్తు చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సూచించారు. ముఖ్యంగా ఆర్‌ఆర్‌ఆర్ విషయంలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావు ఇవ్వకుండా పనులను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఆర్‌ఆర్‌ఆర్ విషయంలో మరింత చురుగ్గా పనులు చేయాలని మంత్రి సూచించారు. ఒక్క ఆర్‌ఆర్‌ఆర్ పనులు ప్రారంభమైతే రాష్ట్రానికి ఎంటర్‌టైన్‌మెంట్ జోన్లు, డిస్నీల్యాండ్ వంటి ప్రఖ్యాత సంస్థలు, ట్రాన్స్‌పోర్టు హబ్‌లు, పారిశ్రామిక కారిడార్లు ఏర్పడి రాష్ట్రం ఎంతో అభివృద్ధిని సాధిస్తుందని చెప్పారు. మన్నెగూడ రోడ్డు నిర్మాణంలో జరుగుతున్న ఆలస్యంపై అధికారులను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల ప్రకారం 930 చెట్లను రిలోకేట్ చేయాల్సి ఉండటంతో పాటు పలు అనుమతుల వల్ల ఆలస్యమవుతుందని ఈ సందర్భంగా మంత్రికి అధికారులు వివరించారు. అప్పుడు చెట్లు లేకుండా రోడ్ల నిర్మాణానికి అనువుగా ఉన్న ప్రాంతాల్లో రోడ్డు ఎందుకు నిర్మించడం లేదని మరోసారి ప్రశ్నించారు. ఆలస్యానికి సాకులు వెతక్కుండా, జరగాల్సిన పనులు జరపాలని అన్నారు. ఇబ్బందులు ఉన్నచోట్ల సమస్యల్ని పరిష్కరించేందుకు మార్గం వెతకాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రీలొకేట్ చేయాల్సిన 330 చెట్లను కాంట్రాక్టు సంస్థతో రేపు మాట్లాడి చేయిస్తానని చెప్పారు. మిగితా వాటి సంగతిని వారంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఏదైనా ఇబ్బంది ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. హైదరాబాద్‌`విజయవాడ జాతీయ రహదారికి సంబంధించిన కాంట్రాక్ట్‌ను ఫోర్ క్లోజ్ చేసి, వచ్చే నెలలో కొత్త టెండర్లు పిలిచి, సెప్టెంబర్‌లో పనులు ప్రారంభించేలా ప్రణాళికలు రూపొందించామని మంత్రి తెలిపారు. ఇందులో ఎలాంటి అవాంతరాలు ఎదురుకాకుండా ప్రతి నిత్యం పర్యవేక్షించాలని జాతీయ రహదారుల సంస్థ ఆర్వో రజాక్‌ను ఆదేశించారు. ఆర్మూర్‌`మంచిర్యాల జాతీయ రహదారి కోసం 630 హెక్టార్ల భూమి కావాల్సి ఉండగా.. ఇప్పటికే 530 హెక్టార్లు సేకరించామని ఈ సందర్భంగా మంత్రికి అధికారులు తెలిపారు. మిగతా పనులను ఈ నెలలో పూర్తి చేస్తామని వివరించారు.ఎల్బీనగర్‌`మల్కాపూర్ రోడ్డులో మన్నెగూడ వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు వద్ద నిర్మించాల్సిన బ్రిడ్జ్ సమస్యల గురించి మంత్రికి అధికారులు వివరించగా పరిష్కారానికి హామీ ఇచ్చారు.

# ఇంత అధ్వానమా..

**మొదటిపేజీ తరువాయి**

2023 మే నెల 17న పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ పనులను ప్రారంభించారు. కాగా గుత్తేదారు అంబేద్కర్ భవనం సమీపం నుంచి బన్నె చెరువు కట్ట మీదుగా 670 మీటర్ల మేరకు బీటీ రోడ్డు నిర్మించారు. మిగతా దూరంలోఫార్మేషన్ చేశారు. కాగా బీటీ రోడ్డు నెలరోజులు తిరగకుండానే బీటలు వారడం మొదలయింది. ఇక ఏడాది గడిచిందో లేదో ఎక్కడికక్కడ పగుళ్లతో చెరువు కట్ట పొడవునా కుంగిపోయింది. ఇంత అద్వానంగా పనులు చేశారా అనేలా రోడ్డు దుస్థితి కనిపిస్తోంది. ఇరువైపులా మొరం పోయక పోవడంతో వర్షాలకు కొన్నిచోట్ల రోడ్డు కోతకు గురైంది. రైతులకు బురద కష్టాలు దూరం చేయాలనే ఉద్దేశంతో రహదారి నిర్మించినా నాణ్యత లేని పనుల వల్ల నామమాత్రంగా మారింది.

నడకదారుల్లో నాణ్యత లోపం

మంథని పట్టణంలోని తమ్మ చెరువు, రావులచెరువు, బొక్కల వాగు సుందరీకరణ కోసం టీయూఎఫ్ ఐడీసీ నిధులతో వివిధ పనులు చేపట్టారు. తమ్మ చెరువుపై రూ.30 లక్షలతో నిర్మించిన పాత్ వే( నడకదారి ) నాసిరకం పనులకు సాక్ష్యంగా నిలిచింది. ఇప్పటికే కట్ట పొడవునా సీసీ వేశారు. కాగా పలు చోట్ల పగుళ్లు కనిపిస్తున్నాయి. గడువు ముగిసినా పనులు పూర్తికాలేదు. రావులచెరువుపై రూ. 30 లక్షల చేపట్టిన పనులు నాసిరకంగానే ఉన్నాయి. టైల్స్ కుంగిపోతున్నాయి. ఇక్కడ కూడా పనులు అసంపూర్తి దశలోనే నిలిచిపోయాయి. మరోవైపు బొక్కల వాగుపై రూ. 1.99 కోట్లతో సీసీ రోడ్డు నిర్మించగా నాణ్యత ప్రశ్నార్థకమైంది. పలుచోట్ల పగుళ్లు తేలిన తీరు నాణ్యత ప్రమాణాలు పాటించలేదని రుజువు చేస్తోంది. కాగా చెరువు కట్టలు నల్లరేగడివి కావడంతో వాటిపై నిర్మించిన రోడ్లపై పగుళ్లు వస్తున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు చెబుతుండడం గమనార్హం.



తమ్మచెరువుపై బీటలు వారిన నడకదారి



బొక్కల వాగుపై సీసీ రోడ్డుకు పగుళ్లు



రావులచెరువుపై కుంగిన టైల్స్

# షాద్‌నగర్ ఘటనపై సిఎం రేవంత్ ఆరా

## తక్షణ చర్యలకు కలెక్టర్‌కు ఆదేశాలు



**హైదరాబాద్:** షాద్‌నగర్ ప్రమాద ఘటనపై అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి అప్రమత్తం చేశారు. గాయపడిన వారిని వెంటనే ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్సలు అందించాలని ప్రమాద స్థలిలోనే ఉన్న కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశా రు. రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖ, కార్మిక, పరిశ్రమలు, వైద్య బృం దాలు సమన్వయంతో సహాయక చర్యలు ముమ్మరం చేయాలన్న సీఎం ఆదేశిం చారు. షాద్‌నగర్ లోని సౌత్ గ్లాసు పరిశ్రమలో కంప్రెషర్ పేలడంతో ఆరుగురు మృతి చెందారు. మరో 15 మందికి గాయాలయ్యాయి. కార్మికుల మృతదే హాలు ఛిద్రమయ్యాయి. పలువురి పరిస్థితి విషమంగా ఉంది. ఘటనాస్థలికి చేరుకొని మంటలు అదుపు చేసేందుకు యత్నిస్తున్నారు. కంప్రెషర్ పేలడంతో ఈ ఘటన జరిగిందని పోలీసులు అంచనా వేస్తున్నారు. తీవ్ర గాయాలైనవారిని మెరుగైన చికిత్స కోసం ఉస్మానియా, గాంధీ ఆస్పత్రికి తరలించే అవకాశం ఉంది.

# వేములవాడ గోశాల ఆధునీకరణకు నిధులు



**హైదరాబాద్:** వేములవాడ రాజన్న ఆలయంలోని గోశాల అధునీకరణకు రాష్ట్ర దేవాదాయ శాఖ కోటి పదకొండ లక్షల రూపాయల నిధుల ప్రపోజల్ కు అనుమతిచ్చింది. దక్షిణ కాశీగా పిలవబడుతున్న వేములవాడ రాజన్న ఆలయంలో ఇటీవల గోశాల, కోడెల పరిస్థితి దయనీయంగా ఉండటంతో భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఐదు రోజుల క్రితం గోశాలను స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ సందర్శించారు. వెంటనే గోశాల ఆధునీకరణకి ప్రభుత్వానికి ప్రపోజల్ పంపించగా.. 2 రోజుల్లోనే దేవాదాయ శాఖ నుండి అనుమతి లభించింది. అనుమతి కోసం కృషి చేసిన ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ కి, ఆలయ అధికారుల కృతజ్ఞతలు తెలిపారు. కొత్త షెడ్స్ కోసం రూ.50 లక్షలు, గోశాలలో సీసీ రోడ్ల కోసం రూ.43 లక్షలు, డ్రైనేజీ కోసం రూ.18 లక్షల నిధులకు అనుమతి లభించింది.

# శ్రీలంకలో ఆర్థిక నేరాల్లో భారతీయులు

## 60మందిని అరెస్ట్ చేసిన స్థానిక పోలీసులు




**కొలంబో:** శ్రీలంకలో అన్‌లైన్‌లో ఆర్థిక నేరాలకు పాల్పడుతున్న 60 మంది భారత జాతీయులను ఆ దేశ సీఐడీ అధికారులు అరెస్ట్ చేశారు. కొలంబో శివారు లోని మాడివేల, బత్రాముల్లాతో పాటు పశ్చిమ తీర పట్టణం నెగొంబోలో దాడులు చేసి వీరిని సీఐడీ అదుపులోకి తీసుకుం దని పోలీస్ ఉన్నతాధికారి వెల్లడించారు. 135 సెల్ ఫోన్లతోపాటు 57 ల్యాప్ టాప్‌లను వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నట్లు వివరిం చారు. సోషల్ మీడియా, వాట్సప్ గ్రూప్‌ల ద్వారా నగదు ఇస్తామని చెప్పి.. వీరంతా ఓ పథకం ప్రకారం ప్రజలను ముగ్గులోకి దింపి వారి నుంచి నగదు కాజేస్తున్నారన్నారు. బాధితుడు ఫిర్యాదు మేరకు ఈ దాడులు నిర్వహించినట్లు చెప్పారు. అయితే నెగొంబోలో నిర్వహించిన దాడుల్లో కీలక అధారాలు లభించాయన్నారు. ఆ క్రమంలో తొలుత 13 మంది అనుమానితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 57 ఫోన్లు, కంప్యూటర్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం మరో 19 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరి చేతిలో మోసపోయిన వారిలో విదేశీయులు సైతం ఉన్నారని చెప్పారు. దీంతో బాధితుల జాబితాలో స్థానికులతోపాటు విదేశీయులు కూడా ఉన్నారని పోలీసులు వివరించారు.

# నిజామాబాద్ సమస్యలపై సిఎంను కలుస్తా

## పైలట్ ప్రాజెక్టులను సొంత నియోజకవర్గాలకా - నిజామాబాద్ ఎంపి ధర్మపురి అర్వింద్



**న్యూఢిల్లీ:** నిజామాబాద్ పార్లమెంట్ నియోజక వర్గం పరిధిలో నిజాం షుగర్ ఫ్యాక్టరీ, జక్రాన్ పల్లి ఎయిర్ పోర్టు ఏర్పాటు అంశాలు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిపై త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి చర్చిస్తానని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ తెలిపారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటు లో భాగంగా పైలెట్ ప్రాజెక్టు కోసం కొడం గల్, మధిర అసెంబ్లీ నియోజవర్గాలను ప్రభు త్వం ఎంపిక చేయడాన్ని ఆయన విమర్శిం చారు. శుక్రవారం ఢిల్లీలో అర్వింద్ మీడి యాతో మాట్లాడుతూ పైలట్ ప్రాజెక్టుల విషయంలో మీ సొంత నియోజకవర్గాలను మీరు చూసుకుంటే మరి తెలంగాణను ఎవరు చూసుకోవాలని ప్రశ్నించారు. ఇంటిగ్రే టెడ్ పాఠశాలల ఏర్పాటులో మీ విజన్ ఏమిటో తెలియాలంటే రాష్ట్ర జాగ్రఫికల్‌గా పైలట్ ప్రాజెక్టులను ఎంచుకోవాలే తప్ప సొం త నియోజకవర్గాల్లో ఎంపిక చేస్తే దానిని ప్రజాపాలన అనరని విమర్శించారు. ఉమ్మడి ఏపీలో రాజశేఖర్ రెడ్డి హయాంలో తెలం గాణ, ఆంధ్ర, రాయలసీమ యూనివర్సిటీలను నెలకొల్పి రాయలసీమ యూనివర్సిటీకి అధిక నిధులు కేటాయించి విమర్శల పాలైన సంగతిని ఆయన గుర్తు చేశారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కోసం పైలట్ ప్రాజెక్టు కింద ఆర్మూర్‌ను ఎంచుకుంటే ఉత్తర తెలంగాణకు అది సెంటర్ పాయింట్ అవుతుందని, దాని వల్ల ప్రభుత్వ ఉద్దేశం, లక్ష్యం ఏమిటో స్పష్టం అవుతుందన్నారు. పైలట్ ప్రాజెక్టు కింద రెండు యూనిట్లు ఎంచుకుంటే ఒకటి ఉత్తర తెలంగాణకు మరొ కటి దక్షిణ తెలంగాణ నుంచి ఉండాలని లేదా నాలుగు ఎంచుకుంటే రాష్ట్రం నలుదిక్కులా ఏర్పాటు చేస్తే ఆ పథకాల వాస్తవ పరిస్థితులు తెలుస్తాయని అన్నారు. ఇంటిగ్రేటెడ్ పాఠశా లను పైలట్ ప్రాజెక్టు కింద ఆర్మూర్‌లో ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి కోరుతున్న డిమాండ్ న్యాయమైనదేనని మద్దతు పలికారు. అప్పటి వరకు రాకేశ్ రెడ్డి ఆమరణ నిరాహార దీక్ష విరమించుకోవాలని కోరారు.

केनरा बैंक Canara Bank
सिंडिकेट Syndicate
జెఎస్ఎన్ కాలనీ బ్రాంచ్
ఇం.నెం. 7-71/4, స్ట్రీట్ నెం. 8, హబ్సిగూడ, మహేశ్వరి నగర్-500007

(అనుబంధము-10) **స్వాధీనతా ప్రకటన** (స్థిరాస్తి కొరకు)

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) (ఇకముందు చట్టంగా వ్యవహరించెదరు) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచూ **కెనరా బ్యాంక్** వారి అధీకృత అధికారి అయిన ఈ క్రింది సంతకందారు **తేది: 22.04.2024**తో జారీ చేసిన డిమాండ్ నోటీసు ప్రకారము **రుణగ్రహీత/లు: మెస్సర్స్ సునీత టెక్నాలజీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్,** ఫ్లాట్ నెం. 102, 1వ అంతస్తు, కెఎస్ఆర్ అపార్ట్‌మెంట్స్, స్నేహ నగర్ కాలనీ, ఇం.నెం. 1-4-55/102, ప్లాట్ నెం. 4, సర్వే నెం. 19 & 20 (భాగము), స్ట్రీట్ నెం. 8, హబ్సిగూడ, హైదరాబాద్-07 మరియు **డైరెక్టర్లు 1. శ్రీ ఉజ్జరే చంద్రకాంత్, తండ్రి: లేట్ శ్రీ దశరత్, డైరెక్టర్ 2. శ్రీమతి ఉజ్జరే సునీత, భర్త: శ్రీ ఉజ్జరే చంద్రకాంత్**లను నోటీసులో తెలిపిన బకాయి మొత్తము **రూ. 57,62,921.44 (రూపాయలు యాభై ఏడు లక్షల అరవై రెండు వేల తొమ్మిది వందల ఇరవై ఒక్కటి మరియు పైసలు నలభై నాలుగు మాత్రమే)**లను నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించమని కోరడమైనది.

కాని సదరు రుణగ్రహీత బకాయి మొత్తమును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున సదరు చట్టములోని రూల్ 8 & 9తో చదవబడు సెక్షన్ 13(4) క్రింద అతడు/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచూ క్రింద తెలిపిన ఆస్తిని **తేది: 28 జూన్, 2024**న స్వాధీనం చేసుకోవడమైనదని రుణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు తెలియజేయడమైనది.

కావున ప్రత్యేకించి రుణగ్రహీత/లు మరియు సాధారణ ప్రజానీకమును హెచ్చరించడమేమనగా సదరు ఆస్తులతో ఎటువంటి లావాదేవీలు జరుపకూడదనియు ఒక వేళ జరిపినట్లయితే **కెనరా బ్యాంక్** వారికి చెందిన బకాయి మొత్తము **రూ. 57,62,921.44 (రూపాయలు యాభై ఏడు లక్షల అరవై రెండు వేల తొమ్మిది వందల ఇరవై ఒక్కటి మరియు పైసలు నలభై నాలుగు మాత్రమే)** మరియు దానిపై వడ్డీ క్రింద వర్తించును.

సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు గల సమయ లభ్యత కొరకు చట్టములోని సెక్షన్ 13(8)ని గమనించవలసిందిగా రుణగ్రహీతలను కోరడమైనది.

**స్థిరాస్తి వివరణ**

తెలంగాణ (ఇంతకుముందు రంగారెడ్డి జిల్లా), మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, ఉప్పల్ మం॥ మరియు మున్సిపాలిటీ, హబ్సిగూడ గ్రా॥, స్నేహ నగర్ కాలనీ వద్ద సర్వే నెంలు. 19 & 20 (భాగము)లోని మొత్తం భూమి 480 చ॥గ॥ల లేదా 397 చ॥మీ॥ల విస్తీర్ణము కలిగిన ప్లాట్ నెం. 4లో నిర్మించబడిన "కె.ఎస్.ఆర్. అపార్ట్‌మెంట్స్" నందు మొత్తం భూమి నుండి 34.00 చ॥గ॥లు లేదా 28.42 చ॥మీ॥లు అవిభాజ్యవాటాతోపాటు 1200 చ॥అ॥ల (కామన్ ఏరియాలతో కలుపుకొని) ప్లింత్ ఏరియా కలిగిన 1వ అంతస్తులోని ఫ్లాట్ నెం. 102, మున్సిపల్ ఇం.నెం. 1-4-55/102 యావదాస్తి. భూమి **సరిహద్దులు: ఉత్తరం:** ఇం.నెం. 4-43/3, ప్లాట్ నెం. 1 & రోడ్డు, **దక్షిణం:** పొరుగువారి గృహము, **తూర్పు:** టోర్షన్ ఉత్పత్తులు, **పడమర:** ప్లాట్ నెం. 5. **ఫ్లాట్ యొక్క సరిహద్దులు: ఉత్తరం:** ఖాళీ ప్రదేశం, **దక్షిణం:** ఫ్లాట్ నెం. 101, **తూర్పు:** ఫ్లాట్ నెం. 103, లిఫ్ట్ & కారిడార్, **పడమర:** ఖాళీ ప్రదేశం.

**తేది: 28.06.2024,** ప్రదేశము: హైదరాబాద్ సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

SBI **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
స్ట్రెస్డ్ అస్సెట్ రికవరీ బ్రాంచ్ (కోడ్-05172)
2వ అంతస్తు, టిఎస్ఆర్‌టిసి బిల్డింగ్ కమ్యూటర్స్ ఎమెనిటీ సెంటర్, బస్ టెర్మినల్ కాంప్లెక్స్, కోఠి, హైదరాబాద్-500095, ఫోన్: 040-24651352/1325, ఇ-మెయిల్: sbi.05172@sbi.co.in

**స్వాధీనతా నోటీసు**
**(రూల్-8 (1)) (స్థిరాస్తి కొరకు)**

**ఖాతా నెం. టిఎల్/హెచ్ఎల్40287324214**

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 నెం. 3 ఆఫ్ 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదవబడు సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచూ **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** వారి అధీకృత అధికారి అయిన ఈ క్రింది సంతకముదారు **తేది: 18.04.2024తో జారీ చేసిన డిమాండ్ నోటీసు** ప్రకారము **రుణగ్రహీత: శ్రీ బొల్లు శ్రీనివాస్, తండ్రి: బొల్లు అశప్ప,** ఇం.నెం. 4-4-122, హరిజనవాడ గడి, జహీరాబాద్ టౌన్ & మం॥, సంగారెడ్డి-502220 వారిని నోటీసులో తెలిపిన రుణబకాయి మొత్తం **తేది: 18.04.2024** నాటికి గల **రూ. 20,92,738/- (రూపాయలు ఇరవై లక్షల తొంభై రెండు వేల ఏడు వందల ముప్పై ఎనిమిది మాత్రమే) సదరు తేది** నుండి ఒప్పంద రేటు వంతున వడ్డీ, అనుషంగిక ఖర్చులు, చార్జీలు మొ॥గు॥ వాటితో కలుపుకొని నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించమని కోరడమైనది.

సదరు రుణగ్రహీత బకాయి మొత్తము చెల్లించుటలో విఫలమైనందున సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002లోని రూల్ 8తో చదవబడుతూ సదరు చట్టములోని సెక్షన్ 13(4) క్రింద ఆమెకు సంక్రమించిన అధికారములను వినియోగించుకొనుచూ ఈ క్రింది సంతకముదారు దిగువ తెలిపిన **శ్రీ బొల్లు శ్రీనివాస్ (రుణగ్రహీత), తండ్రి బొల్లు అశప్ప** ఆస్తిని **26 జూన్, 2024**న స్వాధీనము చేసుకోవడమైనదని రుణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు తెలియజేయడమైనది.

కావున ప్రత్యేకించి రుణగ్రహీతను మరియు సాధారణ ప్రజానీకమును హెచ్చరించడమేమనగా సదరు ఆస్తితో ఎటువంటి లావాదేవీలు జరపకూడదనీయు ఒక వేళ జరిపినట్లయితే **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** వారికి చెందవలసిన రుణ బకాయి మొత్తం తేది: 26.04.2024 నాటికి గల **రూ. 21,59,111/- (రూపాయలు ఇరవై ఒక్క లక్షల యాభై తొమ్మిది వేల నూట పదకొండు మాత్రమే)** దానిపై వడ్డీ, అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, చార్జీల క్రింద వర్తించును.

సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు గల సమయ లభ్యత కొరకు చట్టములోని సెక్షన్ 13(8)ని గమనించవలసిందిగా రుణగ్రహీతలను మరియు హామీదారులను కోరడమైనది.

**స్థిరాస్తి వివరణ**

అనుబంధము 1 ప్రకారము సర్వే నెం. 226/ఎలో 150.00 చ॥గ॥లు లేదా 125.41 చ॥మీ॥ల విస్తీర్ణము గల భూమి నందు ప్లాట్ నెం. 16 భాగము బి లో కొత్తగా నిర్మించబడిన 975.00 చ॥అ॥ల గ్రౌండ్‌ఫ్లోర్ ప్లింత్ ఏరియా కలిగిన నివాస గృహము యావదాస్తి. **సరిహద్దులు: ఉత్తరం:** ప్లాట్ నెం. 16 భాగము ఎ, **దక్షిణం:** 33'-00' వెడల్పు రోడ్డు, **తూర్పు:** 33'-00' వెడల్పు రోడ్డు, **పడమర:** ప్లాట్ నెం. 17 భాగము.
సదరు షెడ్యూల్డ్ ఆస్తి ఎస్ఆర్ఓ మెదక్ సదాశివ్‌పేట్ వద్ద నమోదైన సేల్ డీడ్ రిజిస్ట్రేషన్ నెం. **5562/2021, తేది: 14.07.2021** ప్రకారం సంగారెడ్డి, రిజిస్ట్రేషన్ సబ్‌జిల్లా సదాశివ్‌పేట్, రెవెన్యూ మండల పరిషత్ కొండాపూర్, మల్కాపూర్ గ్రా॥ & గ్రా॥ పంచాయతీ పరిధి వద్ద కలదు.

ప్రదేశం: హైదరాబాద్, సం/- అధీకృత అధికారి,
**తేది: 26.06.2024,** ఎస్‌బిఐ, ఎస్ఎఆర్‌బి, కోఠి, హైదరాబాద్

# టీచర్లల బదిలీతో విద్యార్థుల్లో ఉద్వేగం

## కన్నీరు మున్నీరయిన పిల్లలు



నల్లగొండ : ఉపాధ్యాయులతో పిల్లల అనుబంధం విడదీయరానిది. బదిలీపై వెళ్లినప్పుడు అక్కడున్న వారంతా బదిలీపై వెళుతున్న అధికారు లను చూసి బాధపడుతుంటారు. కొందరు వెళ్లొద్దంటూ వేడుకొంటూ ఉంటారు. తాజాగా ఇటువంటి అనుభవమే కొందరు ఉపాధ్యాయులకు తెలంగాణలో ఎదురైంది. ఇన్నాళ్లు విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించిన ఆ ఉపాధ్యాయులు బదిలీపై వెళుతుంటే.. పదుల సంఖ్యలో విద్యార్థులు వారి చుట్టూ చేరి వెళ్ళొద్దంటూ వేడుకున్నారు. తెలంగాణలోని రెండు ప్రాంతాల్లో చోటు చేసుకున్న ఈ ఘటనలకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ మారాయి. దీనికి సంబంధించిన వివరాలు ఎలా ఉన్నాయి. తెలంగాణలోని సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం పోలుమల్ల జిల్లా పరిషత్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయు డిగా సైదులు గడిచిన 14 ఏళ్లుగా పని చేస్తున్నారు. విద్యార్థులకు విద్యా బుద్ధులు చెప్పడంలో టీచర్ గా కాకుండా స్నేహితుడిగా వ్యవహరి స్తూ వచ్చిన ఉపాధ్యాయుడు విద్యార్థులకు ఆప్తుడిగా మారిపోయారు. ఆ టీచర్ ఎప్పుడు రాకపోయినా ఆ విద్యార్థులు మనసు కలత చెందుతూ ఉంటుం ది. అటువంటి ఉపాధ్యాయులకు కొద్ది రోజుల కిందట బదిలీ అయింది. ఆ మాస్టారు ఇకపై రారని తెలుసుకున్న విద్యార్థులు కన్నీరు మున్నీరుగా వినిపించారు. బదిలీ అయిన ప్రాంతానికి వెళ్లేందుకు ఉపాధ్యాయుడు సిద్ధమవుతుండగా తమను వదిలి వెళ్ళవద్దు అంటూ ఉపాధ్యాయుడిని పట్టుకుని విద్యార్థులంతా ఏడ్చారు. అంతేకాకుండా పదుల సంఖ్యలో విద్యార్థులు ఉపాధ్యాయుడు కాళ్ళ మీద పడి మరి బోరున విలపించారు. మీరు ఇక్కడే ఉండాలి మాస్టారు అంటూ విలపించారు. ఉపాధ్యాయుడు సైదులు వెళ్లడాన్ని విద్యార్థులు జీర్ణించుకోలేకపోయారు. అయినా, సరే మాస్టారు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొనడంతో.. విద్యార్థులు ఉపాధ్యాయుడు సైదులుకు ఘనంగా వీడ్కోలు పలికారు. సరిగ్గా ఇటువంటి ఘటనే జనగామ జిల్లాలోనూ చోటుచేసుకుంది. జనగామ జిల్లా శామీర్‌పేట ప్రాథమిక పాఠశాలలో సుధీర్ అనే ఉపాధ్యాయుడు గత కొన్నాళ్ల నుంచి పని చేస్తున్నారు. ఆయనకు తాజాగా మరోచోటకు బదిలీ అయింది. సుధీర్ మాస్టారు బదిలీపై వెళుతున్న విషయం తెలుసుకున్న విద్యార్థులు గేటుకు అడ్డుగా నిలబడి వెళ్ళవద్దు అంటూ మాస్టారును వేడుకున్నారు. మీరు ఇక్కడే ఉండాలి మాస్టారు అంటూ మాస్టారుకు విజ్ఞప్తి చేశారు. కన్నీటి పర్యంతమై అడ్డుకోవడానికి ప్రయత్నించిన విద్యార్థులను చూసి సుదీర్ మాస్టర్ కళ్ళల్లో కూడా నీళ్లు తిరిగాయి. మళ్లీ వస్తానంటూ విద్యార్థులకు ధైర్యం చెప్పి ఆయన బయలుదేరి వెళ్లారు. మాస్టారు వెళ్లిన తర్వాత కూడా విద్యార్థులు కన్నీరు మున్నీరుగా విలపించిన తీరు చూసిన స్థానికులు భావోద్వేగానికి గురయ్యారు.

# కమలాపూర్‌లో బోల్తాపడ్డ స్కూల్ బస్సు

## ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులకు గాయాలు - సోషల్ మీడియాలో వైరల్‌గా ప్రమాద దృశ్యం



**హనుమకొండ:** కమలాపూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డుపై యూ టర్న్ తీసుకుంటున్న స్కూల్ బస్సును వేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో అదుపుతప్పిన బస్సు రోడ్డుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బస్సు రోడ్డుకు అడ్డుగా పడిపోయింది. ఇందుకు సంబంధించిన షాకింగ్ వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. గురువారం సాయంత్రం ఈ ప్రమాదం జరిగింది. హను మకొండ జిల్లా కమలాపూర్‌లో గురువారం సాయంత్రం ఏకశిలా పాఠశాలకు చెందిన స్కూలు బస్సు పిల్లలతో వెళ్తుంది. స్కూల్ సమయం ముగియడంతో పిల్లలను దించడానికి వెళ్తుంది. ఈ క్రమంలో కమలాపూర్ మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై యూటర్న్ తీసుకుంటుంది. ఇంతలో అనుకోని రీతిలో అటుగా ఓ కారు వేగంగా దూసుకొచ్చింది. బస్సు వెనుకనుంచి వేగంగా దూసుకొచ్చిన కారు దానిని బలంగా ఢీకొట్టింది. దీంతో బస్సు అదుపుతప్పి రోడ్డుపై బోల్తా పడింది. ప్రమాద సమయంలో అక్కడే ఉన్న ఓ వ్యక్తి వెంటనే బస్సు ముందు వైపు ఉన్న అద్దాలు పగలగొట్టేం దుక ప్రయత్నిం చాడు. ఇంతలో బస్సు కిటికీల్లోంచి దూకిన ఇద్దరు విద్యార్థులు అతనికి సహాయం చేయడంతో అద్దం పగిలింది. దీంతో ముందు అద్దం తొలగించి.. బస్సులో ఉన్న మిగతా విద్యార్థులు ఒక్కొక్కరికిగా బయటకు వచ్చారు. ఈ ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులు స్వల్ప గాయాలయ్యాయి. మిగిలినవారంతా క్షేమంగా ఉన్నట్లు సమాచారం. మరోవైపు బస్సును ఢీకొట్టిన కారులోని ప్రయాణికులు ముగ్గురికి తీవ్రంగా గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో బస్సులో 30 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రమాద సమయంలో రోడ్డుకి సమీపంలో ఉన్న ఓ షాప్‌లోని సీసీటీవీ కెమెరాలో ప్రమాద దృశ్యాలు రికార్డయ్యాయి. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడయో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# వరద ఉధృతిలో చిక్కుకున్న పశువులు

## ఎట్టకేలకు బటయపడడంతో కాపరుల ఆనందం

**కుమ్రంభీం ఆసిఫాబాద్:** జిల్లాలో వరద ఉధృతికి పశువులు కొట్టుకుపోయాయి. కాగజ్ నగర్ మండలం అందవెల్లి సమీపంలోని పెద్దవాగుకు శుక్రవారం మధ్యాహ్నం ఒక్కసారిగా వరద ప్రవాహం భారీగా పెరిగింది. ఎగువన కురిసిన భారీ వర్షానికి వరద ఉధృతి పెరగ్గా.. పశువులు కొట్టుకుపోయాయి. వాగును దాటే క్రమంలో దాదాపు 50 పశువులు ప్రవాహానికి వాగులో కొట్టుకుపోతూ కనిపించాయి. అయితే, దీన్ని చూసిన పశువులు కాపరి కేకలు వేస్తూ సాయం కోసం అర్థించాడు. అదృష్టవశాత్తు బ్రిడ్జి పిల్లర్ల వద్ద పశువులు ప్రవాహ ఉధృతిని తట్టుకుని ఈదుకుంటూ సురక్షితంగా ఒడ్డుకు చేరాయి. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ తతంగాన్ని స్థానికులు వీడియో తీయడంతో నెట్టింట వైరల్‌గా మారాయి. మరోవైపు, ఇదే ఆసిఫాబాద్ జిల్లా వరద ప్రవాహంలో చేపల కోసం జనం ఎగబడ్డారు. వాంకిడి మండలం నవేదరి గ్రామ చెరువులో భారీ వర్షానికి వరద ఉధృతి పెరిగింది. ఈ క్రమంలో ప్రవాహంలో చేపలు కొట్టుకుపోతుండగా గ్రామస్థులు అక్కడకి చేరుకుని వలలు, వస్త్రాలతో చేపలు పట్టేందుకు ఎగబడ్డారు. పెద్ద పెద్ద చేపలు చిక్కడంతో హర్షం వ్యక్తం చేశారు.

# పాఠశాలలో విద్యా ప్రమాణాలు పెంచాలి

## కాల్వశ్రీరాంపూర్ మండలంలో పర్యటించిన జిల్లా కలెక్టర్ శ్రీహర్ష - పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, తాసిల్దార్ కార్యాలయం తనిఖీ



**పెద్దపల్లిప్రతినిధి, జూన్ 28( నినాదం):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శుక్రవారం ఆయన కాల్వ శ్రీరాంపూర్ మండలంలో పర్యటించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, తాసిల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అలాగే మండలంలోని వెన్నంపల్లి, మంగపేట, పెగడపల్లి, కూనారం, గంగారం ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కాల్వ శ్రీరాంపూర్‌లో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ శ్రీహర్ష శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటిం చారు. విద్యాప్రమాణాలు, చదివే, రాసే సామర్థ్యాన్ని పరిశీలిం చారు. పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ, మధ్యాహ్న భోజనం నాణ్యత నాణ్యత గురించి కలెక్టర్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచిం చారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. చివరి దశలో ఉన్న పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట పాఠశాల అకాడమీ అధికారి డాక్టర్ పీఎం షేక్, జీసీడీఓ కవిత,ఎంఈఓ సురేందర్ లున్నారు.

**తహసిల్దార్ కార్యాలయం తనిఖీ...** కాల్వ శ్రీరాంపూర్ తహసిల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ శ్రీహర్ష శుక్రవారం తనిఖీ చేశారు. మండలంలో పెండింగ్ ఉన్న ధరణి దరఖాస్తుల గురించి అధికారులను అడిగి తెలుసుకు న్నారు. ప్రభుత్వం సేకరించిన భూముల్లో సమస్యలు,పట్టాదార్ పాస్ పుస్తకం లేకుండా నాలా మార్పు, ఇతర వివరాలను కలెక్టర్ ఆరా తీశారు. భూ సమస్యలపై సమర్పించే దరఖాస్తులను డాక్యుమెంట్లు, రికార్డుల ఆధారంగా పరిష్కరించాలన్నారు. ధరణి దరఖాస్తులు తిరస్కరించే సమయంలో దానికి గల కారణాలను స్పష్టంగా తెలియ జేయాలని కలెక్టర్ సూచించారు.

**ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు తనిఖీ...** కాల్వశ్రీరాంపూర్, కూనారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఆపరేషన్ థియేటర్, జనరల్ వార్డ్, లేబర్ రూమ్, ఫార్మసీ, ల్యాబరేటరిలను పరిశీలించారు. ప్రజలకు అందుతున్న వివిధ సేవల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రతిరోజు నమోదవుతున్న ఔట్ పేషెంట్, ఆసుపత్రిలో జరుగుతున్న ప్రసవాల సంఖ్య, పోషకలోపం ఉన్న పిల్లల కేసులు, ఎన్.సి.డి. సర్వే గురించి వైద్యులను వివరాలడిగారు. ప్రజలకు ప్రభుత్వ వైద్యం పై నమ్మకం కలిగేలా సేవలందించాలని సూచించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట డిప్యూటీ డీఎంహెచ్వో కృపా బాయి, కూనారం వైద్యాధికారి డాక్టర్ భావన, శ్రీరాంపూర్ వైద్యులు శ్రీనివాస్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



# మంత్రి నాదెండ్ల ఆకస్మిక తనిఖీలు

కాకినాడ: మంత్రి నాదెండ్ల మనోహర్ ముమ్మిడివరంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. 10 రైస్ మిల్లులు, గోదాముల్లో శుక్రవారం తనిఖీలు చేసిన ఆయన.. రైస్ మిల్లుల వెనుక వైకాపా నేత ద్వారంపూడి అనుచరులు ఉన్నారన్నారు. ఆరు రైస్ మిల్లుల్లో రేషన్ బియ్యం గుర్తించినట్లు నాదెండ్ల తెలిపారు. తప్పు చేసిన ఎవరినీ వదిలే ప్రసక్తే లేదన్నారు. నిందితులు, అక్రమాలకు పాల్పడిన అధికారులపైనా చర్యలు ఉంటాయని స్పష్టంచేశారు.

# జవహర్ రెడ్డి పదవీవిరమణపై నోటిఫై

## 30న మాజీ సిఎస్ పదవీవిరమణ

**అమరావతి:** మాజీ సీఎస్ జవహర్ రెడ్డి సహా పలువురు ఐఏఎస్ అధికారుల ఉద్యోగ విరమణ తేదీని నోటిఫై చేస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 30న జవ హర్ రెడ్డి ఉద్యోగ విరమణ చేయనున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక సెలవుపై వెళ్లిన ఆయనకు వెనుకబడిన వర్గాల విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సోమవారం పోస్టింగ్ ఇచ్చిన విషయం తెలిసిందే. జవహర్ రెడ్డి చూస్తున్న విభాగం అదనపు బాధ్యతలను అనంతరాముకు అప్పగిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చింది. అలాగే, సీనియర్ ఐఏఎస్ అధికారిణి పూనం మాలకొండయ్య ఉద్యోగ విరమణను సైతం నోట్ఫి÷ చేసింది. సాధారణ పరిపాలన జీపీఎం-ఏఆర్ విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఆమె కొనసాగు తుండగా.. ఆమె అదనపు బాధ్యతలు పోల భాస్కర్‌కు అప్పగిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. పౌర సరఫరాలశాఖ కమిషనర్ అరుణ్, కె.వెంకటరమణారెడ్డి ఉద్యోగ విరమణను జూన్ 30గా నోట్ఫి÷ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది.

**IN THE COURT OF THE HON'BLE XXII ndADDL JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT: HYDERABAD**

O.S. No. 2689 OF 2024

**BETWEEN:**
Raavula Sathyanandam Rajesh
…Plaintiff

**AND**

The Tahsildar,
Saidabad Mandal, Hyderabad
District and All concerned
…. Defendants

Please take notice that the above named Plaintiff herein has filed the above O.S No.2689of 2024 for declaration to declare the Plaintiffas legal heir ofLateSri RaavulaSathyanandam Rama Mohan andLate Smt. Raavula Sathyanandam Amrutha before the Hon'bleXXIInd Junior Civil Judge, City CivilCourt at Hyderabadand the matter is posted on19.07.2024 for appearance, as such if any person/s is/are having any objections they may appear before this court on 19.07.2024 at 10.30 AM either in person or through an Advocate duly instructed by you, failing which the matter will be decided on merits.

**BY ORDER OF THE COURT**

N.MADHURI
ADVOCATE
Office Address : 9-1-364/1/B/8
Opposite RamalayamTemple,
Bapughat, Langerhouse,
Hyderabad-500008
PH NO. 9848996027
9948664212

# సంపాదకీయం

## పివి ఆర్థిక విధానాలను పట్టించుకోని మోడీ !

ఇందిర ఎమర్జెన్సీని పదేపదే ప్రస్తావించి..కాంగ్రెస్‌ను ఇరుకున పెట్టే ప్రయత్నాలు చేస్తున్న ప్రధాని మోడీ.. ఆర్థిక సంస్కరణలపైనా ఇదే విధానం అవలంబిస్తే బాగుండేది. దార్శనికుడు దివంగత ప్రధాని పివి నరసింహారావు అనుసరించిన ఆర్థిక విధానాలను అవలోకనం చేస్తే మంచిది. ప్రపంచానికి ఆదర్శంగా మన ఆర్థిక విధానాలు అవలంబించి...కొడిగట్టిన భారత ఆర్థిక వ్యవస్థను దేదీప్యమానంగా వెలిగించిన మహాను భావుడు పాములపర్తి వెంకట నరసింహారావు అనడంలో సందేహం లేదు. గత పదేళ్లుగా దేశ ఆర్థికరంగం కుదేలయ్యింది. జివిస్టీ గురించి పదేపదే గొప్పలు చెబుతున్న మోడీ రాష్ట్రపతి ప్రసంగంలోనూ దీనిని మరోమారు ప్రస్తావించారు. కానీ క్షేత్రస్థాయిలో జివిస్టీ వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మాత్రం పట్టించుకోవడం లేదు. డాలర్ మారకం రేటు పెరుగుతోంది. వడ్డీరేట్లు పెరుగుతున్నాయి.నిత్యావసర ధరలు అమాంతంగా పెరుగుతున్నాయి. ఇలా ఎందుకు జరుగుతుందో పరిశీలన చేసే ఓపికా,చిత్తశుద్ధి ప్రధాని మోడీకి లేదు. ఆయనకు ఎవరు సలహాలు ఇస్తున్నారో కానీ దేశ ఆర్థిక వ్యవస్థ మాత్రం బతికి బట్టకట్టేలా లేదు. సామాన్యులు దర్జాగా బతకగలిగిన నాడే జిడిపి లెక్కలు బాగున్నట్లు గుర్తించాలి. సామాన్యులు ఇల్లు కట్టుకున్ననాడే మన ఆర్థిక వ్యవస్థ బాగున్నట్లుగా గుర్తించాలి. ఇవన్నీ మోడీకి తెలియవా అంటే తెలుసు. కానీ తెలుసుకుని బాగుచేద్దామన్న సంకల్పమే కానరావడం లేదు. మోడీ ఆర్థిక విధానాలపై వారి లెక్కలు వారికి ఉన్నాయి. వారంతా మేం బ్రహ్మాండగా పాలిస్తున్నామని అనుకుంటున్నారు. పదేళ్ల తరవాత కూడా చావుదప్పి కన్నులొట్టబోయినట్లుగా, బొటాబొటి మెజార్టీతో అధికారంలోకి వచ్చినా... ప్రజలంతా మోడీకి జై కొట్టారని భావిస్తున్నారు. కానీ మోడీ తీసుకుంటున్న నిర్ణయాలు సామాన్యులకు చేటుగా మారాయి. ఉదాహరణకు జివిస్టీకి సంబంధించి తీవ్ర ప్రభావం చూపుతున్న నిర్ణయాలపై చర్చించడం లేదు. అప్పు చేసి, పొదుపు చేసుకుని హెల్త్ ఇన్సూరెన్స్, లైఫ్ ఇన్సూరెన్స్ కడుతున్నవారు జివిస్టీ రూపంలో భారీగగా పన్నులు కట్టి నష్టపోతున్నారు. పాలసీలపై బాదుడు దారుణంగా ఉంది. పేద, మధ్య తరగతి ప్రజలు చెమటోడ్చి కడుతున్న పాలసీలపై 18 శాతం జివిస్టీ కట్టించుకుంటున్నారు. ఇంతమొత్తంలో కట్టడం వల్ల సామాన్యులు కుదేలవుతున్నారు. దీనిపై ఎవరు కూడా చర్చించడం లేదు. ఇలాంటి బాదుళ్లు ఎన్నో ఉన్నాయి. వీటిని ఎక్కడా చర్చించడం లేదు. రాజనీతిజ్ఞత,ఆర్థిక సంస్కరణాలాభిలాష అన్నవి ప్రతిభ ఉండి అమలు చేయగల ధైర్యం ఉన్న నేతకు మాత్రమే సొంతం. ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నాటికి దేశాన్ని కుదిపి వేస్తున్న ఆర్థిక సంక్షోభాన్ని చాకచక్యం గా పరిష్కరించి, దేశానికి బంగారు బాట వేసిన ధీశాలి పివి నరసింహారావు. దేశానికి అవసరమైన ఆర్థిక,రాజకీయ సంస్కరణలతో ముందుకు సాగిన రాజనీతిజ్ఞుడు పీవీ. కానీ ఆయన సంస్కరణలను మరింత ముందుకు తీసుకుని వెళ్లేలా తరవాతి ప్రభుత్వాలు విఫలం అయ్యాయి. పదేళ్లపాటు యూపిఎ ప్రభుత్వంలో ప్రధానిగా ఉన్న నాటి ఆర్థికమంత్రి మన్మోహన్ సింగ్ కూడా మళ్లీ వీటిని సమర్థంగా ముందుకు తీసుకుని వెళ్లలేకపోయారు. నేటి ప్రధాని మోడీ హయాంలో కూడా ఆర్థిక విధానాలు సక్రమంగా అమలు కావడం లేదు. తాను తీసుకుని వచ్చిన జివిస్టీ గురించి గొప్పలు చెప్పడమే తప్ప అవి ప్రజలపై ఏ మేరకు విష ప్రభావం చూపుతున్నాయో గమనించడం లేదు. బిజెపిలో ఉన్న నేతలు కూడా దీనిగురించి చర్చించడం లేదు. ఇప్పుడు ఎన్‌డిఎ పక్షాలు అయినా ఈ జివిస్టీ బాదుడు గురించి చర్చించాలి. లేకుంటే వారిని కూడా ప్రజలు క్షమించారు. ఆర్థిక సంస్కరణ అన్నది ప్రజలను కష్టాలు, నష్టాల నుంచి గట్టెక్కించేలా ఉండాలి. కానీ జివిస్టీతో కష్టాలు, నష్టాలే తప్ప ప్రజలకు ఒనగూరు తున్న ప్రయోజనం లేదు. బ్యాంకులు దివాళా తీయడం మొదలు, బ్యాంకులకు లక్షల కోట్లు ఎగవేసిన కొందరు విదేశాలకు ఉడాయించారు. ఇలాంటి మోసాలను నిరోధించేలా మోడీ చర్యలు తీసుకోలేక పోయారు. మరో పదేళ్లు మోడీ అధికారంలో ఉన్నా ఇవి సాధ్యపడవని గుర్తించాలి. బ్యాంకులకు రుణాలను ఎగవేసి, దేశాన్ని ముంచేసి పారిపోయిన వారిని వెనక్కి రప్పించి కఠిన చర్యలు తీసుకోవడంలో మోడీ విఫలం అయ్యారు. ఎందరో ఎంపిలు, మంత్రుల్లో ఆర్థిక ఎగవేతదారులుగా ఉన్నా వారిపై చర్యలు తీసు కోవడం లేదు. అందుకే ఆనాటి పరిస్థితులను నేటితో పోల్చుకోవాల్సి వస్తుంది. పివి తీసుకున్న నిర్ణయాల వల్ల సామాన్యులకు ఎంతో మేలు జరిగింది. ఆధునిక భారతంలో ఆర్థిక సంస్కరణలను మనదేశం అవలబిం చడం వల్లనే ఇవాళ మనమంతా ఈ స్థితిలో ఉన్నాం అని చెప్పుకోవడానికి దివంగత ప్రధాని పివి నరసింహా రావును నిత్యం స్మరించుకోవాల్సింది. ఆర్థిక సంస్కరణలను ప్రతిపాదించినప్పుడు యధావిధిగానే కమ్యూనిస్టులు వ్యతిరేకించారు. అయితే ఆయన ధైర్యంగా వీటిని ముందుకు తీసుకుని వెళ్లి అమలు చేసిన ధీశాలి. పివి సంస్కరణలతో ప్రపంచంతో వాణిజ్యం పెరగడమే గాకుండా,మన యువత విదేశాలకు చదువులకు, ఉద్యోగాలకు వెళ్లగలిగే అవకాశాలను అందిపుచ్చుకున్నారు. దేశం తీవ్ర ఆర్థికసంక్షోభంలో ఉన్నప్పుడు ,ఊహించని రీతిలో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి మార్కెట్ సరళీకరణ విధానాన్ని రూపొందించి భారత్‌కు మార్గాన్ని చూపారు. ఇప్పుడా మార్గంలోనే మన ఆర్థిక వ్యవస్థ నడుస్తోంది. ఆయన చూపిన బాట నుంచి పక్కకు తప్పినప్పుడల్లా మళ్లీ సంక్షోభాలు ఎదుర్కొంటున్నాం.సంక్షోభ సమయంలో, ఆర్థిక వ్యవస్థ గాడితప్పుతున్న నేపథ్యంలో, ప్రతి ఒక్కరికీ పీవీ ఆర్థిక సంస్కరణలే గుర్తుకు వస్తున్నాయి. రాజకీయాల్లో అరుదైన వ్యక్తిత్వాలు కలిగిన వారు బహు అరుదుగా వస్తుంటారని పివి ఆనాడే నిరూపించారు. అలాగే పదవుల కోసం వెంపర్లాడుతున్న నేటి రాజకీయాల్లో పదవులు వాటంతటవే వెతుక్కుంటూ రావడం...వాటికి వన్నె తేవడం కూడా పివికి మాత్రమే దక్కింది. ఆనాడు పివి అనే మహానుభావుడు ప్రధాని కాకుంటే భారత ఆర్థికస్థితి ఏమయ్యేదో అన్న భయం ఇప్పుడు కలుగుతోంది. అలాంటి మహానుభావుడు పివి రూపంలో భారతదేశానికి సాక్షాత్కరించడం కూడా దేశం చేసుకున్న అదృష్టంగా చూడాలి. భారతదేశ ఆర్థికి స్థితిగతులను బేరీజు వేసుకున్నప్పుడు పివికి ముందు పివి తరవాత అన్న లెక్కలు వేసుకునే స్థితి మనది. రాజకీయాల్లో రాణించడం కోసం ఎత్తులు పై ఎత్తులు వేస్తూ..ఎదుటి వారిని బురిడీ కొట్టించడం అవసరమైతే ప్రత్యర్థులను మట్టుపెట్టడం లాంటి నేటితరం రాజకీయాల్లో అరుదైన వ్యక్తిత్వం కలిగిన మహానుభావుడు దివంగత పివి నరసింహారావు. ఆయన పాలనా సంస్కరణలతో దేశానికి అలాగే కాంగ్రెస్ పార్టీకి చరిత్రలో లిఖించదగ్గ ఘట్టాలను అందించారు. రాజకీయాల్లో స్థితప్రజ్ఞత ఉన్న అరుదైన నేతల్లో పివి ముందుంటారు. ఆయన స్వార్థం కోసం ఏనాడూ రాజకీయాలు చేయలేదు. అలాగే ఆయనలోని స్వార్థం దేశానికి మంచి చేయాలన్న తపన తప్ప మరోటి కాదు. అపర చాణుక్యుడు అంటూ ఆయనను కీర్తించినా రాజకీయాల కోసం తన చాణక్యాన్ని ఎప్పుడూ ప్రదర్శించలేదు. రాజకీయాలను ఆమూలాగ్రం ఔపోసన పట్టిన ఘటికుడు ఆయన. అందుకే వాటిని అర్థం చేసుకుని అందుకు అనుగుణంగా పాలన చేసి..తిరుగులేని నేతగా రుజువు చేసుకున్నారు.

# వాయిదాలతో మొదలైన పార్లమెంట్

**నీట్ పేపర్ లీకేజీపై చర్చకు విపక్షం పట్టు**

**చర్చ కోరుతూ వాయిదా తీర్మానం ఇచ్చిన కాంగ్రెస్**

**తిరస్కరించిన స్పీకర్ ఓంబిర్లా..గందరగోళం మధ్య జూలై1కి వాయిదా**

**న్యూఢిల్లీ, నినాదం:**



లోక్‌సభ సమావేశాలు వాయిదాలతో మొదలయ్యాయి. నీట్‌పేపర్ లీక్‌పై చర్చించాలన్న విపక్షాల డిమాండ్ కారణంగా గందరగోళం మధ్య లోక్‌సభ సోమవారానికి వాయిదా పడిరది.సాధారణ సమావేశాలు శుక్రవారం ప్రారంభం కాగానే నీట్ పేపర్ లీకేజీపై చర్చకు విపక్షనేత రాహుల్ గాంధీ వాయిదా తీర్మానం ఇచ్చారు. విద్యార్థుల భవిష్యత్‌పై చర్చించాల్సి ఉందని, వారికి పార్లమెంట్ భరోసా ఇవ్వాల్సి ఉందని అన్నారు. అయితే నిబంధనల మేరకు రాష్ట్రపతి ప్రసంగంపై చర్చ ప్రారంభించాల్సి ఉన్నందున, అందులో ప్రస్తావించాలని స్పీకర్ ఓంబిర్లా సూచించారు. లేదా మరో తరహాలో చర్చకు అనుమతిస్తామని చెప్పారు. అయితే విపక్ష సభ్యులు అందుకు నిరాకరించారు. నీట్‌పై చర్చ చేయాల్సిందే నని పట్టుబట్టారు. నినాదలతో గందరగోళ పరిచే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో స్పీకర్ ఓంబిర్లా సభను మధ్యాహ్నం 12గంటలకు వాయిదా వేశారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో 'నీట్ పేపర్ లీక్ వ్యవహారం దుమారం రేపుతోంది. దీనిపై చర్చ జరపాలని విపక్షాలు డిమాండ్ చేయడంతో లోక్‌సభ, రాజ్యసభల్లో శుక్రవారం గందరగోళ వాతావరణం నెలకొంది. ప్రతిపక్షాల ఆందోళనలతో లోక్‌సభ సోమవారానికి వాయిదా పడిరది. ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభం కాగానే ఇటీవల మృతిచెందిన పలువురు రాజకీయ ప్రముఖులకు సభ సంతాపం ప్రకటించింది. అనంతరం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని కేంద్రం ప్రవేశపెట్టింది. దీనిపై స్పీకర్ చర్చను ప్రారంభించగా.. ప్రతిపక్షాలు నీట్ అంశాన్ని లేవనెత్తాయి. నీట్ పేపర్ లీక్ అంశంపై విద్యార్థుల కోసం సభలో చర్చించాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కోరారు. ఇందుకు సభాపతి ఓం బిర్లా అంగీకరించకపోవడంతో విపక్షాలు ఆందోళనకు దిగాయి. దీంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. ఆ తర్వాత సభ తిరిగి ప్రారంభమైనప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. అయితే విపక్షాలు నిబంధనలు కాదని డిమాండ్ చేయడం సరికాదని పార్లమెంటరీ వ్యవహారా మంత్రి కిరణ్ రిజు అన్నారు. రాష్ట్రపతి ప్రసంగాన్ని ధన్యావా తీర్మానం అయిపోయాక చర్చకు అవకాశం ఉంటుందని చెప్పారు. అయితే దీనిని విపక్షాలు అంగీకరించలేదు. ప్రతిపక్షాల నిరసన నేపథ్యంలో సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. అటు రాజ్యసభలోనూ ఇదే గందరగోళం కన్పించింది. నీట్ అంశంపై చర్చకు పట్టుబడుతూ విపక్ష సభ్యులు నినాదాలు చేశారు. వారి ఆందోళనల నడుమ కొంతసేపు ఛైర్మన్ సభను నడిపించారు. అయినప్పటికీ వారు తగ్గకపోవడంతో ఛైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. సభ తిరిగి ప్రారంభమైన తర్వాత కూడా ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. వారి నిరసనల నడుమే రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాజ్యసభలో చర్చను చేపట్టారు. అంతకుముందు కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడుతూ.. నీట్ పేపర్ లీక్ సమస్య.. దేశ యువతకు సంబంధించిన కీలకమైన అంశం. దానిపై సభలో అర్థవంతమైన, గౌరవప్రదమైన చర్చను ప్రధాని మోదీ చేపట్టాలి. విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం, ప్రతిపక్షం కలిసి పనిచేస్తోందనే సందేశాన్ని పార్లమెంట్ ఇవ్వాలని అన్నారు. 18వ లోక్‌సభ సమావేశాలు సోమవారం మొదలయ్యాయి. సోమ,మంగళ వారాలు సభలో కొత్త సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమాలతో ముగిసాయి. బుధవారం స్పీకర్ ఎన్నిక జరిగింది. గురువారం ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించారు.శుక్రవారం నుంచి సాధారణ సమావేశాలు మొదలయ్యాయి.

# ఘనంగా పివి జయంతి వేడుకలు

**ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నివాళి**

**పివి ఘాట్ వద్ద నివాళి అర్పించిన ప్రముఖులు**

**తెలంగాణ భవన్‌లో నివాళి అర్పించిన బిఆర్‌ఎస్ నేతలు**

**ఢిల్లీలో నివాళి అర్పించిన మంత్రులు**

హైదరాబాద్:

దివంగత పివి నరసింహారావు జయంతి వేడుకలు తెలుగు రాష్ట్రాలతో పాటు, ఢల్లీలోనూ ఘనంగా జరిగాయి. భారతరత్న, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి. ఆయన జయంతిని తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ఘనంగా జరుపుకున్నారు. హైదరాబాద్ పివి ఘాట్ వద్ద భారత రత్న, దివంగత మాజీ ప్రధాని పివి నరసింహారావు 103వ జయంతి వేడుకలు జరిగాయి. పివి ఘాట్ వద్ద పివి కుమార్తె వాణిదేవి, కుమారుడు ప్రభాకర్ రావు, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, తీగల కృష్ణారెడ్డి, కోదండరామ్, హైకోర్టు జడ్జి శ్రావణ్ కుమార్, తదితరలు నివాళులర్పించారు. ఢల్లీలో తెలంగాణ భవన్‌లో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబులు పివికి నివాళి అర్పించారు. ఆయన చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. పివి ఆర్థిక దార్శనికుడని కీర్తించారు. తెలంగాణ భవన్‌లో పివి నరసింహరావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, ఎంఎల్సీ వాణీదేవి, ఎంఎల్‌ఎ జగదీశ్ రెడ్డి, మహమూద్ అలీలు పూలమాల వేసి నివాళులర్పించారు. భారత రత్న దివంగత మాజీ ప్రధాని పి.వి 103 జయంతి సందర్భంగా గాంధీ భవన్ లో పి వి చిత్ర పటానికి కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపి వి. హనుమంత రావు, డిసిసి అధ్యక్షులు నర్సింహారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంగిశెట్టి జగదీష్, అల్లం భాస్కర్, భవాని రెడ్డి, రాపోలు జయ ప్రకాష్, ప్రేమలత అగర్వాల్, లింగం యాదవ్ తదితరులు నివాళులర్పించారు.

తెలంగాణ భవన్ లో మాజీ ప్రధాని, భారత రత్న పీవీ నరసింహ రావు జయంతి సందర్భంగా పీవీ చిత్రపటం వద్ద బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి, మహమూద్ అలీ, పీవీ కూతురు ఎమ్మెల్సీ వాణి దేవి , మాలోత్ కవిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. భారత దేశ చరిత్ర ఉన్నంత కాలం పీవీ చరిత్ర నిలిచి ఉంటుందని పేర్కొన్నారు. పీవీ నరసింహా రావు గొప్ప సంస్కరణల శీలి అని తెలిపారు. భూ సంస్కరణలో భాగంగా తన కుటుంబానికి చెందిన 800 ఎకరాలను మహనీయులు దారాదత్తం చేశారన్నారు. జైళ్ల శాఖ మంత్రిగా కూడా ఓపెన్ జైల్ విధానంతో సంస్కరణలు చేశారన్నారు.పివి దార్శనికత వల్లనే దేశం ఆర్థికంగా ఎదిగిందని అన్నారు.

### బహుముఖ ప్రజ్ఞాశాలి పివి

**నివాళి అర్పించిన మాజీ సిఎం కెసిఆర్**

హైదరాబాద్:

బహుముఖ ప్రజ్ఞాశాలి, బహుభాషాకోవిదుడు, దేశ ఆర్థిక సంస్కరణల రూపశిల్పి, తెలంగాణ ఖ్యాతిని ఖండాంతరాలకు చాటిన మహా మేధావి, భారత మాజీ ప్రధాని పీవీ నర్సింహా రావు జయంతి సందర్భంగా దేశానికి ఆయన అందించిన సేవలను బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ స్మరించుకున్నారు. నాటి ప్రపంచ ఆర్థిక విధానాలకు అనుగుణంగా సంస్కరణలు చేపట్టి దేశ ఆర్థిక స్థితిని చక్కదిద్దిన దార్శనికుడు, భారతజాతి ముద్దుబిడ్డ పీవీ అని చెప్పారు. తెలంగాణ బిడ్డగా మనందరం గర్వపడాల్సిన పీవీ నరసింహారావు అందించిన స్ఫూర్తి మరువలేనిదని తెలిపారు. కాగా, మౌనమునిగా పేరుగాంచిన పీవీ నరసింహా రావు.. దేశానికి ఎనలేని సేవలు చేసినప్పటికీ కాంగ్రెస్ పాలకులు ఆయనను విస్మరించారు. తెలంగాణ ఆవిర్భావం అనంతరం బీఆర్‌ఎస్ ప్రభుత్వం పీవీకి సముచిత గౌరవాన్నిచ్చింది. ఆయన ఖ్యాతిని యావత్తు దేశానికి, ప్రపంచానికి చాటేందుకు తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఎనలేని కృషి చేశారు. మహనీయుడి చరిత్ర మరుగున పడిపోతున్న తరుణంలో 'పీవీ మన తెలంగాణ ఠీవీ' అంటూ నరసింహారావు ఖ్యాతిని మరోసారి ఎలుగెత్తిచాటారు. ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. ఏడాది పాటు ఘనంగా శత జయంతి ఉత్సవాలు జరిపింది.

**పివి ఆర్థిక సంస్కరణలే దేశానికి దిక్సూచి**

**నివాళి అర్పించిన ఎపి సిఎం చంద్రబాబు**

**అమరావతి:**

బహుముఖ ప్రజ్ఞశాలి, అపార మేధావి, మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహా రావు జయంతి సందర్భంగా ప్రముఖులు నివాళులర్పించారు. పీవీ నరసింహా రావు తెలుగు రాష్ట్రాలకు దేశానికి చేసిన సేవలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్మరించారు. పీవీ నర్సింహారావు జయంతి సందర్భంగా నివాళులు అర్పించారు. విప్లవాత్మక సంస్కరణలు, సాహసోపేత నిర్ణయాలతో భారతదేశం బలమైన ఆర్థిక శక్తిగా ఎదిగేందుకు పునాదులు వేశారని గుర్తుచేశారు. మాజీ ప్రధాని పీవీ జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ నేతలు అంజలి ఘటించారు. రాష్ట్రానికి, దేశానికి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. పదవి చేపట్టిన వన్నె తీసుకొచ్చారు. పీవీ విద్యాశాఖ మంత్రిగా ఉన్న సమయంలో గురుకుల విద్యను ప్రవేశపెట్టారు. కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో నవోదయ పాఠశాలలను ప్రారంభించారు. జైళ్ల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఓపెన్ జైల్ అనే పద్ధతికి శ్రీకారం చుట్టారు. సీఎంగా భూ సంస్కరణలు, ప్రధానిగా ఆర్థిక సంస్కరణలను అమలు చేశారు.



# ఢిల్లీని ముంచెత్తిన భారీ వర్షాలు

**పలు ప్రాంతాలన్నీ జలమయం**

**విమానాశ్రయంలో కూలిన టెర్మినల్ కప్పు**

**కారులోనే ఉన్న వ్యక్తి అక్కడిక్కడే మృతి**

**పలు కార్లు ధ్వంసం...సమాయక చర్యలు ముమ్మరం**

**గటనా స్థలిని పరిశీలించిన మంత్రి రామ్మోహన్ నాయుడు**

న్యూఢిల్లీ:

ఢిల్లీలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఇందిరా గాంధీ విమానాశ్రయం లోని టెర్మినల్ 1లో కొంత పైకప్పు భాగం కూప్పకూలింది. ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. 8 మంది గాయపడ్డారు. వెంటనే సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాదంలో పైకప్పు కింది పార్క్ చేసిన అనేక వాహనాలు కూడా ధ్వంసమయ్యాయి. పైకప్పు కూలడంతో కారులోని వ్యక్తి మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రమాదం కారణంగా పలు విమనాలు రద్దు చేశారు.. కాగా..ఈ ఘటనపై కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు స్పందించారు. ఢల్లీ విమానాశ్రయంలో వ్యక్తిగతంగా తాను పర్యవేక్షిస్తున్నట్టు చెప్పారు. క్షతగాత్రులకు చికిత్స కొనసాగుతోందని అని ట్వీట్ చేశారు. టెర్మినల్`1 దగ్గర సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం 2 వరకు టెర్మినల్`1 నుంచి డిపార్చర్‌కు బ్రేక్ ఇచ్చారు. పునరుద్ధరణ పనుల అనంతరం సర్వీసులను కొనసాగించనున్నారు. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఎయిర్ పోర్టుకు చేరుకుని.. టెర్మినల్ రూఫ్ పడిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులను వివరాలు అడిగితెలుసుకున్నారు.. దీంతో వేగంగా సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. అయితే.. కూలిన టెర్మినల్ 16 ఏళ్ల క్రితం నాటిదని పేర్కొంటున్నారు. ఢల్లీలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. ప్రధాన రహదారుల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఢల్లీ, నోయిడా, ఘజియాబాద్, ఫరీదాబాద్ సహా ఎన్‌సీఆర్‌లో ఏకధాటిగా వర్షం పడుతోంది. ఆర్కేపురం, సరితా విహార్, మునిర్కా, ఇండియా గేట్ ప్రాంతాలు తడిసి ముద్దయ్యాయి. భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఇళ్లలోకి వరదనీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గత రాత్రి నుంచి ఢల్లీలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుంది. కుండపోతగా కురుస్తున్న వర్షంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. భారీగా వరద నీరు రావడంతో లోతట్టు ప్రాంతాల్లో నీళ్లు నిలిచి పోయాయి. రోడ్లపైకి వర్షం నీళ్లు చేరడంతో కొన్ని చోట్ల ట్రాఫిక్ జామ్ అయ్యింది. వాహనాలు నెమ్మదిగా కదులుతుండడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. ఐతే ఉదయం నుంచి వర్షం పడుతుండడంతో వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. ఈసందర్భంగా విమానయానశ్రాఖ మంత్రి రామ్మోమన్ నాయుడు మీడియాతో మాట్లాడుతూ.. ఇది చాలా తీవ్రమైన ఘటన అని వ్యాఖ్యానించారు.ఇక్కడ మీకు ఒక విషయం స్పష్టత ఇవ్వాలనుకుంటున్నాను. ఈరోజు తెల్లవారుజామున కూలినది పాత భవనంలోని పైభాగం. దానిని 2009లో ప్రారంభించారు. ప్రధాని మోదీ ప్రారంభించిన భవనం అవతలివైపు ఉందని వెల్లడిరచారు. కూలిన భాగంలోని కొన్ని బీమ్‌లు తుప్పుపట్టి ఉన్నాయని ప్రశ్నించగా.. 'దీని గురించి ఇప్పుడే మాట్లాడటం తొందరపాటు చర్య అవుతుంది. దీనిపై తనిఖీ చేయమని విమానాశ్రయ అధికారులను ఆదేశించాం. మంత్రిత్వ శాఖ, డీజీసీఏ విడివిడిగా దర్యాప్తు చేస్తుందని వెల్లడిరచారు. విమానాశ్రయంలో జరిగిన ఘటనపై కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. ఆ కూలిన టెర్మినల్‌ను ఇటీవలే ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారని హస్తం పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్ర నాయకురాలు ప్రియాంకాగాంధీ ఆరోపించారు. గత పదేళ్ల కాలంలో మోదీ ప్రభుత్వంలో చోటుచేసుకున్న అవినీతి, నేరపూరిత నిర్లక్ష్యం ఈ దుస్థితికి కారణం' అని దుయ్యబట్టారు. ఈ విమర్శలను ఉద్దేశించే కేంద్రమంత్రి బదులిచ్చారు. అదంతా తప్పుడు సమాచారం అని కొట్టిపారేశారు. కూలిపోయిన ఈ టర్మినల్ పైభాగాన్ని 2008`09 సంవత్సరంలో నిర్మించారని తెలిపారు. ఈ ఘటనపై కేంద్రమంత్రి తీవ్ర విచారం వ్యక్తంచేశారు. ప్రభుత్వం తరఫున మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. గాయపడినవారికి ఒక్కొక్కరికి రూ.3 లక్షలు ఇస్తామని వెల్లడిరచారు. అలాగే సప్దర్‌జంగ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల్ని ఆయన పరామర్శించారు. ఇక ఈ ఘటనతో ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. వారు ప్రయాణించాల్సిన విమానాల గురించిన సమాచారం అందక గందరగోళానికి గురయ్యారు. ఈ క్రమంలో డీజీసీఏ విమానయాన సంస్థలకు ఆదేశాలు ఇచ్చింది. ప్రత్యామ్నాయ విమానాలు ఏర్పాటుచేయాలని, విమానాలు రద్దయితే టికెట్ రీఫండ్ ఇవ్వాలని వెల్లడిరచింది. ఘటన జరిగిన వెంటనే అత్యవసర సహాయ బృందాలు చర్యలు చేపట్టాయని, పలువురు గాయపడ్డారని, వారికి వైద్య సాయం అందించినట్లు తెలిపారు. వెంటనే... టెర్మినల్ 1 నుంచి విమాన సర్వీసులు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ముందు జాగ్రత్త చర్యగా చెక్ ఇన్ కౌంటర్లు అన్ని మూసి వేశామని విమానాశ్రయ వర్గాలు తెలిపాయి. ఢల్లీలో శుక్రవారం తెల్లవారు జాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. ఢల్లీ, గురుగ్రామ్, నోయిడా, ఘజియాబాద్‌లో భారీ వర్షాలు పడుతున్నాయి. పలు ప్రాంతాల్లో కార్లు, బైకులు నీట మునిగాయి.

## ధరణి దరఖాస్తులను పరిష్కరించాలి : కలెక్టర్

**మెదక్ ప్రతినిధి జూన్ 28( నినాదం న్యూస్)**



జిల్లాలో ధరణిలో పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం వెల్దుర్తి మండల తాహాసిల్దార్ కార్యాలయాన్ని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రాథమిక పశు వైద్య కేంద్రంలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధరణి దరఖాస్తుల పరిష్కరణ పురోగతిని కలెక్టర్ పరిశీలించి పరిష్కరించేందుకు తగు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక కార్యాచరణ అమలు చేసి వారం రోజుల్లో పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు. ఆ మేరకు మండల తహసిల్దార్లు రోజువారీగా విభజించుకొని పరిష్కారం చేయాలని ఆదేశించారు. అదనపు సమయం కేటాయించి పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలని సూచించారు. వెల్దుర్తి తహసీల్దార్ కార్యాలయంలో 100 దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయన్నారు. వాటి పరిష్కార దిశగా సత్వరమే చర్యలు చేపట్టాలన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిశీలిస్తూ ప్రజలకు అందుబాటులో నాణ్యమైన వైద్యం అందించాలని మందుల కొరత లేకుండా చూడాలన్నారు. వైద్యాధికారులు ఎలా చూస్తున్నారు ఏ విధమైన మందులు ఇస్తున్నారు ఎలా సమయపాలన పాటిస్తున్నారు సదుపాయాలు ఎలా ఉన్నాయని రోగులను అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులు మందులను పరిశీలించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పశు వైద్య కేంద్రం ను పరిశీలిస్తూ పశువులు రోగాల బారిన పడకుండా కాపాడాలని పశువైద్యాధికారులు సమయపాలన పాటించాలన్నారు. ప్రాథమిక పశు వైద్య కేంద్రంలో పలు రకాల మందులను పరిశీలించారు. పలు రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ తులసి రామ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు

## ఇండోర్ స్టేడియం అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కేపీ

**కుత్బుల్లాపూర్, జూన్ 28 (నినాదం న్యూస్)**



కుత్బుల్లాపూర్ నియోజక వర్గం సుభాష్ నగర్ 130 డివిజన్ ఎస్.ఆర్.నాయక్ నగర్‌లో కొనసాగుతున్న ఇండోర్ స్టేడియం పనులను కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీలా అభివృద్ధి కోసం గతంలో కేటాయించిన ఖాళీ స్థలాలలో ఇండోర్ స్టేడియం, పార్కుల అభివృద్ధి వంటి పనులను చేపట్టడం ద్వారా కాలనీవాసులతోపాటు క్రీడాకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం ఇండోర్ స్టేడియంలో చేపట్టవలసిన పనులపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీ నారాయణ, యూసుఫ్, ప్రభాకర్, ఎస్ ఆర్ నాయక్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు టిటికే శ్రీనివాస్ రావు, మల్లికార్జునరావు, బాబి, పూర్ణచందర్ గుప్త, శేష చారి, భాస్కర్ రెడ్డి, టీ.అనిల్, రమణ గణేశన్, రామకృష్ణ, దుర్గా రావు, కిరణ్, రాజు, హరిబాబు, వర్మ, రామస్వామి, వేణు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## హెల్త్ క్యాంపులు పేద ప్రజల ఆరోగ్యానికి మేలు

**- మేయర్ శాంతి కోటేష్ గౌడ్**

**కాప్రా /జవహర్ నగర్ జూన్ 28 (నినాదం న్యూస్)**



ఉచిత హెల్త్ క్యాంపులు పేద ప్రజల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్,డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా అన్నారు, శుక్రవారం గబ్బిలాల పేటలో ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హొప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఆరోగ్య కేంద్రం ను పలువురు కార్పొరేటర్లతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ శాంతి కోటేష్ గౌడ్ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని అన్నారు, పేద ప్రజలందరూ ఈ ఉచిత ఆరోగ్య సేవలను, ఆరోగ్య సమస్యలు ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు, డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి, శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ, ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హొప్ సంస్థ వారు, పేద ప్రజలకు ఉచిత ఆరోగ్య సేవలు అందించడం, అభినందించదగ్గ విషయం అన్నారు, వారికి మరియు వైద్య బృందానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, మేక లలిత యాదవ్, సంగీత రాజశేఖర్, గొడుగు వేణు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ కాలనీల లోని ప్రజలు పాల్గొన్నారు.

## బొంరాస్ పేట్ తైబజార్ వేలంపాట

**కోడంగల్ జూన్ 28 (నినాదం న్యూస్)**



కోడంగల్ నియోజకవర్గ పరిధిలోని బొంరాస్ పేట్ మండల కేంద్రంలో జరిగే వారాంతపు సంత శుక్రవారం వేలంపాట నిర్వహించారు. బొంరాస్ పేట్ గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన వేలంపాటలో పలువురు గ్రామస్థులు పాల్గొనగా గ్రామానికి చెందిన రవిగౌడ్ అత్యధికంగా 39000 రూపాయలు పలికిన వారాంతపు సంతను దక్కించుకున్నాడు.ఈసందర్భంగా పలువురు గ్రామస్థులు, స్నేహితులు రవిగౌడ్ ను అభినందించారు.ఈకార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి మహేష్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ కావలి రవి,పంచాయతీ కార్యదర్శులు రాజేష్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి : కనకాల

**ఎల్బీనగర్ నినాదం ప్రతినిధి, జూన్ 28 (నినాదం న్యూస్)**



హస్తినాపురంలోని జెడ్పీ రోడ్ లో గల శ్రీ చైతన్య స్కూల్ యాజమాన్యం సిబిఎస్ఇ అనుమతులు లేకున్నా తల్లిదండ్రులను మోసం చేస్తూ అనుమతులు ఉన్నాయని విద్యార్థుల భవిష్యత్తు నాశనం చేస్తున్నారని తెలుసుకొని బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు కనకాల శ్యామ్ కుర్మా అన్నారు. శుక్రవారం బీసీ యువజన ,విద్యార్థి సంఘాల నాయకులు స్కూల్ దగ్గరికి వెళ్లి ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కనకాల శ్యామ్ కురుమ మాట్లాడుతూ శ్రీ చైతన్య స్కూలుకు సీబీఎస్ఈ పర్మిషన్ లేకున్నా 400 మంది విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తూ మాకు సీబీఎస్ఈ పర్మిషన్ ఉన్నదాన్ని చెప్పి వాళ్ళ దగ్గర ఫీజులు వసూలు చేసి స్టేట్ సిలబస్ పై స్కూల్ నడుపుతున్నారని అన్నారు.పర్మిషన్ లేకుండా జరుగుతున్న శ్రీ చైతన్య పాఠశాలపై అధికారులకు పోలీసు అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొడుగు మహేష్ యాదవ్, బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పానగంటి విజయ్ కుమార్ బిసి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు గూడూరు భాస్కర్ మేరు, బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వరికుప్పల మధు బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు బండి గారి భరత్ గౌడ్, బీసీ జన సైన్యం అధ్యక్షులు నాగేష్ గౌడ్ , బిసి విద్యార్థి సంఘం నియోజకవర్గ నాయకులు అనంతుల సాయి కుమార్ గౌడ్, బిసి యువజన సంఘం నాయకులు వెంకటేష్ ముదిరాజ్,సాయి కుమార్ తదిరులు పాల్గొన్నారు.

## లిఫ్ట్ గుంతలో పడి కార్మికుడు మృతి

**కుత్బుల్లాపూర్, జూన్ 28 (నినాదం న్యూస్)**



నిర్మాణంలో ఉన్న అపార్ట్మెంట్ లో లిఫ్ట్ కోసం తీసిన గుంతలో ప్రమాదవశాత్తు ఓ కార్మికుడు పడి మృతి చెందిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. జీడిమెట్ల డివిజన్ సుచిత్ర సమీపంలోని గ్రీన్ పార్క్ లో గణేష్ బిల్డర్స్ గ్రౌండ్ o5 అంతస్తుల అపార్ట్మెంట్ నిర్మాణాన్ని చేస్తున్నారు. నిర్మాణ పనుల్లో చత్తీస్ ఘడ్ కు చెందిన రామ ( 30) పని చేస్తున్నాడు. గతంలో అదే అపార్ట్మెంట్లో రెండు నెలలు మేస్త్రి గా పని చేసిన అతను ఇటీవల స్వగ్రామానికి వెళ్లి గురువారం మధ్యాహ్నం తిరిగి వచ్చాడు. వచ్చినప్పటి నుంచి రాత్రి వరకు అతను మద్యం సేవిస్తూనే ఉన్నాడని తెలుస్తుంది . శుక్రవారం ఉదయం లిఫ్టు కోసం తీసిన గుంతలోని నీటిలో పడి శవమై కనిపించాడు.లిఫ్ట్ కు తీసిన గుంతలో నిర్మాణదారుడు నీటిని తొడే మోటార్ తో ఆ నీటిని వాడుకోవడం గమనార్హం. పేట్ బషీరాబాద్ పోలీసులు శవాన్ని గాంధీ ఆసుపత్రికి పంపించి దర్యాప్తు చేస్తున్నారు.

# అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయండి

**జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**కోడంగల్ జూన్ 28 (నినాదం న్యూస్)**



కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధి కి కడ క్రింద ఇప్పటికే మంజూరైన నిధులతో పనులను ప్రారంభించాలని చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ అధికారులకు సూచించారు. శుక్రవారం కొడంగల్ కడ కార్యాలయం లో కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి మంజూరైన నిధులతో చేపట్టాల్సిన పనులపై నారాయణపేట్ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తో కలిసి నారాయణపేట్, వికారాబాద్ జిల్లాల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి పనులను అధికారులు తమ శాఖలకు నిర్దేశించిన పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలన్నారు .మంజూరు అయిన పనులకు టెండర్ల ప్రక్రియను వేగవంతం చేసి పనులను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. రోడ్ల విస్తరణ, రోడ్ల బలోపేతంకు సంబంధించి పంచాయతి రాజ్, ఆర్ అండ్ బి శాఖల ఇంజనీయర్లు ప్రత్యేక దృష్టి సారించి పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. వివిధ కాలేజీల నిర్మాణం నిమిత్తం భూసేకరణ చేపట్టాలని, భూసేకరణ విషయంలో ఏదైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ తెలిపారు. కొడంగల్ లో ప్రభుత్వ ఆసుపత్రుల భవనాల నిర్మాణాల నమూనాలు, వైద్యుల నియామకానికి ప్రతిపాదనలు సమర్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. మిషన్ భగీరథ కింద ప్రతి ఇంటికి మంచినీరు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నీటి ట్యాంకుల నిర్మాణాలకు, పైపులైన్ల పనుల నిమిత్తం అవసరమైన నిధుల నిమిత్తం ప్రతిపాదన పంపాలని కలెక్టర్ తెలిపారు. కడ కింద నియోజకవర్గంలో మంజూరైన చెక్ డ్యాంల నిర్మాణ పనులపై , అటవీ శాఖ భూముల్లో జరుగుతున్న పనులపై కలెక్టర్ సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోడ్ల లో ఎక్కడ కూడా గుంతలు ఉండరాదని, ప్యాచ్ వర్క్ పనులు చేపట్టాలని, ప్రతి వారము నిర్వహించే సమీక్ష లో ప్రోగ్రెస్ ఉండాలని, కొడంగల్ నియోజకవర్గానికి సంబంధించిన గురుకుల పాఠశాలలు స్థానికంగా ఉండేలా అదేవిధంగా వసతి గృహాల నిర్మాణాలకై స్థల సేకరణ చేపట్టి వివిధ సంక్షేమ శాఖలకు కేటాయించాల ని సూచించారు. అనంతరం కొడంగల్ నియోజకవర్గం కమ్యూనిటీ ఆరోగ్యా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్బంగా ఆసుపత్రి లోని ప్రతి వార్డులను పరిశీలించి అక్కడి పరిస్థితులను రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఆసుపత్రిలో ఉన్న వైద్యుల సంఖ్య, అంబులెన్సుల సంఖ్య వంటి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి కి వచ్చే పెషేంట్లకు మెరుగైన సేవలు అందించాలని వైద్యాధికారులకు సూచించారు. సమావేశంలో , కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, అధికారులు,డి సి ఎచ్ ఎస్ ప్రదీప్,వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల రిజిస్ట్రేషన్ విలువ పెంచొద్దు

**ఎమ్మెల్యేకు కోల రవీందర్ ముదిరాజ్ వినతి**

**కుత్బుల్లాపూర్, జూన్ 28 (నినాదం న్యూస్)**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోగల సుమారు ఐదు శివారు గ్రామల గ్రామ కంఠంలో ఉన్న ఇండ్లు, ఇండ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ విలువ పెంచొద్దని సామాజిక కార్యకర్త కోల రవీందర్ ముదిరాజ్ శివారు గ్రామ ప్రజలతో కలిసి శుక్రవారం ఎమ్మెల్యే కేపీ వివేకానందకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిహెచ్ఎంసి పరిధిలోగల వందలాది గ్రామాలు ఎలాంటి అభివృద్ధికి నోచుకోకుండా పోయాయని, అందులో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోగల సుమారు ఐదు శివారు గ్రామలు కూడా సరియైన అభివృద్ధికి నోచుకోలేదని వాపోయారు. అభివృద్ధికి నోచుకోని శివారు గ్రామాలలో నివసిస్తున్న వారి మరణించిన తాతలు, తండ్రుల పేరున ఉన్న ఇండ్లు, ఇండ్ల స్థలాలు తమ పేరున రిజిస్ట్రేషన్ కాకపోవడం మూలన ఇప్పటివరకు మరణించిన వారిపేరుమీదనే పన్నులు చెల్లిస్తున్నామన్నారు. తాము ఇక్కడి స్థలాలలో నిర్మాణాలు చేపట్టేందుకు జిహెచ్ఎంసి,పురపాలక సంఘాలు, కార్పోరేషన్లు కూడా ఎలాంటి అనుమతులు ఇవ్వడం లేదని వాపోయారు. ఇక్కడి రెవెన్యూ అధికారులు గ్రామ కంఠ ధ్రువీకరణ పత్రాలుగానీ, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాలు కానీ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడి ఇండ్లు, ఇండ్ల స్థలాలకు బ్యాంకువారు రుణాలు ఇవ్వడంలేదని,రిజిస్ట్రేషన్ శాఖ వారు రిజిస్ట్రేషన్ చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. తాము ఇండ్లు నిర్మించుకునేందుకు అధిక వడ్డీతో ప్రైవేటు అప్పులు తీసుకొని,లేదా ఉన్న నాలుగైదు గుంటల భూమిని అమ్ముకొని ఇండ్లు నిర్మించుకుంటే జిహెచ్ఎంసి వారు 100% ఇంటి పన్ను అధికంగా వేస్తున్నారని వాపోయ్యారు. ఇక్కడి ఇండ్లు,ఇండ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ విలువ పెంచొద్దని కోరారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించి శివారు గ్రామ ప్రజలకు మేలు చేయాలని కోల రవీందర్ ముదిరాజ్ వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో బౌరంపేట్ కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి, కిషన్ రావు, బుచ్చిరెడ్డి, సంబంధిత గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రంగా విగ్రహానికి పూలమాల

**కుత్బుల్లాపూర్, జూన్ 28 (నినాదం న్యూస్)**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం శ్రీ కృష్ణ దేవరాయ కాపు వెల్ఫేర్ అస్సోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ రామకృష్ణ జన్మదినం సందర్భంగా బిజెపి నాయకులు గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి రంగా సెంటర్‌లో రంగా విగ్రహానికి పూల మాల వేసి కేక్ కట్ వేడుకలు జరుపుకున్నారు. శ్రీ కృష్ణ దేవరాయ కాపు వెల్ఫేర్ అస్సోసియేషన్ అధ్యక్షులు ఆంజినేయులు, జనరల్ సెక్రటరీ రవికాంత్ కమిటీ మెంబెర్స్ నాగబాబు, రంగా రావు, సాయి, సత్య, ప్రసాద్ , రమేష్, వీబాబు, రవి కుమార్, కృష్ణరావు, దుర్గ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపిటిసి లకు ఘనంగా సన్మానం

**కోడంగల్ జూన్ 28 (నినాదం న్యూస్)**



కోడంగల్ పట్టణం లోని మండల అభివృద్ధి కార్యాలయంలో శుక్రవారం మండలం లోని ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులను ఘనంగా సన్మానించారు. మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఐదేళ్ళ పాటు గ్రామాల అభివృద్ధికి ఎంపిటిసిలు చేసిన సేవలను కొనియాడారు.జులై 4తో ఎంపిటిసిల ఐదేళ్ల పదవీకాలం ముగియనుందనీ, ప్రభుత్వం నుంచి ఆయా గ్రామాల అభివృద్ధికి నిధులు తీసుకురావడంలో ఎంపిటిసిల పాత్ర గొప్పదని ఎంపిపి ముద్దప్ప దేశ్ ముఖ్ ఎంపిటిసిలను ఉద్దేశించి అన్నారు. అనంతరం ఎంపిటిసిలు, సర్పంచ్ లు ఎంపిపి ముద్దప్ప దేశ్ ముఖ్ ను ఘనంగా సత్కరించారు.ఈకార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్ లు, ఎంపిటిసిలు, మాజీ సర్పంచ్ లు, మాజీ ఎంపిటిసి లు పాల్గొన్నారు.

## పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలి : కలెక్టర్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 28 నినాదం న్యూస్:**

పాఠశాలల్లో పేరుకుపోయిన పాత ఫర్నిచర్, పాడయిన వస్తువులు, పేరుకుపోయిన పుస్తకాలు, కాగితాలను వారం రోజుల్లో తొలగించి పాటశాలలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ ఆదేశించారు. శుక్రవారం నాడు ఆదర్శ పాఠశాలల పనులు, మిషన్ భగీరథ ఇంటింటి సర్వేపై మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఎంపిఓలు, ఎంఈఓలు, మున్సిపల్ కమిషనర్ లు, పంచాయతీ రాజ్ ఇఇలతో జూమ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో పేరుకుపోయిన పాత ఫర్నిచర్, పాడయిన వస్తువులు, పేరుకుపోయిన పుస్తకాలు, కాగితాలను వారం రోజుల్లో తొలగించి పాటశాలలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రహరి గోడలు లేని పాఠశాలలకు ఇనుప కంచేతో ప్రహరీ ఏర్పాటుకు అంచనాలు రూపొందించాలని అధికారులకు సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టే పనుల్లో ఎలాంటి నాణ్యతలోపం ఉండకూడదని



తెలిపారు. విద్యుత్ పనుల్లో భాగంగా తరగతులకు అనుగుణంగా ట్యూబ్ లైట్లు అమర్చాలని అధికా రులకు సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల మార్గదర్శకాలకు అనుగుణంగా సంబంధిత కంపెనీలకు సంబంధించిన ఫ్యానులను మాత్రమే అమర్చాలని కలెక్టర్ తెలిపారు. పాఠశాలల్లో చేపట్టిన పనులను నాణ్యత పనులను తనిఖీ చేసేందుకు పరిశీలన అధికారులను, ప్రత్యేక అధికారులను నియమిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పాఠశాలల్లో చేపట్టక ముందు, పనులు చేసిన తర్వాత ఫోటోలు తీసి సమర్పించాలని కలెక్టర్ సూచించారు. కోడంగల్ మండలం గుండ్లకుంట పాఠశాలలో టాయిలెట్ నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, జిల్లా పరిషత్ సీఈఓ సుధీర్, డి ఆర్ డి ఓ శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి, మిషన్ భగీరథ ఇఇ బాబు శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఇఇ ఉమేష్, మండల ప్రత్యేక అధికారులు రామ్ రెడ్డి, దీపా రెడ్డి, సత్తార్ , మల్లేశం, వినయ్ కుమార్, గోపాల్, వీర భద్రరావు, ఎస్సీ కార్పొరేషన్ ఇడి బాబు మోజీస్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకి వినతి

**మల్కాజిగిరి, జూన్ 28(నినాదం న్యూస్)**



గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని వాణి నగర్ కాలనీలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ ఆధ్వర్యంలో కాలనీవాసులతో కలిసి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రంను అందజేశారు. అనంతరం భవాని నగర్ లో ఏర్పాటుచేసిన ఇంకుడు గుంతలను కార్పొరేటర్ సునీత రాము యాదవ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రాముయాదవ్, జేఏసీ వెంకన్న, బైరు అనిల్ కుమార్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు సిద్దయ్య, నరసింగరావు, కాలనీ కమిటీ సభ్యులు, భవాని నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులుప్రసాద్, కార్యదర్శి శశి కుమార్, కాలనీ సభ్యులు రామారావు, ధ్యానం, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడ నేషనల్ హైవే రోడ్డు నిర్మాణం పనులు చేపట్టాలి

**మంత్రికి కొప్పుల నర్సింహ్మ రెడ్డి వినతి**

**ఎల్బీనగర్ నినాదం ప్రతినిధి, జూన్ 28 (నినాదం న్యూస్)**

మాదాపూర్ హైటెక్స్‌లో ఆర్ అండ్ బి కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మ రెడ్డి హాయతనగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి కలిసి వినతిపత్రం అందించి విజయవాడ నేషనల్ హైవే రోడ్డు అభివృద్ధిలో భాగంగా దుర్గా విలాస్ హొటల్ నుండి హయత్ నగర్ వరకు నిర్మిస్తున్న అండర్ పాస్ రోడ్డు నిర్మాణం వలన ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులను వివరించి పరిష్కారం చూపాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయవాడ నేషనల్ హైవే రోడ్డు అభివృద్ధిలో భాగంగా స్థానికంగా నిర్మిస్తున్నటు వంటి అండర్ పాస్ రోడ్డు నిర్మాణ విషయంలో స్థానికంగా ఉండే కార్పొరేటర్ల సమక్షంలో ప్రజల అభిప్రాయాల సేకరణ కొరకు అధికారులు పర్యటించి అక్కడ జరుగుతున్న పనులను పర్యవేక్షించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారి ధర్మారెడ్డిని ఆదేశించారని తెలిపారు. పలు సమస్యలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.



కార్యక్రమంలో భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రైతు ప్రకృతి దుకాణం సందర్శించిన కార్పొరేటర్

**కుత్బుల్లాపూర్, జూన్ 28 (నినాదం న్యూస్)**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో బీజేవైఎం స్టేట్ మీడియా కన్వీనర్ రేవతి రెడ్డి నూతనంగా ప్రారంభించిన ఆర్ ఆర్ ఆర్ మేక్ ఓవర్ స్టూడియో, రైతు రాజేందర్ ప్రకృతి షాపును బిజెపి నాయకులు గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి సందర్శించారు. రైతు రాజేందర్ గతో కార్పొరేటర్ మాట్లాడుతూ ఆరోగ్యానికి సంబంధించిన స్టోర్‌ను ప్రారంభించినం దుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గాజులరామారం డివిజన్ అధ్యక్షులు సాయినాథ్ నేత, నిజాంపేట్ కోరపరేషన్ ప్రధాన కార్యదర్శి బిక్షపతి ,సీనియర్ నాయకులు చక్రధర్, గాజులరామారం డివిజన్ నాయకులు విశ్వకర్మ అధ్యక్షుడు మురళి కృష్ణ పాల్గొన్నారు.

## నియోజకవర్గ ప్రజలకు అండగా కొలన్ హన్మంత్ రెడ్డి



**కుత్బుల్లాపూర్, జూన్ 28 (నినాదం న్యూస్)**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అండగా నిలుస్తున్నారు. బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 130 డివిజన్ సుభాష్ నగర్ ఉషోదయ టవర్స్‌లో నివసిస్తున్న సత్యనారాయణ కుమారుడు సుదీప్ గత కొన్నిరోజులుగా గుండె అనారోగ్యంతో బాధపడుతుండగా అనారోగ్యం నయం చేయించుటకు నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుటకు సత్యనారాయణ కుటుంబం వద్ద కావలసిన ఆర్థిక స్థోమత లేకపోవటంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని సంప్రదించి తన కుమారుడి వైద్యం కోసం సహకరించాలని కోరారు. వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా బాధితుడి శస్త్ర చికిత్స నిమిత్తం రూ. 2,50,000 సీఎం సహాయనిధి - ఎల్వోసీని మంజూరి చేయించారు. రూ. 2,50,000 శుక్రవారం ముఖ్యమంత్రి సహాయ నిధి ఎల్ఓసి మంజూరి పత్రాలను సత్యనారాయణ కుటుంబ సభ్యులకు కొలన్ హన్మంత్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ లక్ష్మ రెడ్డి, మాజీ కార్పొరేటర్ పాలకృష్ణ, మాజీ కౌన్సిలర్ రషీద్, సిద్దయ్య, సిద్దనోళ్ల సంజీవ్ రెడ్డి, గాదె వినోద్, ఎండీ రజాక్, అమెర్, దినేష్, సంపంగి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు .

## పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయిస్తా

**- ఎమ్మెల్యే కేపీ. వివేకానంద**

**కుత్బుల్లాపూర్, జూన్ 28 (నినాదం న్యూస్)**

పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యే కెపి. వివేకానంద అన్నారు. శుక్రవారం కుత్బుల్లాపూర్‌లోనిఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన 126- జగద్గిరిగుట్ట డివిజన్ మైసమ్మ నగర్ - బి సెక్షన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి కాలనీలో సీసీ రోడ్డు పనులను చేపట్టాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయిన అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించి త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తామని పేర్కొన్నారు. గత పదేళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులతో కాలనీలను, మురికి వాడాలను రాజకీయాలకు అతీతంగా "మన ప్రాంత అభివృద్ధి - మన అభివృద్ధి" అనే ఒకే ఒక నినాదంతో అభివృద్ధి చేశామన్నారు. ఇందులో భాగంగా మైసమ్మ నగర్ లో దాదాపు అన్ని అభివృద్ధి పనులు చేపట్టామని ఇంకా ఏవైనా అభివృద్ధి పనులు మిగిలిపోయి ఉంటే త్వరలోనే చేపడతామన్నారు. అనంతరం శ్రీ బొడ్రాయి (నాభిశిల) గ్రామదేవత పునః ప్రతిష్ట మహొత్సవానికి ఎమ్మెల్యే ను ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మైసమ్మ నగర్ "ఏ" అండ్ "బి" బ్లాక్ అధ్యక్షులు బ్రహ్మానందం చారి, పిల్లి ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శులు ముఖేష్ నేత, బండారు రవీందర్ రెడ్డి, కోశాధికారి జమేదార్ సంతోష్, కమిటీ సభ్యులు పాపిరెడ్డి, కే రాములు, రమేష్ .అప్పారెడ్డి, నరేష్ కుమార్, రాజిరెడ్డి, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.



## పారిశుద్ధ్య పనులు పరిశీలించిన ఎంపీడీవో

**కొల్చారం జూన్ 28( నినాదం న్యూస్):**



పారిశుద్ధ్య డ్రైడే కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని కొంగొడ్, అంసాన్ పల్లి, సంగాయి పేట గ్రామ పంచాయతీలలో చేపట్టిన పారిశుధ్యం, పనులను శుక్రవారం ఎంపిడిఓ లక్ష్మీ నరసింహులు పరిశీలించారు. అనంతరం సంగాయిపేట గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. పైపు లైన్ లీకేజలు లేకుండా చూడాలని, మురికి కాలువలు శుభ్రం చేయాలని, పిచ్చి మొక్కలు తొలగించాలని, మంచినీటి సరఫరా ట్యాంకుల చుట్టూ శుభ్రం చేయించాలని సూచించారు. ప్రతి 15 రోజులకు ఓ మారు దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలని, మురికి గుంతలలో దోమలు చేరకుండా ఆయిల్ బాల్స్ వేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, హెడ్ మాస్టర్, అంగన్వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు సపాయి సిబ్బంది పాల్గొన్నారు.

## రాయల సత్యాన్ని పరామర్శించిన తుమ్మల

**సత్తుపల్లి, జూన్ 28 ( నినాదం న్యూస్)**

స్వతంత్ర సమర యోధులు వేంసూరు మండలం లచ్చన్న గూడెం గ్రామ మాజీ సర్పంచ్ రాయల సత్యనారాయణ గత కొంత కాలంగా అనారోగ్యంతో అస్వస్థతకు లోనయ్యారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సత్తుపల్లిలో రాయల సత్యం నివాసం నందు శుక్రవారం వారిని పరామర్శించారు. రాయల సత్యం ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులతో మాట్లాడి తెలుసుకున్నారు. మంత్రి తుమ్మల వెంట సీనియర్ నాయకులు చల్లగుళ్ళ నరసింహారావు, వెల్డి జగన్ మోహన్ రావు, జైలర్ తదితరులు ఉన్నారు.

## కేసిఆర్ వల్లనే సీతారామ కల సాకారం

**సీతారామ సక్సెస్ పట్ల నామ నాగేశ్వరరావు హర్షం**

**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూన్ 28) నినాదం న్యూస్)**



మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అవిరళ కృషి, భగీరథ అద్భుత ప్రయత్నంతో సీతారామ ప్రాజెక్టు ట్రయల్ రన్ విజయవంతమై, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజల చిరకాల జల సంకల్పం నెరవేరిందని ఖమ్మం మాజీ పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు నీటితో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో లక్షలాది ఎకరాలు సస్యశ్యామలమై, అన్నదాతల కలలు సాకారం అవుతున్నందుకు ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఈ ప్రాజెక్టు ఘనత కేసీఆర్దేనని పేర్కొన్నారు. కేసీఆర్ ఎంతో ముందు చూపుతో ప్రతిష్టాత్మకంగా తీసికొని ఈ ప్రాజెక్టుకు పెద్ద ఎత్తున నిధులు వెచ్చించి, కరవును పారదోలే కల్పతరవుగా ప్రాజెక్టును పూర్తి చేశారని చెప్పారు. ఈ మొదటి దశ పంపు హౌస్ ద్వారా గోదావరి జలాలు ఊరూరా పరుగులిడి, లక్షలాది ఎకరాలకు చేరతాయని అన్నారు. కేసీఆర్ ఉక్కు సంకల్పం వల్లనే ఈ ప్రాజెక్టు కల సాకారమైందని చెప్పారు. ఈ ప్రాజెక్టు ఖమ్మం జిల్లా రైతుల జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్టు ను జిల్లా రైతాంగానికి అంకితం చేస్తున్నామని పేర్కొన్నారు. బీఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలోనే దాదాపు పనులన్నీ పూర్తి అయ్యాయని చెప్పారు. ఈ విజయంలో భాగస్వాములైన అధికారులు, సిబ్బందిని కూడా అభినందిస్తున్నట్లు నామ నాగేశ్వరరావు తెలిపారు.

## వంట పాత్రలు వితరణ

**ఖమ్మం జిల్లా ప్రతినిధి చింతకాని జూన్ 28 (నినాదం న్యూస్)**



చింతకాని మండలం రామకృష్ణాపురం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి దేవి అధ్యక్షతన శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కన్నెబోయిన లక్ష్మయ్య ఫౌండేషన్ చైర్మన్ సీతా రామయ్య వంట సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు వంట సామాగ్రి లేకపోవడంతో వాటిని కన్నెబో యిన లక్ష్మయ్య ఫౌండేషన్ చైర్మన్, తెలంగాణ గ్రామీణ కేబుల్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు కన్నెబోయిన సీతారామయ్య ఆధ్వర్యంలోరూ.12 వేల వంటసామాన్లను వితరణ చేశారు. రామకృష్ణాపురం పాఠశాలలో చదివినటువంటి ప్రతి ఒక్కరు అత్యున్నత స్థానంలో ఉన్నారని వారిలో డాక్టర్లు గుండ్ల పల్లి సత్యనారాయణ . ,సైనిటిస్టు,సినీ సింగీత దర్శకులు వందేమాతరం శ్రీనివాస్ రావు, ఉద్యోగస్తులు, వ్యాపారవేత్తలు, పోలీస్ ఉద్యోగస్తులు, లాయర్లు, తదితర వర్గాలకు చెందిన వారు అనేక మందిని ఈ పాఠశాల తయారు చేసిందని ఆయన అన్నారు. సినీ పరిశ్రమలో వందేమాతరం శ్రీనివాస్ లాంటివారు ఉన్నారని స్కూల్ కోసం ఎలాంటి అవసరం వచ్చిన పూర్వ విద్యార్థుల సహాయ సహకారాలతో గ్రామస్తుల సహాయంతో ఈ స్కూల్కు నా వంతుగా నేను ఏమడిగినా ఉపాధ్యాయులకు ,విద్యార్థులకు అందజేస్తానని సీతారామయ్య తెలియజేశారు. రామకృష్ణాపురం గ్రామం మధిర నియోజకవర్గంలో ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ఉన్న నియోజకవర్గంలో ఉండటం మన అదృష్టంగా భావిస్తూ అదేవిధంగా రెవిన్యూ ,గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి అత్యంత సన్నిహితంగా ఉండే సీతా రామయ్య రామకృష్ణాపురం గ్రామానికి కానీ ప్రాథమిక పాఠశాల కానీ గ్రామ అభివృద్ధిలో నా వంతుగా నేను చేస్తానని గ్రామ ప్రజలకు పాఠశాల ఉపాధ్యాయులకు మండలప్రజకు హామీ ఇచ్చారు. గతంలో కన్నెబోయిన సీతారామయ్య లక్ష్మయ్య ఫౌండేషన్ ద్వారా అనేక కార్యక్రమాలు నిర్వహించారు. స్కూల్స్తో పాటు, దీర్ఘకాలికం గా వ్యాధి గ్రస్తులై బాధపడుతున్న కుటుంబాలకు ఆయన ఎంతో తోడ్పాటు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాలు ఉపాధ్యాయులు జి కృష్ణారావు ఉపేంద్ రెడ్డి, ఎస్ రమేష్, కే కృష్ణ, ఎస్కే సైద్ పాషా, జి సైదేశ్వరరావు, ఏ వీరభద్రం. గ్రామస్తులు గాదె రామారావు, ఉసికెల లక్ష్మీనారాయణ, గండారపు రామారావు తదితరులు పాల్గొన్నారు.

## వైద్యుడు అన్వర్పై కేసు నమోదు

**కారేపల్లి, జూన్ 28 (నినాదం న్యూస్):**

ఆర్ఎంపి వైద్యంపై గాదెపాడు బాధితుడు ఫిర్యాదు చేయడంతో వైద్యుడు అన్వర్ పై కారేపల్లి పోలీస్ స్టేషన్లో శుక్రవారం కేసు నమోదు చేశారు. కారేపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కారేపల్లి మండల పరిధిలోని గాదెపాడు గ్రామానికి చెందిన ఫిర్యాదు దారుడు సైఫ్ జాన్ గత కొంతకాలం క్రితం జ్వరం వచ్చిందని గ్రామంలోని ఆర్ఎంపీ డాక్టర్ అన్వర్ దగ్గరకు ప్రథమ చికిత్స కొరకు వెళ్లగా ఆర్ఎంపీ డాక్టర్ తన యోగ్యతకు మించి ఫిర్యాదుదారునికి అధిక మోతాదులో ఆంటీబయిటిక్స్ ఇవ్వడం వల్ల బాడీలో బీపీ తగ్గి, మూర్ఛ పోవడం జరిగిందని, వెంటనే గమనించిన ఆర్ఎంపీ డాక్టర్ అన్వర్ తన సొంత వాహనంలో ఖమ్మంలోని ప్రైవేటు హాస్పిటల్లో చికిత్స చేయించి, చికిత్సకు ఆయే ఖర్చులు మొత్తం నేనే చూసుకుంటా అని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. తర్వాత బాధితుడిని పట్టించుకోకపోవడం వల్ల ఆర్ఎంపీ డాక్టర్ అన్వర్ పై కారేపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆర్ఎంపీ డాక్టర్ పై కారేపల్లి ఎస్ఐ రాజారాం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు..

## కొత్త చట్టాలపై ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్

**- నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు**



**ఇల్లందు,జూన్28(నినాదం న్యూస్):** దేశవ్యాప్తంగా జూలై1 నుంచి అమలు కానున్న నూతన చట్టాలపై పట్టణంలోని కొత్త బస్టాండ్ ఆటో అడ్డా వద్ద శుక్రవారం ఆటో డ్రైవర్లకు సీఐ బత్తుల సత్యనారాయణ అవగాహన కల్పించారు. ఆటో డ్రైవర్లు లైసెన్స్ లేకుండా,మద్యం తాగి డ్రైవింగ్ చేయొద్దని,ప్రతి ఒక్కరూ లైసెన్స్ తో పాటు జీవిత భద్రత కొరకు ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని సూచించారు. మద్యం సేవించి ఆటో నడిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డ్రైవర్లను హెచ్చరించారు. అక్రమ రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. అదేవిధంగా ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ఇతర వాహనదారులను ఇబ్బందులు గురి చేస్తే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా వాహనదారులు,వ్యాపారస్తులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై సందీప్ కుమార్,సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధిలో సంక్షేమ సంఘాలు భాగస్వాములు కావాలి

**ఎమ్మెల్యే కేపీ.వివేకానంద**



**కుత్బుల్లాపూర్, జూన్ 28 (నినాదం న్యూస్)**

కుత్బుల్లాపూర్లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద కొంపల్లి మున్సిపాలిటీ అవని గార్డెన్స్ సంక్షేమ సంఘం నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కేపీ. వివేకానందను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన కమిటీ సభ్యులు కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘాలు భాగస్వాములు అయినప్పుడే కాలనీ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి, అధ్యక్షులు వై. రాజా రమణ గౌడ్, ప్రధాన కార్యదర్శి శేషవరావు, కోశాధికారి కె. శ్రీకాంత్, ఉపాధ్యక్షులు సతీష్, కమిటీ సభ్యులు రాజు, గోవర్ధన గౌడ్, నారాయణరెడ్డి, గిరిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ జాగాకు

# పైసా వసూల్

- ఖాళీ స్థలం కనిపిస్తే ఖతం
- రోజురోజుకి కారేపల్లిలో పెరుగుతున్న ఆక్రమణలు
- ప్రేక్షక పాత్రలో అధికారులు



**కారేపల్లి, జూన్ 28 (నినాదం న్యూస్):** ప్రతినిత్యం రద్దీగా ఉండే కారేపల్లి మండల కేంద్రంలో ఆర్ అండ్ బి రహదారి మార్గాన్ని కొందరు ఆక్రమించుకొని పండ్ల, కూరగాయల దుకాణాలు చిరు వ్యాపారులు రహదారి మార్గంపైనే విక్రయాలు కొనసాగిస్తుండడంతో వాహనాల రాకపోకలు పాదచారులకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. రహదారులపై ఆక్రమణలను తొలగించాల్సిన పంచాయితీ రాజ్,ఆర్ అండ్ బి శాఖ అధికారులు నిమ్మకునీరు ఎత్తినట్లుగా వ్యవహరిస్తూ ఉదాసీనత ఇంకా వ్యవహరించడంతోని ఈ సమస్య ఉత్పన్నమవుతుందని స్పష్టమవుతోంది. మండల కేంద్రమైన కారేపల్లి గ్రామానికి ప్రతిరోజు గ్రామ పంచాయతీల నుండి వందలాది మంది ప్రజలు ఇతర ప్రాంతాల వారు రైలు ప్రయాణం నిమిత్తం వెళ్లే ప్రయాణికులు స్టేషన్ బజార్ మార్గాన్ని ప్రయాణించాల్సి వస్తుంది. ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లేవారు ఆర్ అండ్ బి ప్రధాన రహదారి గుండా ప్రయాణిస్తుంటారు. ఇకపోతే రహదారి మార్గంపైనే వాహనాలు నిలిపివేయడం తో పాటు కొనుగోలు చేసే వ్యక్తులతో విపరీతంగా రద్దీ ఏర్పడుతోంది. గత కొన్ని నెలల క్రితం ఈ మార్గంలో డ్రైనేజీ ఆక్రమణలు తొలగించడంతో పాటు రహదారి మార్గంపై దుకాణాలను తొలగించిన క్రమంలో రాకపోకలకు మార్గం సుఖమమైంది. అయితే ఇటీవల రాజీవ్ విగ్రహం వద్ద కూరగాయల దుకాణం ఏర్పాటు చేయడంతో పాటు డ్రైనేజీ దాటి కూల్ డ్రింక్ ట్రేలు దుకాణాల ముందు కట్టడాలు డ్రైనేజ్ దాటి ఏర్పాటు చేశారు. దీంతో మరొకసారి రహదారి మార్గంపై ప్రయా ణం కష్టతరంగా మారింది. ఈ పరిస్థితి ఇలా ఉంటే రహదారులు భవనాల శాఖ సిబ్బంది గానీ పర్యవేక్షించాల్సిన గ్రామపంచాయతీ అధికారులు సరైన చర్యలు తీసుకోకపోవడమే ఇలాంటి పరిస్థితి ఉత్పన్నమైందని విమర్శలు వస్తున్నాయి. ఇకపోతే కొందరు ప్రభుత్వ స్థలానికి కిరాయిలకి ఇచ్చి పైసా వసూలు చేస్తున్నడం గమనార్హం. మొక్కుబడిగా సంబంధిత శాఖ అధికారులు కనీసం జరిమానాలు వేయటం కూడా గ్రామ పంచాయతీ విస్మరించిందంటే అర్థం చేసుకోవాలి. ఇప్పటికైనా మండల అధికారులు గ్రామ పంచాయతీ జోక్యం చేసుకొని డ్రైనేజీల ఆక్రమ ణను స్టేషన్ బజారు రహదారి మార్గంలో వాహ నాల రాకపోకులకు అంతరాయం కలగకుండా చూడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## నేడు కారేపల్లి సొసైటీలో ప్రత్యేక సమావేశం

**- సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు**

**కారేపల్లి, జూన్ 28 (నినాదం న్యూస్):**



కారేపల్లి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా (పంట పెట్టుబడి సహాయ పథకం) పకడ్బందీగా అమలుకు రైతుల సలహాలు సూచనలు తీసుకో వాలని నిర్ణయించిందని కారేపల్లి సొసైటీ అధ్యక్షులు దుగ్గినేని శ్రీనివాసరావు, కార్యదర్శి బొల్లు హనుమంతరావు తెలిపారు. శుక్రవారం సొసైటీ కార్యాలయంలో పాలకవర్గం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ.. రైతు భరోసాపై రైతుల సలహా,సూచనల కోసం శనివారం కారేపల్లి సొసైటీ కార్యాలయంలో ప్రత్యేక జనరల్ బాడీ సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. గతంలో రైతుబంధు పథకం అమలులో జరిగిన తప్పిదాలు జరిగాయని, పథకం దుర్వినియోగం అయిందని ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం రైతు భరోసా (పెట్టు బడి సహాయ పథకం) అమలకు రైతు సూచనలు కోరుతుందన్నారు. ఈ ప్రత్యేక సమావేశానికి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయలక్ష్మి హాజరుకానున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశం కు రైతు సోదరులు హాజరై రైతు భరోసా (రైతుబంధు) అమలకు తీసుకోవలసిన చర్యలపై సూచనలు ఇవ్వాలని వారు కోరారు. ఈ సమావేశంలో సొసైటీ ఉపాధ్యక్షులు దారావత్ మంగీలాల్, డైరెక్టర్లు అడ్డగోడ ఐలయ్య, బానోతు హీరాలాల్, మర్సకట్ల రోశయ్య, దేగల ఉపేందర్, కొత్తూరి రామారావు, మధ్యాహ్నపు శ్రీనివాస్, ఇల్లంగి పాప తదితరులు పాల్గొన్నారు.

## కారేపల్లి రైలు సమస్యలను పరిష్కరించాలి

**రైల్వే డిఆర్ఎంకు తురక నారాయణ వినతి**

**కారేపల్లి, జూన్ 28 (నినాదం న్యూస్):**



కారేపల్లి రైల్వే జంక్షన్లో సమస్య లను పరిష్కారించాలని కోరుతూ కారేపల్లి రైల్వే జంక్షన్ అభివృద్ధి కమిటీ సభ్యుడు, బిజెపి సీనియర్ నాయకుడు తురక నారాయణ శుక్రవారం హైదరాబాదులోని దక్షిణ మధ్య రైల్వే డిఆర్ఎం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. రైల్వే స్టేషన్ విషయం గతంలో ప్రయాణించిన రైళ్లన్నీ పునరుద్ధరిం చాలని, ప్రత్యేకంగా ఈ మార్గం ద్వారా నడుస్తున్న అన్ని రైళ్లను కారేపల్లి స్టేషన్లో నిలుపుదల చేయాలని, బుకింగ్ కార్యాలయం ప్రారంభించాలని, భద్రాచలం నుంచి తిరుపతి వరకు రెండు పుణ్యక్షేత్రాలను కలిపే విధంగా ఒక రైలును ఏర్పాటు చేయాలని ఈ వినతిపత్రంలో కోరినట్లు నారాయణ పేర్కొన్నారు. గతంలో సైతం దక్షిణ మధ్య రైల్వే శాఖకు పోస్టు ద్వారా పంపిన దరఖాస్తులను సైతం రైల్వే డిఆర్ఎంకు అందజేసి సమస్యలను వివరించినట్లు పేర్కొన్నారు.

## ఓపిఎస్ అమలు చేయాలి

**టీఎస్ యుటిఎఫ్ కార్యదర్శి నాగేశ్వరరావు**

**కారేపల్లి, జూన్ 28 (నినాదం న్యూస్):**



గిరిజన సంక్షేమ శాఖలో పండిట్స్, పీఈటీ పోస్టుల ను అప్ గ్రేడ్ చేస్తూ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని టిఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి డిఎస్ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల రేలకాయలపల్లిలో కే కృష్ణారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి డిఎస్ నాగేశ్వర రావు మాట్లాడారు. గిరిజన సంక్షేమ శాఖలోని పండిట్స్, పీఈటి పోస్టులను వెంటనే అప్గ్రేడ్ చేస్తూ గిరిజన ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది పండిట్స్, పిఈటీ పోస్టులు అప్గ్రేడ్ చేస్తూ పదోన్నతులు పొందిన విషయం విధితమే అని, గిరిజన సంక్షేమ శాఖ అధికారుల నిర్లక్ష్య ఉదాసీన వైఖరి కారణంగా గిరిజన సంక్షేమ శాఖలో ఒక్క పండిట్స్, పిఈటి పోస్టులు అప్గ్రేడ్ కాకపోవటం వల్ల గిరిజన ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీఫైడ్ సర్వీస్ రూల్స్ జీవో ఎంఎస్ నెంబర్ 16 దస్త్రంకి మోక్షం కలిగినా, నేటికీ గిరిజన ఉపాధ్యా యుల బదిలీలు, పదోన్నతుల మార్గదర్శకాలు విడుదల కాలేదని మండిపడ్డారు. కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలలు ప్రారంభించి 12 సంవత్సరాలు గడుస్తున్నా ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేయకుండా సిఆర్టి ల శ్రమ దోపిడీతో కాలయాపన చేస్తూ వారి సర్వీసునూ క్రమబద్ధీకరించకుండా, గిరిజన విద్యార్థులకు విద్యను దూరం చేస్తున్నారని ఆరోపించారు. సంక్షేమ రంగంగా పాలకులు చెప్పుకుంటున్న గిరిజన సంక్షేమ శాఖ ట్రైబల్ కమీషనర్ను, డైరెక్టర్లను నియమించకపోవడం సంక్షేమ శాఖ పట్ల వారికున్న చిత్తశుద్ధి ఏ పాటిదో అర్థమవుతుందన్నారు. వెంటనే గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల మార్గదర్శకాలను విడుదల చేయాలని, పండిట్, పీఈటి పోస్టులను అప్గ్రేడ్ చేస్తూ పదోన్నతులు కల్పించాలని, కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలకు ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేయాలని, సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి, ఓపిఎస్ విధానాన్ని తీసుకురావాలని, నాలుగు పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని, పెండింగ్ బిల్లులను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ నాయకులు నాగలక్ష్మి, సూర్య, ఎం నాగేశ్వరరావు, గంగాధర్, రామారావు, పద్మ, దేవ్ సింగ్, రాంబాబు, సక్రాం, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## మా నీళ్ళు మాకు ఇవ్వండి..

**- మాజీ ఎమ్మెల్యే నిరసన**



**మణుగూరు జూన్ 28( నినాదం న్యూస్) :** మా నీళ్లు మాకు ఇవ్వండి అంటూ అశ్వాపురం మండలం బిజీ కొత్తూరు వద్ద నిర్మించిన పంప్ హౌస్ దగ్గర మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆధ్వర్యంలో బిఆర్ఎస్ఎస్ కార్యకర్తలు శుక్రవారం నాడు భారీ ఎత్తున నిరసన వ్యక్తం చేస్తూ కేసీఆర్ ఫ్లెక్సీ కి పాలాభిషేకం చేస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కెసిఆర్ ముందు చూపుతో అశ్వాపురం మండలం కుమ్మరి గూడెం వద్ద గోదావరి నదిపై సీతారామ ప్రాజెక్టు నిర్మించడం జరిగిందని ప్రాజెక్టు పనులు 90 శాతం పూర్తి చేసుకున్న తర్వాత ప్రభుత్వం మారిపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుందని ఆయన ఆరోపించారు. ఇటీవల రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఆధ్వర్యంలో బిజీ కొత్తూరు వద్ద పంప్ హౌస్ లాకులను ఎత్తి నీటిని విడుదల చేస్తూ ఆనందం వ్యక్తం చేశారని ఆయన అన్నారు. కానీ అశ్వాపురం మండలం నుంచి పోయే నీళ్లను స్థానిక అశ్వాపురం మండికుంట ప్రాంతాలకు నీళ్లు ఇవ్వకుండా మధిర వైరా సత్తుపల్లి ప్రాంతాలకు నీటిని తరలించుకోవడం అన్యాయమని ఆయన నిరసన వ్యక్తం చేశారు. ఇక్కడ అనేకమంది భూములు ఇచ్చి భారీగా నష్టపోయిన రైతులకు చుక్కనీరు కూడా ఇవ్వకుండా సుదీర్ఘ ప్రాంతాలకు తరలించడం ఏమిటని వారు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికులకు నీటిని సరఫరా చేసేందుకు రూ.90 కోట్ల నిధులతో మారేళ్లపాడు ట్యాంక్ను నిర్మించడం జరిగిందని ఆ ట్యాంకు ద్వారా అశ్వాపురం మండికుంట ప్రాంతాల్లో చెరువుల్లో నీరు అందించి రెండు పంటలకు నీరు సరఫరా చేసే విధంగా కేసీఆర్ ప్లాన్ రూపకల్పన చేయడం జరిగిందని ఆయన అన్నారు. గోదావరి సరిహద్దు ప్రాంతంలో ఉన్న అశ్వాపురం మండికుంట అమ్మవారి పెల్లి కుమ్మరిగూడెం తదితర గ్రామాల్లో నీటిని ఇవ్వకుండా సుదీర్ఘ ప్రాంతాలకు నీటి దోపిడీ చేయడం అన్యాయమని ఆయన నిరసించారు. అనంతరం బిజీ కొత్తూరు పంప్ హౌస్ వద్ద కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తూ నినాదాలు చేశారు. మారెళ్ల పాడు ట్యాంకు నింపకుండా వేరే ప్రాంతాలకు నీటిని తరలిస్తే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని ఆమరణ నిరాహారదీక్ష సిద్ధంగా ఉంటామని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరిక జారీ చేశారు. దుమ్ముగూడెం ప్రాంతం వద్ద గోదావరి నదిపై సీతమ్మ సాగర్ ప్రాజెక్టు సీతారామ ప్రాజెక్టు జల వనరుల ప్రాజెక్టులను కేసీఆర్ ముందు చూపుతో వేల కోట్లు వెచ్చించి ప్రాజెక్టులు నిర్మించడం జరిగిందని దీనిని ఆసరాగా చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ నీళ్లను తరలించకపోయే కుట్ర జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు ఇదే పరిస్థితి కొనసాగితే రాబోవు కాలంలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమం లో గ్రంధాలయ మాజీ చైర్మన్ దిండిగల రాజేందర్ మణుగూరు అశ్వాపురం బిఆర్ఎస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నూతన ఆర్థిక విధానాల రూపశిల్పి పీవీ

**జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు దుర్గా ప్రసాద్**



**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూన్ 28(నినాదం న్యూస్)**

నూతన ఆర్థిక విధానాల రూపశిల్పి పీవీ నరసింహారావు అని పలువురు వక్తలు కొనియాడారు. శుక్రవారం నాడు జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు, నగర కార్పొరేషన్ మేయర్ పునుకొళ్ళు నీరజలు దివంగత నేత భారతదేశ మాజీ ప్రధాని పి వి నరసింహ రావు జయంతిని పురస్కరించుకొని వారి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ బహుభాషా కోవిదుడు నూతన ఆర్థిక విధానాల రూపశిల్పి పీవీ నరసింహారావు అని, దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్ట పరిచేందుకు ఆయన చేసిన కృషి మరువలేనిదని కొనియా డారు. అనతరం నగర కార్పొరేషన్ మేయర్ పుణుకొల్లు నీరజ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు లు మాట్లాడుతూ.. తెలంగాణ ముద్దు బిడ్డగా ప్రధాన మంత్రి హోదాలో ఆయాన దేశానికి చేసిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు రాష్ట్ర ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు వద్దేబోయిన నరసింహారావు, రాష్ట్ర మైనారిటీ ఉపాధ్యక్షులు బి హెచ్ రబ్బానీ,జిల్లా ఐఎన్టీయూసీ, మైనారిటీ, ఎస్సీ సెల్ అధ్యక్షులు కొత్తా సీతారాములు,సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, బొడ్డు బొందయ్య, కార్పొరేటర్లు మలీదు వేంకటేశ్వర్లు, దుద్దుకూరి వేంకటేశ్వర్లు, లకావత్ సైదులు నాయక్, రాపర్తి శరత్, ఆళ్ళ అంజిరెడ్డి, రఘునాథపాలెం మండల అధ్యక్షులు భూక్యా బాలాజి నాయక్,జిల్లా ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు గజ్జెల్లి వెంకన్న, గజ్జి సూర్యనారాయణ, జిల్లా నాయకులు శెట్టి రంగారావు,యమ్డీ వై పాషా, నగర కాంగ్రెస్ నాయకులు బీరెడ్డి రమేశ్, గడ్డం వెంకటయ్య, రజి, కొలిపొంగు రమేశ్, శ్రీదేవి, ప్రతిభారెడ్డి, సంపటం నరసింహారావు, వాసిమ్ ,తవిడబోయిన రవి,భూక్యా సురేష్ నాయక్, గాదర్ బాబు, నూకారపు వేంకటేశ్వర్లు, మహమ్మోద్, కాసిబోయిన శ్రీను, జయ బాబు తదితర నాయకులు పాల్గొన్నారు.

**మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో...**

**మణుగూరు జూన్ 28( నినాదం న్యూస్) :** మాజీ ప్రధానమంత్రి అపర భగీరథుడు పీవీ నరసింహా రావు జన్మదినోత్సవాన్ని మణుగూరు రేణుక చౌదరి మహిళా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీ నరసింహారావు శుభాకాంక్షలు తెలుపుతూ భారీ కేకును కట్ చేస్తూ కార్యకర్తలు సీట్లు పంచుకొని ఆనందం వ్యక్తం చేశారు. ఆ పార్టీ అధ్యక్షుడు గురజాల గోపి ఆధ్వర్యంలో పీవీ జన్మదినోత్సవములను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి విశేష సేవలు అందించి తెలంగాణ ప్రతిష్టను ఢిల్లీ గద్దమీద వినిపించిన మహనీయుడు పీవీ నరసింహారావు కొనియాడారు. గురజాల గోపి షబానా రేణుక జక్రిపోతుల సుజాత సక్రి సరోజ తదితరులు పాల్గొన్నారు.



## దూసుకెళ్తున్నారు..

- పట్టణంలో హడలెత్తిస్తున్న ర్యాష్ డ్రైవింగ్..
- పేరెంట్స్ ఎంకరేజ్మెంటే కారణమా..?
- ర్యాష్ డ్రైవింగ్ పై పోలీసులు నిఘా పెంచాలంటున్న వాహనాదారులు..
- పట్టుబడితే తాట తీస్తామంటున్న పోలీసులు



**ఇల్లందు,జూన్28(నినాదం న్యూస్)**

పట్టణంలో మైనర్ల ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ దూసుకెళుతున్నారు. వారి నిర్లక్ష్యపు డ్రైవింగ్ తో వాహనదారులతో పాటు నడుచుకుంటూ వెళుతున్న వారిని హడలెత్తిస్తున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా మైనర్లు అతివేగంతో డ్రైవ్ చేస్తుండటంతో పాటు సైలెన్సర్లను రేస్ చేస్తు వేగంగా వెళుతున్నారు. దీంతో ఫ్యామిలీతో బైకుపై ప్రయాణిస్తున్న వారితో పాటు నడుచుకుంటూ వెళుతున్న వారు సైతం భయాందోళనకు గురవుతున్నారు. ఈ మైనర్ల ర్యాష్ డ్రైవింగ్ వలన ప్రమాదాలు జరిగే అవకాశలు ఉన్నాయని వాహనాదురులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అతివేగంతో డ్రైవింగ్ చేస్తున్న వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని వాహనాదారులు కోరుతున్నారు. గతంలో ఇలాంటి వారిపై కఠినంగా వ్యవహరించిన కరీంనగర్ పోలీసులు కొన్ని రోజులుగా వీరిపై దృష్టి సారించక పోవడంతో మళ్ళీ వేగంగా వెళ్తూ చెలరేగిపోతున్నారని వాహనదారులు చెబుతున్నారు. ఏది ఏమైనా పోలీసులు,తల్లితండ్రులు ఇప్పటికైనా చెక్ పెట్టకపోతే పిల్లల భవిష్యత్ తమ ప్రాణాలతో పాటు ఇతర ప్రాణాలను ప్రమాదానికి గురిచేసినట్లే అవుతుంది.

**ఫ్యాషన్గా ఫీల్ అవుతున్న పేరెంట్స్..**

చిన్న వయసులోనే పిల్లలకు డ్రైవింగ్ నేర్పించడం ఫ్యాషన్గా ఫీల్ అవుతున్నారు పేరెంట్స్. పట్టుమని 15 ఏళ్లు నిండకుండానే తల్లితండ్రులు పిల్లలకు డ్రైవింగ్ నేర్పించి ఏకంగా ప్రధాన రోడ్లపై తిరగమని స్వేచ్ఛగా వదిలేస్తున్నారు. కొందరు అయితే పనుల నిమిత్తం పిల్లలను బైకులు ఇచ్చి రోడ్ల పైకి పంపుతున్నారు. మరికొందరు అయితే పదవ తరగతి,ఇంటర్ పూర్తి అయ్యిందో లేదో గర్వంగా ఫీల్ అవుతూ లక్షలు వెచ్చించి బుల్లెట్లు,స్పోర్ట్స్ బైక్స్ కొనిస్తున్నారు. దీంతో వారిచ్చిన స్వేచ్ఛ కాస్త అలుసుగా భావించి పగలు,రాత్రి తేడా లేకుండా విచ్చలవిడిగా రోడ్లపై హైస్పీడ్ గా వెళ్తూ ఇతర వాహన దారులను ఇబ్బందులు పెడుతూ యాక్సిడెంట్ల బారిన పడుతున్నారు. దీన్ని బట్టి చూస్తే పూర్తిగా పిల్లలను జాగ్రత్తగా చూడాల్సిన తల్లితండ్రులే మైనర్ల డ్రైవింగ్ విషయంలో బాధ్యతారాహితంగా వ్యవహరిస్తున్నారు. మైనర్లకి బైకులు ఇవ్వద్దని పోలీసులు ఎన్నిసార్లు విన్నపించిన తల్లిదండ్రుల్లో మాత్రం ఎటువంటి మార్పు రావడం లేదు. ఇది ఇలా ఉండగా మైనర్ల ర్యాష్ డ్రైవింగ్ దృష్ట్యా పోలీసులు ప్రతిరోజు ప్రధాన కూడలి,గల్లీల్లో తనిఖీలు నిర్వహించి కట్టడి చేయాలని విన్నవించుకుంటున్నారు.

**మైనర్లు వాహనంతో పట్టుబడితే చర్యలు**

**- ఇల్లందు సీఐ బత్తుల సత్యనారాయణ**



మైనర్లు వాహనం నడుపుతూ పట్టుబడితే వాహనం ఇచ్చిన వారికి,తల్లిదండ్రులపై చర్యలు ఉంటాయి. పట్ట ణంలో లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపే మైనర్లపై చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక డ్రైవ్లు నిర్వహిస్తు న్నాం. త్రిబుల్ రైడింగ్,ర్యాష్ డ్రైవింగ్ చేస్తే కేసులు నమోదు చేస్తాం. శాంతి భద్రతల నిమిత్తం రాత్రి 10:30 గంటల తరువాత అత్యవసర పరిస్థితుల్లో తప్పా ఎవరు బయటికి రాకుండా పోలీస్ శాఖకు సహకరించాలి.

## పెద్దంపేటలో వైద్య శిబిరం

**పలిమేల జూన్ 28 (నినాదం న్యూస్)**



అంబటిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోగల పెద్దంపేట గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గత కొద్దిరోజులుగా పెద్దంపేట గ్రామంలోని శ్రీ కాలనీలో అపరిశుభ్రమైన బోరు నీరు తాగడం వలన జాండీస్ వ్యాధి వస్తున్న తరుణంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అంబటిపల్లి వైద్య సిబ్బంది, పంచాయతీరాజ్ సిబ్బంది గ్రామమును సందర్శించారు. కాలనీలోని జాండీస్ వ్యాధితో బాధపడుతున్న రోగులను వైద్యాధికారి డాక్టర్ పూణేమ్ రామారావు పరామర్శించారు. తదుపరి వైద్య శిబిరం నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కాలనీలో ప్రజలు తాగునీటికి ఉపయోగిస్తున్నటువంటి బోరు పంపులను పైపులైన్లను పరీక్షించారు. జాండీస్ వ్యాధి కాలెయం సంబంధించినటువంటి జబ్బు. అపరిశుభ్రంగా ఉన్నటువంటి తాగునీరు తాగటం వలన వస్తుందని ఆ బోర్ వాటర్‌ను ఎవరు కూడా ఉపయోగించవద్దని ఇతరత్న ఏ కార్యక్రమాలకు వాడకూడదని ప్రజలకు వివరించి చెప్పారు. ఈ కాలనీలోని ప్రజలు, గ్రామాల్లోని ఇతర ప్రజలు ఉపయోగిస్తున్నటువంటి త్రాగునీరు వసతులను పరిశీలించి ఆ వాటర్ శాంపుల్స్ ని స్వీకరించి పరీక్షలకు పంపించారు. పంచాయతీరాజ్ శాఖ సిబ్బంది, డివిజన్ లెవెల్ అధికారి, కార్యదర్శి త్రాగునీరు వసతులను పరిశీలించి ఆ శాంపుల్స్ ను జిల్లా కేంద్రంలో పంపించారు.

## స్త్రీ పురుష సమానత్వంకై ఉద్యమించాలి

**- ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు పగిడి పాల తిరుపతక్క.**



**తొర్రూరు జూన్ 28 (నినాదం న్యూస్):**
స్త్రీ, పురుష సమానత్వంకై ఉద్యమాలకు సిద్ధం కావాలని ప్రగతిశీల మహిళా సంఘం పిఓడబ్ల్యూ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షురాలు పగిడి పాల తిరుపతక్క అన్నారు. శుక్రవారం ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యూ) తొర్రూరు డివిజన్ మహాసభ నెల్లికుదురు మండలం ఎర్రబెల్లిగూడెం (శనిగకుంట తండ) అనసూర్యక్క నగర్‌లో ఆలకుంట్ల దర్గమ్మ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పగిడిపాల తిరుపతక్క హాజరైన మాట్లాడారు. నానాటికీ సమాజంలో స్త్రీలపై అఘాయిత్యాలు,అత్యాచారాలు పెరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సామ రజిత, ఎస్ కవిత, కవిత, కత్తుల ఉపేంద్ర, ఊడుగుల కనకమ్మ,, ఐలమ్మ, భూలక్ష్మి, తారమ్మ, డివిజన్ నాయకులు మంజుల, కవిత, భద్రమ్మ, అరుణ, సరోజన, కాంతమ్మ, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో యువకుడికి గాయాలు

**తొర్రూరు జూన్ 28 (నినాదం న్యూస్) :**



విద్యుత్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో యువకుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. పోచంపల్లి గ్రామం జయరాం తండాకు చెందిన బానోత్ సునీల్ (21) తొర్రూరు మండలం వెలికట్ట గ్రామ శివారు శ్రీనివాస గార్డెన్ సమీపంలో విద్యుత్ కాంట్రాక్టర్ దగ్గర విధులు నిర్వహిస్తూ విద్యుత్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో విద్యుత్ షాక్ తగిలి గాయాల పాలైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కాంట్రాక్ట్ పనులు నాణ్యతతో నడుస్తుందా లేదా అని లైన్ ఇన్స్పెక్టర్ మరియు లైన్మెన్లు పనులు జరుగుతున్న స్థలానిక వెళ్లి పరిశీలిస్తుండగా ఈ ఘటన చోటు చేసుకోవడంతో హుటాహుటిన బానోత్ సునీల్ అను యువకుడిని తొర్రూరు పట్టణ కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రికి వైద్య నిమిత్తం తరలించారు. ఈ విషయంపై బాధితులు బానోత్ సునీల్ గ్రామస్తులు వారి కుటుంబ సభ్యులు కాంట్రాక్టర్, కాంట్రాక్టర్‌కు సంబంధించిన వ్యక్తులు ఒప్పంద పత్రం రాయించుకుని బాధితుడు నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి కావడంతో కాంట్రాక్టర్ వైద్య ఖర్చులు తదితర ఖర్చుల నిమిత్తం పేద కుటుంబానికి చెందిన వ్యక్తి కావడంతో నష్టపరిహారం చెల్లించినట్లు... కుటుంబ సభ్యులు కూడా ఒప్పుకొని ఒప్పంద పత్రం మీద సంతకాలు చేసుకున్నట్లు సమాచారం.

**ప్రమాద ఘటనకు మాకు ఎలాంటి సంబంధం లేదు : లైన్ ఇన్స్పెక్టర్, లైన్మెన్**

విద్యుత్ పనులను కాంట్రాక్టర్‌కు పనులు జరుగుతున్న స్థలానికి వెళ్లి చేస్తున్న పనులను నాణ్యతతో చేస్తున్నారా లేదా అని తనిఖీలకు వెళ్లిన సమయంలో విద్యుత్ పనులు చేస్తున్న యువకుడు ప్రమాదానికి గురికావడం జరిగిందని లైన్ ఇన్స్పెక్టర్ కొమ్మనబోయిన సోమలింగం, లైన్మెన్ కందగట్ల అశోక్‌లు తెలిపారు. ఈ ప్రమాద ఘటనకు మాకు ఎలాంటి సంబంధం లేదని వారు తెలిపారు.

## తహసిల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి

**- తహసీల్దార్ రవికుమార్**



**మల్హర్ రావు, జూన్ 28 (నినాదం న్యూస్) :** మండల కేంద్రమైన తాడిచర్ల తహసిల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మండల తహసిల్దార్ రవి కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశానుసారం వచ్చే సోమవారం నుండి ప్రతి సోమవారం ఉ.10.30నిల నుండి మధ్యాహ్నం 1.00 వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఇట్టి అవకాశాన్ని మండల ప్రజలు వినియోగించుకొని తమ సమస్యల పై దరఖాస్తు చేసుకోవాలని తహసిల్దార్ తెలిపారు.

### కాళోజి కళాక్షేత్రం

## నాటకాల ప్రదర్శనకు అనుకూల అనువుగా నిర్మించాలి

**వరంగల్ జిల్లా ప్రతినిధి జూన్ 28 (నినాదం న్యూస్) :** గ్రేటర్ వరంగల్ మహా నగరం బాలసముద్రం లోని కాళోజి కళాక్షేత్రం వేదికను నాటకాల ప్రదర్శనకు అనువుగా నిర్మించాలని కోరుతూ తెలంగాణ డ్రామటిక్ అసోసియేషన్ అధ్యక్షులు ఆకుల సదానందం, ఉపాధ్యక్షులు బాలాజీ నేతృత్వంలో శుక్రవారం అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు.అదే విధంగా కాకతీయుల వైభవాన్ని తెలంగాణ వ్యాప్తంగా చాటేందుకు అవసరమైన అనుమతులు లభించేలా చర్యలు చేపట్టాలని, మంత్రి కి అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. తెలంగాణ డ్రామటిక్ అసోసియేషన్ వినతుల పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తానని మంత్రి సురేఖ హామీ ఇచ్చారు.



# బ్యాంకర్లు నిర్దేశించిన రుణాలు మంజూరు చేయాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి జూన్ 28 (నినాదం న్యూస్)**



ఐడిఓసి కార్యాలయంలో 2024-25 జిల్లా వార్షిక రుణ ప్రణాళికను జిల్లా కలెక్టర్ ప్రకటించారు. ఈ సందర్భంగా వార్షిక రుణ ప్రణాళిక పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకర్లు ప్రాధాన్యతారంగాలకు కేటాయించిన లక్ష్యాలను సాధించాలని తెలిపారు. 2023-24 ఆర్థిక సవత్సరంలో జరిగిన ప్రగతిపై బ్యాంకర్లతో డిసిసి, డిఎల్ఆర్సి సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 2024-05 సంవత్సరంలో రూ.2223.41 కోట్లు రుణ మంజూరుకు కమిటీ ఆమోదించిందని తెలిపారు. ఈ సందర్భంగా 12 రంగాలకు రూ.1991.55 కోట్లు రుణాలు మంజూరు లక్ష్యం కాగా రూ.1453.32 కోట్లు రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. పీఎం ఈజిపి లక్ష్యం 75 యూనిట్లుకు రూ.243.74 కోట్లు లక్ష్యం కాగా 26 యూనిట్లు మంజూరు రూ.96.31 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. 35354 మందికి రూ.209.94 కోట్లు ముద్ర రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. 2024-25 జిల్లా వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాలను సాధించే అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కేటాయించున్న లక్ష్యం మేరకు వ్యవసాయ, చేపలు పెంపకానికి, పామాయిల్ సాగు, స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు, మహిళ స్వయం సహాయక సంఘాలు ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత నిస్తున్నదని, అట్టి ప్రాధాన్యతను గుర్తించి మహిళా సంఘాలకు బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరం లో ప్రభు త్వం ప్రతిష్టాత్మకంగా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా ఎస్.హెచ్.జి మహిళా సంఘాలకు రుణాలు మంజూరుకు సమిష్టిగా కృషి చేయాలని అన్నారు. వీధి వ్యాపారులకు మొదటి విడతగా మంజూరు చేసిన 10, 20 వేలు చిల్లించిన 186 మందికి వక్కొక్కరికి 50 వేలు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. మన జిల్లాను నీతి ఆయోగ్ యాస్పిరేషనల్ జిల్లాగా ప్రకటించిందని, అట్టి యాస్పి రేషన్ జిల్లాలో 50 కామన్ సర్వీస్ సెంటర్స్ ఏర్పాటు లక్ష్యం కాగా 40 ఏర్పాటు చేశారని, మిగిలిన 10 ఏర్పాటు చేయాలని సూచించారు. కామన్ సర్వీస్ సెంటర్స్ ఏర్పాటుకు 1.20 కోట్లు సబ్సిడీ మంజూరు చేసినట్లు తెలిపారు. రేగొండలో బాంక్ బ్రాంచ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు అందచేయాలని ఎల్డిఎం కు సూచించారు. జిల్లాలో చేపలు, డ్రాగేన్ పండ్ల తోటలు, గొర్రెలు పెంపకానికి. మంచి అవకా శాలు న్నాయని బ్యాంకర్లు ఇట్టి యూనిట్స్ ఏర్పా టుకు రుణాలు మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎల్డిఎం తిరుపతి, ఆర్బిఐ నోడల్ అధికారి ఆలీబాబా, నాబార్డు ఈజిఎం రవి, డిఆర్డిఓ నరేష్, వ్యవసాయ అధికారి విజయ భాస్కర్, ఉద్యానవన శాఖ అధికారి సంజీవరావు, మత్స్యశాఖ అధికారి అవినాష్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## బొగ్గు బ్లాక్ లను సింగరేణికే అప్పగించాలి : సిపిఎం

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి జూన్ 28 (నినాదం న్యూస్)**



బొగ్గు బ్లాక్‌లను సింగరేణికే అప్పగించాలని సిపిఎం డిమాండ్ చేసింది. శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ బొమ్మ దగ్గర బొగ్గు బావుల ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని, సింగరేణికే బొగ్గు బావులను కేటాయించాలని, సింగరేణి ప్రాంతంలో బొగ్గు బ్లాక్ లను వేలం వేయరాదని, బొగ్గు బావులను కార్పోరేట్ శక్తులకు కట్టబెట్టడాన్ని ఆపాలని, సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, సింగరేణి కాంటాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ బొమ్మ దగ్గర నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జయశంకర్ భూపాలపల్లి జిల్లా నాయకులువెలిశెట్టి రాజయ్య,గుర్రం దేవేందర్, ఆతుకూరి శ్రీకాంతు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ సర్కారు దేశవ్యాప్తంగా బొగ్గు రంగంలో ఉన్న 67 బొగ్గు బ్లాకులను వేలంపాట ద్వారా కార్పొరేట్ శక్తులకు అప్పగించడం కోసమే వేలం పాటలు వేస్తుందని, తెలంగాణ రాష్ట్రంలోని మందమర్రి ఏరియాలో ఉన్న శ్రావణ్ పెల్లి కార్పొరేట్ శక్తులకు ఇవ్వడానికి వేలం వేసిందని ఆరోపించారు. వేలంపాటను వెంటనే నిలుపుదల చేయాలని, సింగరేణికి బొగ్గు బ్లాక్ లను అప్పగించాలని డిమాండ్ చేశారు. ప్రజలు ప్రజాసామిక వాదులు, విద్యార్థులు యువజనలు మేధావులు మహిళలు సకల జనులు మోడీ ప్రభుత్వ విధానాల్ని బొగ్గు రంగం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా ఆఫీసు కారల్ మార్క్స్ కాలనీ నుండి అంబేద్కర్ బొమ్మ వరకు 300 మందితో భారీ ర్యాలీ సిపిఎం జిల్లా నాయకులు వెలిశెట్టి రాజయ్య అధ్యక్షతన జరిగింది. అనంతరం అంబేద్కర్ బొమ్మ దగ్గర ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కుమ్మరి రాజు,ఆకుదారి రమేష్, నూనెటి నరేష్, ఆతుకూరి శ్రీధర్,సిహెచ్ రవికుమార్, ప్రభాకర్,బాపు, సాంబయ్య, ప్రభాకర్, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు వంగాల లక్ష్మి, ఎన్ పి ఆర్ డి నాయకులు గడప శేఖర్, మహేందర్తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ సుడిగాలి పర్యటన

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి జూన్ 28 (నినాదం న్యూస్)**



జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జిల్లాలో శుక్రవారం సుడిగాలి పర్యటన చేశారు. ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న మరమ్మతు పనులను, ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సేవలు, అంగన్వాడి టీచర్లకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ముందుగా చిట్యాల మండలం జడల్ పేట, గాంధీనగర్, భీష్మనగర్ లోని ప్రాథమిక పాఠశాలలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. రామచంద్రపూర్ గ్రామంలో అంగన్వాడీ టీచర్లకు జరుగుతున్న శిక్షణ తరగతులను పరిశీలించిన అనంతరం చిట్యాల మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సేవలకు వచ్చిన వారిని వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుండి మొగుళ్ళపల్లి మండలంలోని అరేపల్లి ప్రాథమిక పాఠశాల, ఇస్సిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో జరుగుతున్న మౌలిక సదుపాయాలు కల్పన పనులను పరిశీలించి విద్యార్థులతో కొద్ది సేపు ముచ్చటించారు. భవిష్యత్ లో ఏమి అవుతారని అడిగి తెలుస్తుకున్నారు. విద్యార్థులు చెప్పిన సమాధానంపై ఆయన మాట్లాడుతూ బాగా చదువుకోవడం వల్ల మీరు చెప్పిన విధంగా వైద్యులుగా, పోలీసులుగా, సాఫ్ట్వేర్ ఇంజినీర్స్ తదితర స్థాయికి చేరుకుంటారని మంచిగా చదవాలని సూచించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై సూచనలు చేశారు. చిట్యాల మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను పరిశీలించిన కలెక్టర్ వానాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై రోగులకు అవగాహన కల్పించాలని, సీజనల్ వ్యాధులకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. తల్లికి కడుపుకోతను తగ్గించేందుకు సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని అందుకు గర్భ నిర్ధారణ జరిగిన నాటి నుండే నిరంతర క్రమం తప్పక వైద్య సేవలు అందించాలని సూచించారు. వైద్య సిబ్బంది, డాక్టర్లు అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ డి డబ్ల్యు ఓ అవంతిక, చిట్యాల సిహెచ్.సి సూపరిండెంట్ జీడీ తిరుపతి, చిట్యాల, మొగుళ్లపల్లి తహశీల్దార్లు, ఖాజా మోహినుద్దీన్, సునీత ఎంపిడిఓ, విజయ లక్ష్మి, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పీవీ నరసింహారావు జయంతి



**వరంగల్ జిల్లా ప్రతినిధి జూన్ 28 (నినాదం న్యూస్)**
దివంగత మాజీ ప్రధాని తెలుగుజాతి ముద్దుబిడ్డ పి వి నరసింహారావు జయంతిని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పివి చిత్ర పటానికి, హన్మకొండ బస్టాండ్ కూడలిలో ఉన్న కాంస్య విగ్రహానికి వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించినారు. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థను సంస్కరణలతో గాడిన పెట్టిన మాహా మేధావి పివి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ ఎం పి, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, టిపీసీసీ కార్యదర్శి ఈ వి శ్రీనివాస్ రావు, కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మొహమ్మద్ అజీజ్ ఖాన్, బంక సరళ, మనసా రాంప్రసాద్ గుంటి స్వప్న, తాళ్లపల్లి మేరీ, బండారి జనార్ధన్, నల్ల సత్యానారాయణ,మాజీ కార్పొరేటర్ ఏ నాగరాజు, గాండ్ల స్రవంతి, మొహమ్మద్ జాఫర్, కట్ట రఘుపాల్ రెడ్డి, మండల సమ్మయ్య, కొన శ్రీకర్, బంక సతీష్ యాదవ్, వాళ్లపు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



**పీవీకి నివాళ్లు అర్పించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు**

మాజీ ప్రధాని పీవీ నర్సింహా రావు 103వ జయంతిని పురస్కరించుకొని, వారి విగ్రహానికి పూలమాల తో నివాళులు అర్పించిన వర్ధన్నపేట శాసనసభ్యులు, మాజి ఐపిఎస్ అధికారి కె ఆర్ నాగరాజు.ఈ కార్యక్రమం లో హనుమకొండ జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య, జి డబ్ల్యూ సి కమిషనర్ అశ్విని తనాజీ వాకడే, స్టేట్ ఫైనాన్స్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య , హనుమకొండ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ గ్రంధాలయం చైర్మన్ అజీజ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి**

**వనపర్తి జిల్లా ప్రతినిధి జూన్ 28 (నినాదం న్యూస్)**
వర్షాకాలంలో పరిసరాల్లో నిలువ నీరు ఉండకుండా శుభ్రం చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం డ్రై డే సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదర్శ్ అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తో కలిసి వీపనగండ్ల, చిన్నంబావి మండలాల్లో పర్యటించి డ్రై డే నిర్వహణను పరిశీలించారు.ఉదయాన్నే విపన్గండ్ల మండలం గోవర్ధన గిరి, వీపన్ గండ్ల, చిన్నంబావి, అమ్మయిపల్లి గ్రామాల్లో పర్యటించారు. గ్రామాల్లో డ్రై డే సందర్భంగా ప్రజలకు ఎలాంటి అవగాహన కల్పిస్తున్నారు, పరిసరాలు ఎలా ఉన్నాయి అనే విషయాలు పరిశీలించారు. మిద్దెల మీద పాత టైర్లు, కుండలు, కొబ్బరి చిప్పలు, రోళ్ళు, బాటిల్ యొక్క మూతలు వంటి వాటిలో వర్షపు నీరు చేరడం వల్ల వాటిలో దోమలు గుడ్లు పెట్టి దోమల వ్యాప్తి శరవేగంగా జరుగుతుందన్నారు. దోమల వల్ల ప్రాణాంతక డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా వంటి వ్యాధులు వస్తాయని అందువల్ల నిలువ నీరు ఉండకుండా ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలన్నారు. డ్రై డే రోజున పంచాయతీ సెక్రెటరీ, అంగన్వాడి, ఆశ వర్కర్లను ప్రతి ఇంటికి వెళ్లి పరిసరాలు పరిశీలించడమే కాకుండా ప్రజలకు డ్రై డే, దోమల వ్యాప్తి ఎలా జరుగుతుందో వివరించాలన్నారు. ప్రజలతో ఆరా తీశారు. అనంతరం చిన్నంబావి మండలం తహశీల్దార్ కార్యాలయంలో ధరణి ఫిర్యాదులను పరిశీలించారు. ధరణి ఫిర్యాదులు తహసిల్దార్ లాగిన్‌లో వచ్చిన వాటిని ఎప్పటికప్పుడు సమగ్ర పరిశీలన జరిపి పరిష్కరించాలని తహసిల్దార్‌ను ఆదేశించారు. చిన్నం బావి మండలం వెల్టూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. మరమ్మతు పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పలు సూచనలు చేశారు. అనంతరం గ్రోమోర్ రైతు సేవా కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల స్టాక్ నిలువ, విత్తనాల నిలువ, ఇప్పటి వరకు అమ్మిన విత్తనాలు, ఎరువులు, మిగిలిఉన్న స్టాక్ ను పోస్ టెర్మెండ్ యంత్రంతో సరిచూసుకున్నారు. స్టాక్ సరిపోవడంతో సంతృప్తిని వ్యక్తం చేశారు. అదనపు కలెక్టర్ సంచిత గంగ్వార్, వీపన గండ్ల ప్రత్యేక అధికారి లక్ష్మప్ప, చిన్నం బావి తహసిల్దార్ ఇక్బాల్, ఎంపీడీఓ రమణ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాల సంఖ్యను పెంచాలి

**- జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి**

వనపర్తి జిల్లాలో సీజేరియన్ ద్వారా ప్రసవాలు అధికంగా జరుగుతున్నాయని దీనిని నివారించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ సురభి ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో వైద్య శాఖ అధికారులు, డాక్టర్లతో సమీక్ష నిర్వహించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నమోదు అవుతున్న ట్రెయిమిస్టర్ లు, అనీమియా కేసులు, ప్రభుత్వ, ప్రైవేట్ హాస్పిటల్లో జరుగుచున్న ప్రసవాలు, సీజనల్ వ్యాధుల పై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని, సీజేరియన్ కాకుండా సాధారణ ప్రసవాలు ఎక్కువగా జరిగేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో 54 శాతం ప్రసవాలు జరుగుతున్నాయని అందులో 75 శాతం సీజేరియాన్ ద్వారా ప్రసవాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేట్ ఆసుపత్రులను క్రమం తప్పకుండా సందర్శించి సుజేరియన్ కేసుల పై ఆరా తీయాలన్నారు. అవసరం లేకున్నా సిజేరియన్ చేస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ట్రైమిస్టర్ నమోదు ప్రక్రియ సజావుగా జరగాలని గర్భిణీలకు సుఖ ప్రసవం జరిగే వరకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా వ్యాప్తి చెందకుండా దోమల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. 2021 నుండి ఇప్పటి వరకు జిల్లాలో నమోదు అయిన డెంగ్యూ కేసుల వివరాలు నివేదిక రూపంలో ఇవ్వాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. జయచంద్ర మోహన్, మెడికల్ ఆఫీసర్లు, ప్రోగ్రాం ఆసర్లు తదితరులు పాల్గొన్నారు.

## అప్రమత్తతో విధులు నిర్వర్తించాలి : ఎస్పి



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి జూన్ 28 (నినాదం న్యూస్)**
మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దులోని పోలీసులు మావోయిస్టుల కదిలికలపై అప్రమత్తంగా ఉండాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. శుక్రవారం కాళేశ్వరం పోలీసు స్టేషన్‌ను ఎస్పి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో రికార్డులను, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. జిల్లాలో మావోల ప్రాబల్యం ఉన్నందున, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో పోలీసులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పక్కనే మహారాష్ట్రలో మావోలకదిలికలు అధికంగా ఉండడంతో గోదావరి నది దాటి వచ్చే అవకాశం ఉన్నందున పటిష్ట నిఘా పెట్టాలని ఎస్పి గారు సూచించారు. అలాగే పోలీసు స్టేసన్‌కు వచ్చే ఫిర్యాదు దారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారం చేసే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. పోలిసు సిబ్బంది, అధికారులు క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని పోలిసు సిబ్బందికి ఎలాంటి సమస్యలు ఉన్నా, తమ దృష్టికి తీసుకురావాలని ఎస్పి కిరణ్ ఖరే అన్నారు. అనంతరం ఎస్పి కాళేశ్వరంలోని ఇసుక క్వారీల పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాటారం డిఎస్పీ రామ్మోహన్ రెడ్డి, ఎస్ బి ఇన్స్పెక్టర్ వసంత్ కుమార్, కాళేశ్వరం ఎస్సై చక్రపాణి, సిబ్బంది పాల్గొన్నారు.

## సాధికారత భవనం ప్రారంభించిన స్థలదాత లక్ష్మి

**కేసముద్రం, జూన్ 28 (నినాదం న్యూస్):**



కేసముద్రం మండలంలోని కాట్రపల్లి గ్రామంలో మహిళా సాధికారత భవనాన్ని మహిళల సౌకర్యం కొరకు మండల పరిషత్ నిధుల నుండి రూ.3 లక్షల 50 వేల తో నిర్మించిన భవనాన్ని భవన స్థలదాత బొంత లక్ష్మి చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా ఎంపీపీ ఓలం చంద్రమోహన్, స్థానిక ఎంపిటిసి గుగులోత్ సునీత - దస్రు నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా సాధికారతే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు గ్రామైక్య సంఘం బాధ్యులు ఎంపీపీ ఓలం చంద్రమోహన్, ఎంపీటీసీ గుగులోత్ సునీత - దస్రు నాయక్ లను శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఏపిఎం రాజీవ్ గ్రామ ప్రత్యేక అధికారి శివప్రసాద్, పిఆర్ ఏఈ మానస , గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు దాసరి పద్మ, జాటోత్ అంబాలి ,మాజీ సర్పంచ్ జల్లే సుమలత- యకాంబ్రం, జె.లక్ష్మణ్, ఎస్. మల్లయ్య, బిక్షపతి ,ప్రభాకర్ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ

**- కాంగ్రెస్ పార్టీ నాయకులు తరాల అర్చన వీరేష్ యాదవ్**

**కేసముద్రం, జూన్ 28 (నినాదం న్యూస్):**



తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయనున్న రైతు రుణమాఫీ కార్యక్రమం సాహసోపేత నిర్ణయమని కేసముద్రం మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు తరాల అర్చన వీరేష్ యాదవ్ అన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రుణమాఫీతో అనేకమంది పేద రైతులు కష్టాలనుంచి బయటపడతారని తెలిపారు. గత బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం పదేళ్ల కాలంలో రుణమాఫీని ఆరేడు విడతల్లో చేసిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఒకేసారి రెండు లక్షల రుణమాఫీ చేయబోతున్నారని తెలిపారు. ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేయడం ఒక కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని మండల నాయకులు తరాల అర్చన వీరేష్ యాదవ్ అన్నారు.

## గ్రామాల్లో పంటల పరిశీలన

**కేసముద్రము జూన్ 28.(నినాదం న్యూస్)**
కేససముద్రం మండలంలో పలు గ్రామాల్లో పంటల పరిశీలను శుక్రవారం అధికారులు చేశారు. ప్రస్తుతం రైతులు సాగు చేస్తున్న పత్తి, మొక్కజొన్న, జీలుగ, కూరగాయలు, ఆయిల్ పామ్ తదితర పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. రైతులందరూ పంట నమోదు చేయించుకోవాలని రైతులందరినీ కోరారు. రైతులు పంట మార్పిడి చేసి, మార్కెట్ డిమాండ్ ఉన్న ఉద్యాన పంటలు, ఆయిల్ పామ్ తోటలు, కూరగాయలు, మునగ, ఆకుకూరలు, మొదలైనవి సాగు చేయాలని కోర్సా అభిమన్యుడు, జిల్లా వ్యవసాయ అధికారి, మరియు జినుగు మరియన్న జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీ కాలే రవివర్మ, పలువురు రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై సస్పెన్షన్ ఎత్తివేయాలి




**సూర్యాపేట జిల్లా ప్రతినిధి జూన్ 27 (నినాదం న్యూస్) :**
హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో సమస్యలపై ప్రశ్నించిన ఎస్ఎఫ్ఐ యూనిట్ కార్యదర్శి సస్పెన్షన్ ఇతర విద్యార్థులకు జరిమానా విధించడాన్ని నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని 60 ఫీట్ల రోడ్డులో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విసి దిష్టిబొమ్మను ఎస్ఎఫ్ఐ సూర్యాపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దగ్ధం చేశారు .ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్ వర్మ మాట్లాడుతూ యూనివర్సిటీ సమస్యలపై స్పందిస్తే విసి పాలకవర్గం కక్ష్యకట్టి విద్యార్థి నాయకులు విద్యార్థులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. సస్పెన్షన్ ఎత్తివేయకపోతే దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. జిల్లా కార్యదర్శి బానోతు వినోద్ కుమార్ ,గిరిజన శక్తి జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ నాయక్, వినయ్, తన్వేష్, వంశీకృష్ణ, గోపి, గౌతమ్ ,అరుణ్, వరుణ్, సైదులు పాల్గొన్నారు.

## ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు



**చింతపల్లి, జూన్ 28(నినాదం న్యూస్) :**
ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎ. డి ఎ. శ్రీలక్ష్మి హెచ్చరించారు.మండలంలోని వి టి.నగర్ లో మండల వ్యవసాయ శాఖ అధికారి పి. శ్రావణ కుమారి తో కలిసి శుక్రవారం ఎరువుల దుకాణాల యజమానులతో జరిగిన సమావేశంలో అమె మాట్లాడారు.రైతులకు ఎరువులు సకాలంలో అందుబాటులో ఉంచాలని , అదేవిధంగా పురుగు మందులు, ఎరువులను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని అమె సూచించారు.ఎమ్మార్పీ కి మించి అధిక ధరలకు విక్రయిస్తే దుకాణా దారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.దుకాణాలను కూడా సీజ్ చేయడం జరుగుతుందని ఆమె చెప్పారు .ఎరువుల అమ్మకపు వివరాలను రికార్డుల్లో ప్రతిరోజు పొందుపరచాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు మధు, శ్రీలత , ఎరువుల దుకాణం యజమానులు ఉప్పు శ్రీశైలం, పూల యాదయ్య,వాస శ్రీను,వెంకటయ్య, ఆర్ ఎన్.ప్రసాద్,పొగాకు శ్రీశైలం, కుంభం శ్రీనివాస రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సందే ఇద్దయ్య మృతి బాధాకరం



**చింతపల్లి , జూన్ 28(నినాదం న్యూస్):**
మండలంలోని తీదేడు (వెంకటంపేట)గ్రామానికి చెందిన సందే ఇద్దయ్య మృతి బాధాకరమని ఆ గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కాయితి జితెందర్ రెడ్డి అన్నారు. ఈ సంధర్భంగా ఆయన సందే ఇద్దయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని కుమారుడు సందే యాదయ్య కు ఐదు వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దాసరి శ్రీనివాస్ యాదవ్, పల్లెటి నర్సింహ,సందే లక్ష్మయ్య,మల్లిగారి యాదయ్య, కటపాక వెంకటయ్య,సందే చంద్రయ్య,ఉడుత లింగయ్య,సందే అంజయ్య,సందే కిరణ్,రాజయ్య, సాయి,వెంకటయ్య,రామలింగం తదితరులు పాల్గొన్నారు .

## పాఠశాలల ఆకస్మిక తనిఖీలు



**చింతపల్లి, జూన్ 28(నినాదం న్యూస్) :**
మండల కేంద్రంలోని ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను జిల్లా విద్యాశాఖాధికారి, భిక్షపతి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఆదేశించారు. నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని, అమ్మ ఆదర్శ పాఠశాల పనులను వేగవంతం చేయాలని సూచించారు. పాఠశాలలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఆయన అన్నారు.పాఠశాలలలో రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

## అధికారులు గ్రామాలలో సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**చింతపల్లి, జూన్ 28(నినాదం న్యూస్) :**
అధికారులు గ్రామాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరించడంలో కృషి చేయాలని స్థానిక ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. డిండి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. అధికారులు క్షేత్రస్థాయిలో గ్రామాలను సందర్శించి,ప్రజా సమస్యలను తెలుసుకొని,వాటి పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలని సూచించారు.




## గంజాయి విక్రయిస్తున్న వ్యక్తులు అరెస్ట్

**కోదాడ,జూన్ 28(నినాదం న్యూస్):**
గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులు అరెస్టు వారి వద్ద నుండి 900 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్న సంఘటన పట్టణ శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. ఆప్కారి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అప్కరి పోలీసులు సిఐ ఆధ్వర్యంలో వారి టీం లతో కోదాడ టౌన్ శివారులలో దాడులు నిర్వహించగా ఇద్దరు వ్యక్తులను పట్టుకుని వారి వద్ద నుండి 900 గ్రాముల డ్రై గంజాయి స్వాధీనం చేసుకొని ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి వారి నుండి ఒక స్కూటీని స్వాధీనం చేస్తున్నట్లు ఆప్కారి సిఐ శంకర్ తెలిపారు.

# రైతు పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం : ఎమ్మెల్యే



**చింతపల్లి, జూన్ 28(నినాదం న్యూస్) :**
కాంగ్రెసు పార్టీ ప్రభుత్వం రైతుల పక్షపాతి ప్రభుత్వమని స్థానిక ఎమ్మెల్యే నేనా వత్ బాలు నాయక్, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీ కృష్ణ లు అన్నారు.డిండి మండల పరిధిలో ఉన్న డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నుంచి ఆయకట్ట ప్రాంతానికి వారిరువురు కలిసి శుక్రవారం నీటిని విడుదల చేశారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ వరంగల్ రైతు డిక్లరేషన్ లో ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీపై ఇప్పటికే కేబినెట్ ఆమోదం తెలిపిందని అన్నారు.వ్యవసాయాన్ని పండగ చేయాలన్నదే కాంగ్రెస్ పార్టీ విధానమని అన్నారు.మాట ఇస్తే మడమ తిప్పని నాయకులు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జునఖర్గే, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి లని వారన్నారు.ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుందని,గత ప్రభుత్వం 11డిసెంబర్ 2018 వరకు కటాఫ్ తేదీతో రుణమాఫీ చేసిందని, తమ ప్రభుత్వం 12డిసెంబర్ 2018 నుంచి 9 డిసెంబర్ 2023 మధ్యకాలంలో రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ చేయాలని నిర్ణయించిందని వారు తెలిపారు.రుణమాఫీకి దాదాపు రూ.31వేల కోట్లు అవసరమవుతోందని, కాని రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం రుణమాఫీ చేయాలని నిర్ణయించిందని వారు అన్నారు.రైతు భరోసాపై రకరకాల చర్చలు జరుగుతున్నాయని తెలిపారు.రోడ్లు, కొండలు, గుట్టలకు, రియల్ ఎస్టేట్ భూములకు, ధనికులకు రైతు భరోసా ఇస్తున్నారని చర్చ జరుగుతోందని,అందుకే రైతు భరోసాను పారదర్శకంగా అందించేందుకు, నిజమైన రైతులకు భరోసాను అందించేందుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘం నియమించడం జరిగిందని వారు తెలిపారు.జూలై 15లోగా కేబినెట్ సబ్ కమిటీ ప్రభుత్వానికి నివేదిక అందిస్తుందని, నివేదికను శాసనసభలో పవేశపెట్టి అందరి సూచనలతో పారదర్శకంగా రైతు భరోసాను తమ ప్రభుత్వం అమలు చేయడం జరుగుతుందని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి వినియోగం, విక్రేతలపై పోలీసుల పట్టు





**మిర్యాలగూడ, జూన్ 27(నినాదం న్యూస్):**
ఐదుగురు గంజాయి నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద 2.1 కేజీల ఎండు గంజాయి, ఒక మొబైల్ ఫోన్, 2 వేలు నగదు, 3,600 పెయిన్ కిల్లర్ టాబ్లెట్స్ స్వాధీన పర్చుకునట్లు డిఎస్పీ కె.రాజశేఖరరాజు తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక 2 టౌన్ పోలీస్ స్టేషన్లో జరిగిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను వెల్లడిస్తూ ఏపీ రాష్ట్రం పల్నాడు జిల్లాలోని మాచర్లకు చెందిన బత్తుల కుమారి వద్ద నుంచి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి పట్టణంలోని రాజీవ్ నగర్ కు చెందిన చలసాని కోటేశ్వరరావు, సంపత్, అశోక్, నల్గొండ పట్టణం గొల్లగూడకు చెందిన మహమ్మద్ సంషీర్ మిర్యాలగూడ పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన నేనావత్ అశోక్ లు ఆమె వద్ద తక్కువ ధరకు గంజాయి, పెయిన్ కిల్లర్ టాబ్లెట్స్ కొనుగోలు చేసి అవసరం ఉన్న వినియోగదారులకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారని తెలిపారు. గురువారం సాయంత్రం నార్కట్పల్లి అద్దంకి బైపాస్ రోడ్ లో 2 టౌన్ నాగార్జున ఆధ్వర్యంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పవన్ మోటార్స్ వెనకాల నిర్మానుష్య ప్రదేశంలో అనుమానాస్పదంగా కొందరు వ్యక్తులు కనిపించడంతో వారి వద్దకు వెళుతుండగా పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకొని విచారించామని తెలిపారు. దీంతో బత్తుల కుమారి వద్ద గంజాయి పెయిన్ కిల్లర్ టాబ్లెట్స్ కొనుగోలు చేసి తక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందని తెలిపారు. ఇప్పటికే ఒకసారి 11 మందిని మరోసారి ఏడుగురిని గంజాయి నిందితులను అరెస్టు చేశామని తెలిపారు. గంజాయి విక్రయించిన సేవించిన చట్టరీత్య నేరమని, ఎవరిని వదిలి పెట్టమని చెప్పారు. కేసులను చేదించిన సిఐ పి.నాగార్జున, ఎస్ఐలు రాంబాబు, కృష్ణయ్య, కానిస్టేబుల్స్ కళ్యాణ్, బాలకృష్ణ, ధనంజయ, రాగ్యా నాయక్, ఎండి అక్బర్ పాషా, రామకృష్ణ, శ్రీనివాస్, హెూంగార్డు డి.శ్రీనివాస్ లను ఆయన అభినందించారు.

## లక్ష్యే లక్ష్యం చాలెంజ్‌ను సాధించాలి : రాజశేఖర్



**చింతపల్లి, జూన్ 28(నినాదం న్యూస్):** ఆర్టీసీ ఉద్యోగులు లక్ష్యే లక్ష్యం చాలెంజ్ ను సాధించడానికి కృషి చేయాలని నల్గొండ రీజనల్ మేనేజర్ రాజశేఖర్ అన్నారు.దేవరకొండ బస్సు డిపో ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డిపోను,బస్ స్టేషన్ ను పరిశీలించిన అనంతరం డిపో ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం సంస్థ ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతూ ఉద్యోగులు కష్టపడి పనిచేసి "లక్షే లక్ష్యం" చాలెంజ్ ను చేరుకోవాలని అన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని, నిజాయితీతో విధులు నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. దేవరకొండ డిపోను రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలపాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా డిపో ఉత్తమ ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం మాధవి, ఇంచార్జి డీఎం బి.పాల్, అసిస్టెంట్ మేనేజర్ పి.సైదులు, ఎంఎఫ్ సునీత, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి కోసం అల్లాడుతున్న ఖానాపురం గ్రామస్తులు



**కోదాడ,జూన్ 28 (నినాదం న్యూస్):**
దేశానికి పల్లెలు పట్టుకొమ్మలు అంటారు. పల్లెల అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందినట్లే అనేది ప్రభుత్వాల సంకల్పం.... ఆ సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పల్లెను పచ్చదనం వైపు పరుగులు తీసేలా ,గ్రామాలలో ప్రజలు సమస్యలతో ఇబ్బందులు పడకుండా, గ్రామాల అభివృద్ధికై అనేక కోట్ల రూపాయల నిధులను కేటాయిస్తోంది. కానీ అధికారుల నిర్లక్ష్యం, పాలకుల నిస్సహాయతతో కనీసం కొన్ని గ్రామాల్లో తాగేందుకు మంచినీళ్లు లేకుండా అల్లాడి పోవాల్సిన పరిస్థితి. గ్రామాల అభివృద్ధి మాట అటు ఉంచండి కనీసం తాగేందుకు మంచినీళ్లు దొరకవు అంటూ ప్రశ్నిస్తున్నారు ..?మండల పరిధిలోని ఖానాపురం గ్రామానికి చెందిన 3 వ వార్డు ప్రజలు గత కొంతకాలంగా గ్రామపంచాయతీ నీరు రాక హరి గోస పడుతున్నామని గ్రామపంచాయతీ అధికారులకు పాలకులకు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు. నీటి దాహార్తి తీర్చుకోవడం , గృహ అవసరాల కై ఉన్న ఒక బోరింగ్ పంపును ఉపయోగిస్తున్నారు. గ్రామాలు అభివృద్ధి చేస్తున్నాం ...అనే పాలకులకి అధికారులకు ఇటువంటి సమస్యలు కనపడవా, వినపడవా అంటూ గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు... ఇప్పటికైనా గ్రామపంచాయతీ పాలకవర్గం అధికారులు స్పందించి నీటి సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో నిరసన వ్యక్తం చేస్తామని వారు హెచ్చరించారు. ఇదే విషయమై పంచాయతీ కార్యదర్శి అక్షయ తేజ మాట్లాడుతూ.. మూడో వార్డులో నీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఇప్పటికే అవార్డులో లీకేజీ ఎక్కడ ఉందో కనుక్కొని అక్కడ మరమ్మతులు చేపడుతున్నామని తెలిపారు.

## ఉత్తంకుమార్ రెడ్డి, పద్మావతి రెడ్డి పై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదు



**కోదాడ,జూన్ 28(నినాదం న్యూస్):** రాష్ట్రమంత్రి ఉత్తంకుమార్ రెడ్డి కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి పై కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని, తెలంగాణ ఉద్యమకారుడు కాంగ్రెస్ పార్టీ నాయకులు రాయపూడి వెంకటనారాయణ, జిల్లా రైతు సమన్వయ సమితి మాజీ సభ్యురాలు స్వరాజ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.... హుజూర్నగర్ కోదాడ నియోజకవర్గం లో ఇంకొక 10 సంవత్సరాలు ఉత్తంకుమార్ రెడ్డి ఆయన సతీమణి పద్మావతి రెడ్డి అధికారంలోనే ఉంటారని ఇక మల్లయ్య యాదవ్ కోదాడని విడిచి వెళ్లి వ్యాపారం చేసుకోవాలని హితవు పలికారు. ఎన్నికల ఇచ్చిన హామీ ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కచ్చితంగా ఆగస్టు లోపు రెండు లక్షల రుణమాఫీ చేస్తారని ఒకవేళ చేస్తే మల్లయ్య యాదవ్ తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ముక్కు నేలకు రాస్తారా అని సవాల్ విసిరారు. పార్టీలు మారే చరిత్ర ఎవరుకుందో కోదాడ ప్రజలకు తెలుసని, ఉద్యమకారులు అనేక కష్టనష్టాలు భరించి ఆర్థికంగా నష్టపోయి పార్టీని నిర్మిస్తే చీమలు పెట్టిన పొట్టలోకి పాములు వచ్చినట్టుగా మల్లయ్య యాదవ్ వచ్చి పార్టీని భ్రష్టు పట్టించాడని ఇకనైనా మల్లయ్య యాదవ్ తన పద్ధతిని మార్చుకోవాలని ఆయన హెచ్చరించారు. ఉత్తంకుమార్ రెడ్డి, పద్మావతి రెడ్డి సారథ్యంలో అవినీతి రహితమైన పాలన కొనసాగుతుందని వారు పేర్కొన్నారు.

## ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ వర్కింగ్ ప్రమోషన్ రోస్టర్ జాబితాను ప్రకటించాలి



**నిజామాబాద్ ప్రతినిధి, జూన్ 28 (నినాదం న్యూస్) :** ఉపాధ్యాయ ప్రమోషన్ కౌన్సిలింగ్లో భాగంగా జూన్ నెలలో జరిగిన ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ వర్కింగ్ , ప్రమోషన్ రోస్టర్ జాబితాను ఇవ్వాలని కోరుతూ ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నిజాంబాద్ జిల్లా శాఖ శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్ వి దుర్గాప్రసాద్ కు వినతి పత్రం సమర్పించారు. ఉపాధ్యాయ ప్రమోషన్ కౌన్సిలింగ్ 2024 ప్రకారం ఎస్సీ, ఎస్టీ, పి హెచ్ సి ఉపాధ్యాయులకు పాత వర్కింగ్ కొత్త రోస్టర్ ప్రకారం అడక్కేసి ఆధారంగా ప్రమోషన్లు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రస్తుతం పాత వర్కింగ్ కొత్త రోస్టర్ ప్రకారం ప్రమోషన్లు ఇచ్చిన జాబితాలు మేనేజ్మెంట్ క్యాటగిరి వారిగా అన్ని సబ్జెక్టులకు సంబంధించి జాబితా ఇవ్వవలసిందిగా డి ఈ ఓ ని కోరగా సానుకూలంగా స్పందించి రెండు మూడు రోజుల్లో జాబితా ఇస్తామని హామీ ఇచ్చారు. డీఈవోను కలిసిన వారి లో ఎస్సీ, ఎస్టీ, ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు రామచంద్ర గైక్వాడ్, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మోతే సాయన్న ఉన్నారు.

## మాథ్స్ ఒలంపియాడ్ విజేతలు



**కోదాడ టౌన్, జూన్ 28( నినాదం న్యూస్):**
వైజాగ్ కు చెందిన ఎడు హంట్ సంస్థ ప్రతిష్ఠత్మకంగా ఎప్రియల్ నెలలో నిర్వహించిన మాథ్స్ ఒలంపియాడ్ పోటీలలో తేజ విద్యాలయ విద్యార్థులు ప్రతిభ కనబరిచి 9 మంది పతకాలు సాధించారు. అస్మిక 10,భవజ్ఞ 8, మోక్షిత్ 7లు ప్రథమ స్థానం సాధించి బంగారు పతకాలు పొందారు. ఈ పాఠశాలకు చెందిన భాను తేజ్ , భాగ్య శ్రీ , రేఖ శ్రీ , రాం చరణ్ , రమ్య శ్రీ , రక్షిత్ లు రజత కాంస్య పతకాలు సాధించారు.విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్ రమాసోమిరెడ్డి మరియు అధ్యాపకులు అభినందించారు.

## ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలి

**-జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు ఐద్వా కమిటీ వినతి**



**నిజామాబాద్ ప్రతినిధి, జూన్ 28 (నినాదం న్యూస్) :**
జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో పేద ప్రజలకు, చిన్నపిల్లలకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని ఐద్వా జిల్లా కమిటీ తరఫున వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత మాట్లాడుతూ ప్రజలకు అందాల్సిన కనీస వైద్య సదుపాయాలు, మందులు, చిన్న పిల్లలకు సరైన వైద్యంతో పాటు సిరప్ లు అందించాలన్నారు. గర్భిణీ స్త్రీలకు సంబంధించి స్కానింగ్ సెంటర్లో కొందరికి తప్పుడు రిపోర్టులు వస్తున్నాయని ఆరోపించారు. గర్భిణీలకు రక్తస్రావం అవుతున్న సిబ్బంది నిర్లక్ష్యంతో నిరుపేదలు భయప్రాంతులకు గురై ప్రైవేట్ ఆసుపత్రిని ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న సిబ్బంది పేషెంట్స్ తో దురుసుగా ప్రవర్తించడం వల్ల వచ్చిన రోగులు నిరాశ చెందుతున్నారన్నారు. అలాగే హాస్పటల్లో మౌలిక సదుపాయాలు కూడా సరిగ్గా లేవని ఎక్కడపడితే అక్కడ విచ్చలవిడిగా చెత్త ఉండడం వల్ల ఆస్పత్రిలోకి రాగానే ఒక రకమైన వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వీటన్నింటిపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజలకు అనుకూల విధంగా వైద్యాన్ని అందించాలని ఐద్వా మహిళా సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేశారు. లేదంటే హాస్పటల్ పై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించే వరకు ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు అనిత , జిల్లా ఉపాధ్యక్షురాలు లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## దేశ ఆర్థిక సంస్కర్త మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు సేవలు మరువలేనివి



**నిజామాబాద్ ప్రతినిధి, జూన్ 28 (నినాదం న్యూస్) :**
భారత దేశ మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు చేసిన ఎన్నటికీ మరులేనివని కాంగ్రెస్ నాయకులు అన్నారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పీవీ నర్సింహారావు రాష్ట్ర దేశ ప్రధానిగా ప్రజలకు చేసిన సేవలు,సంస్కరణలు ఎన్నటికి మారువలేనివని, భూ సంస్కరణల ద్వారా అందరికీ భూమి అందాలని చూసిన కార్యక్రమం దేహంలోనే ఆదర్శంగా నిలిచిందని, దేశ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నంగా ఉన్న సమయంలో ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన పీవీ తీసుకువచ్చిన ఆర్థిక సంస్కరణల ద్వారా దేశం ప్రపంచంలో అభివృద్ధి చెందిందని ఆయన తెలిపారు. ప్రజలు బాగుండాలంటే పాలకులు ఈ విధంగా వుండాలో అని చూయించిన వ్యక్తి అని ఆయన అన్నారు. ఆయన ఆశయాలను, ఆలోచనలు యువత ముందుకు తీసుకువెళ్లాలని కోరుతూ పీవీ నర్సింహారావు కి ఘన నివాళులు అర్పించారు.రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్,నగర కాంగ్రెస్ అధ్యక్షులు కేశ వేణు , జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి , జిల్లా ఎన్ ఎస్ యూ ఐ అధ్యక్షులు వేణు రాజ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సంతోష్ పాల్గొన్నారు.

## రేపు కొండగట్టుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్



**జగిత్యాల,జూన్ 28(నినాదం న్యూస్):**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ నెల 29వ తేదీ శనివారం మల్యాల మండలంలోని ప్రసిద్ధ కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామినీ దర్శించుకొనున్నారు. ఈసందర్భగా డిప్యూటీ సీఎం హెూదాలో కొండగట్టు పర్యటన కు వస్తున్న పవన్ కళ్యాణ్ ప్రభుత్వం పర్యటన షెడ్యుల్ విడుదల చేశారు. కొండగట్టులో ఉన్నతఅధికారులు బందోబ్తును ఏర్పాటు చేసేందుకు కొండగట్టు పరిసర ప్రాంతాల్లో పరిశీలిస్తున్నారు.డిప్యూటీ సీఎం హెూదాలో కొండగట్టు కు వస్తున్న పవన్ కళ్యాణ్ సందర్భంగా జగిత్యాల జిల్లాలోని జన సేన నాయకులు, కార్యకర్తలు, కొణిదల కుటుంబ హీరోల అభిమానులు కాకుండా ఉమ్మడి నిజామాబాద్ కరీంనగర్ వరంగల్ ఆదిలాబాద్ జిల్లాల నుండి పెద్ద ఎత్తున తరలిరానున్నారు. ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు భారీ బందోబ్తును ఏర్పాటు చేసేందుకు అధికారులు రూట్ మ్యాప్ సిద్దం చేస్తున్నారు.

## శ్రామిక్ నియామకాల కోసం మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి



**జమ్మికుంట జూన్ 28 (నినాదం న్యూస్):**
టిజిఆర్టీసీలో వివిధ డిపోలలో డీజిల్ మెకానిక్ ట్రైనింగ్ అప్రెంటిస్ షిప్ చేసిన మెకానిక్ యూనియన్ సభ్యులు తాము గత 12 సంవత్సరాలుగా శ్రామిక్ నియామకాల కోసం ఎదురుచూస్తున్నామని గత ప్రభుత్వ నిర్లక్ష్యం వలన వయోపరిమితి ముగిసే సమయం వచ్చిందని వారి వయోపరిమితి సడలించి టీజీ ఆర్టీసీలో శ్రామిక్ నియామకాలను భర్తీ చేయుటలో తమకు అవకాశం కల్పించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసి వినతి పత్రం సమర్పించిన మెకానికులు. వారి వినతి పత్రాన్ని స్వీకరించిన మంత్రి సానుకూల గా స్పందించడం జరిగిందని టీజీ ఆర్టీసీ అప్రెంటిషిప్ యూనియన్ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు, ఈ కార్యక్రమంలో మేకల శ్రీనివాస్,భాష వేణి భాస్కర్ యాదవ్, బీమోజు వెంకటస్వామి,ప్రభాకర్,సంపత్,తదితరులు పాల్గొన్నారు....

## ఆల్ఫోర్స్ స్కూల్లో ఫుడ్ షేరింగ్ డే



**కరీంనగర్, జూన్ 28(నినాదం న్యూస్):**
విద్యార్థులకు ప్రాథమిక దశనుండే పౌష్టికకరమైన ఆహారం అందించాలని తద్వారా వారు ఉషారుగా ఉంటారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా వి. నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్లో ఫుడ్ షేరింగ్ డే ను పురస్కరించుకొని ఏర్పాటుచేసినటువంటి ప్రత్యేక ప్రారంభోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పౌష్టికకరమైన ఆహారాన్ని తీసుకోవడం వలన చాలా ధృడంగా ఉండడమే కాకుండా వివిధ పనులను ఉషారుగా చేపడుతామని చెప్పారు. చాలామంది ఆహారాన్ని చక్కగా తీసుకోకపోవడం వలన వివిధ సమస్యలు తలెత్తుతాయని కార్యకలాపాలు అసంపూర్తిగా ఉంటాయని చెప్పారు. విద్యార్థులకు రోజు చక్కటి ఆహారాన్ని అందజేయాలని తెలుపుతూ తద్వారా ధృడంగా ఉంటారని అభిప్రాయపడ్డారు. ప్రత్యేకమైన దినోత్సవాన ఆహారం యొక్క ప్రాముఖ్యతను స్నేహం యొక్క విశిష్టతను తెలియజేసిన వారు అవుతామని అభిప్రాయపడ్డారు. ఫుడ్ షేరింగ్ వివిధ దేశాలలో ప్రాచుర్యం పొందినదని మరియు చాలా మంది దీనిని అమలుపర్చి ప్రేమపూర్వకంగా ఉంటారని చెప్పారు. మన దేశంలో సైతం ఇటీవల కాలంలో ఈ అంశానికి ప్రత్యేకత సంచరించుకున్నదని చెప్పారు. ఫుడ్ షేరింగ్లో భాగంగా పాఠశాలలో విద్యార్థులు వివిధ రకాల ఆహార పదార్థాలను తీసుకవచ్చి వారి ఉపాధ్యాయులతో మరియు స్నేహితులతో పంచుకొని ఆనందాన్ని రెట్టింపు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఇతర విద్యార్థులతో స్నేహపూర్వకంగా పంచుకొని బంధుత్వాలను ఏర్పర్చుకుని వాటి విశిష్టతను తెలుసుకున్నారు. వేడుకలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి మై షేరింగ్ ఫుడ్ షేరింగ్ లౌవ్లీ షేరింగ్ టేక్ ఫుడ్ సేవ్ లైఫ్ నాటిక చాలా ఆలోచింపచేసింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## కొండగట్టులో వైభవంగా శత కలశాభిషేకం



**మల్యాల, జూన్ 29 ( నినాదం న్యూస్):**
ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి సన్నిధానంలో జేష్ఠ మాసాన్ని పురస్కరించుకొని శతకలి శాభిషేకం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు కపిందర్ స్వామి నేతత్వంలోని ఆలయ అర్చక బృందం , వేద పండితుల అధ్వర్యంలో జరిగిన ఈ శతకలిశాభిషేకం కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆలయ అర్చకులు శ్రీ స్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కలశాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి సంప్రోక్షణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి చంద్రశేఖర్, ఆలయ ఉపకార్యనిర్వహణ అధికారి ఆంజనేయులు, ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస శర్మ, చంద్రశేఖర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## అల్గునూర్, సదాశివాపల్లి గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే, అడిషనల్ కలెక్టర్



**కరీంనగర్, జూన్ 28(నినాదం న్యూస్):**
కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోనీ అల్గునూర్, సదాశివాపల్లి డివిజన్లలో మానకొండూర్ ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ , అడిషనల్ కలెక్టర్, ఇంచార్జి మున్సిపల్ కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు సదాశివాపల్లి జంక్షన్ ప్రమాదకరంగా మారి రోడ్డు ప్రమాదాలు బాగా జరుగతున్నందున త్వరగా రోడ్డు వెడల్పు చేసి జంక్షన్ నిర్మాణం చేపట్టాలని ఆర్అండ్ బీ, మున్సిపల్ అధికారులకు తెలిపారు. అనంతరం అల్గునూర్ డివిజన్ లో డ్రైనేజీ లేక వరద నీరు ఇండ్లలోకి వచ్చి చేరుతుండగా వెంటనే డ్రైనేజీ నిర్మించాలని మున్సిపల్ అధికారులను కోరారు.కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు అల్గునూర్, సదాశివాపల్లి డివిజన్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మీ అందరికీ అందుబాటులో ఉంటా

- సహకార రంగం నుండి వివిధ దేశాల్లో పర్యటించాం
- శ్రమ పడి రైతులకు నిజాయితీగా సేవ చేశాను
- రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**కరీంనగర్, జూన్ 28(నినాదం న్యూస్):**
ది.కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంత్రి ని సత్కరించిన సహకార సంఘం అధ్యక్షులు కొండూరు రవీందర్ రావు, సభ్యులు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,మొన్నటి వరకు తెలంగాణ రాష్ట్ర సహకార బ్యాంకుల అధ్యక్షుడు గా ,గతంలో నాతో సహకార రంగానికి జోడెద్దుల లాగ రవీందర్ రావు పని చేశారు.గతంలో సహకార రంగంలో మార్క్ ఫెడ్ చైర్మన్ గా జగతిరావు ఉండేవారు.నేను సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ కావాలని ఉండే.. కానీ 15 రోజుల్లోనే మార్క్ ఫెడ్ చైర్మన్ అయ్యాను .తరువాత నాఅదురష్టం మంచిగా ఉండి కరీంనగర్ ఎంపీ అయ్యాను.తరువాత హుస్నాబాద్ పోయి ఎమ్మెల్యే అయ్యాను.మా పార్టీ అధికారంలోకి వచ్చి మంత్రి అయ్యాను.నా రాజకీయ జీవితం కరీంనగర్ సిటీ నుండి సహకార రంగంలో ప్రారంభం అయింది.నేను శ్రమ పడి రైతులకు నిజాయితీగా సేవ చేశాను. నా చిన్న తనం లో మా నాన్న రైతు పంట ఉత్పత్తి చేసి అమ్ముకోవడానికి ఇబ్బంది పడేది.వైఎస్ఆర్ మార్క్ ఫెడ్ చైర్మన్ గా అడగగానే వెయ్యి కోట్లు ఇచ్చారు .మార్క్ ఫెడ్ గా అప్పు తీసుకోవడానికి జీవో ఇచ్చారు.సహకార రంగాల ద్వారా వరి, మొక్క జొన్న కొనాలని జీవో లు తెచ్చాం. ప్రోటోకాల్ ప్రకారం మండల మీటింగ్, జిల్లా మీటింగ్ లకు పిలవాలని ఫొటోకాల్ తెచ్చాం.ఎవరు మార్క్ ఫెడ్ కి వచ్చిన గౌరవంగా ఉండేలా సహకార రంగాన్ని తీర్చిద్దిద్దం.క్రిబ్కో డైరెక్టర్ గా అన్ని రాష్ట్రాలు తిరిగిన అడ్వాన్స్ పైసలు ఇచ్చిన సంస్థ మీదే అన్నారు. సహకార రంగం నుండి వివిధ దేశాల్లో పర్యటించాం.సహకార రంగంలో నలుగురు సహాయం చేసేలా రవీందర్ రావు ,నేను పని చేశాం .మీకు ఏ సమస్యలు ఉన్న నా దృష్టికి తీసుకురండి.నేను మీకు అందుబాటులో ఉంటానని చెప్పారు.రాజకీయాలు వేరు సహకార సంఘాలు వేరు.అని క్రిబ్కో లో అన్ని పార్టీల వారు ఉంటారు .అది రాజకీయాలకు సంబంధం లేకుండా రైతుల సంక్షేమం కోసం పని చేస్తుంది.రైతు సేవకులుగా ఉండే విధంగా మన జీవితం దన్యమవుతుంది.సహకార రంగం నుండి వచ్చి మంత్రి అయ్యా మీ అందరికీ అందుబాటులో ఉంటా.నాబార్డు అధికారులను కోరుతున్న కేంద్రం నుండి రాష్ట్ర సహకారంతో పాడి పంటలు,రైతులు అభివృద్ధికి కృషి చేయండి,సహకారం అంటే రైతులకే కాదు చేనేత కార్మికులకు కూడా సహాయం చేశాం.ఇప్పుడు కూడా సిరిసిల్ల చేనేత కార్మికులకు అండగా ఉంటాం అన్నారు. ఈ కార్యక్రమం లో బ్యాంక్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, వైస్ చైర్మన్ పింగిలి రమేష్, మాజీ ఏంఎల్ఎ మోహన్ రెడ్డి, పిఆర్ఓ రవీందర్ రావు, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కోరపల్లిలో అఖిల భారత యాదవ మహాసభ కార్యాలయం ప్రారంభం



**జమ్మికుంట, జూన్ 27 (నినాదం న్యూస్):**
అఖిలభారత యాదవ మహాసభ కోరపల్లి గ్రామ నూతన కార్యాలయ భవనాన్ని శుక్రవారం గ్రామ శాఖ అధ్యక్షులు బక్కతట్ల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయగా ముఖ్య అతిథులుగా వచ్చిన వారు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా కరీంనగర్ జిల్లా అధ్యక్షులు నాగారపు సత్యనారాయణ యాదవ్ మండల అధ్యక్షులు గిరవెన శ్రీనివాస్ యాదవ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బాషబోయిన మల్లేష్ యాదవ్, గీతాంజలి యాదవ్ లు జిల్లా ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన రవియాదవ్ హాజరయ్యారు ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ యాదవ్ మాట్లాడుతూ కోరపల్లి గ్రామంలో యాదవుల జనాభా అత్యధికంగా ఉండి సంఘ భవనం లేకపోవడం చాలా బాధాకరం ఇప్పటివరకు మంజూరు అయిన నిర్మాణం కాక ఆగిపోయినటువంటి అనుమతుల విషయంలో జిల్లా కమిటీ తరపున ప్రత్యేక శ్రద్ధచూపి యాదవ సంఘం సొంత భవనం నిర్మాణం చేస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో యాదవ సంఘం గ్రామ ప్రధాన కార్యదర్శి నరేష్ యాదవ్ ఉపాధ్యక్షులు శంకర్ యాదవ్ కోశాధికారి శ్రీనివాస్ యాదవ్ కార్యదర్శులు కమిటీ సభ్యులు సంఘ సభ్యులు అధిక సంఖ్యలో యాదవులు పాల్గొన్నారు

## నరసింహ స్వామి భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

### -ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న కలెక్టర్



**జగిత్యాల, జూన్ 28 (నినాదం న్యూస్):**
జిల్లాలోని ప్రసిద్ధ ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం ను శుక్రవారంనాడు జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ దర్శనం కు వచ్చిన సందర్భంగా దేవస్థానం సాంప్రదాయం ప్రకారం మేళతాళాలతో పూర్ణకుంభంతో స్వాగతించారు. అనంతరం దేవస్థానం దర్శనం అనంతరం అర్చకులు ఆశీర్వచనం ఇచ్చిన తరువాత దేవస్థానం కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్ శేషవస్త్రం ప్రసాదం చిత్రపటం అందించి ఆశీర్వదించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అన్నదానం సత్రాన్ని పరిశీలించి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా వారికి త్రాగునీరు సదుపాయానికి ఇబ్బంది కలుగకుండా శుభ్రమైన త్రాగునీరు వసతి కల్పించాలని సూచించారు. అనంతరం గోదావరి పరిసరాలను పరిశీలిం చారు. వానాకాలం దృష్టిలో ఉంచుకుని దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల, ఆర్డీఓ మధుసూదన్, ధర్మపురి మున్సిపల్ కమిషనర్, దేవస్థానం కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్ వేదపండితులు, సీనియర్ అసిస్టెంట్ పురోహితులు ,స్థానిక తహశీల్దార్, అర్చకులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా పివి జయంతి వేడుకలు



**జమ్మికుంట, జూన్ 28 (నినాదం న్యూస్):**
హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారత తొలి తెలుగు ప్రధానమంత్రి పి వీ నరసింహ రావు జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ ఒడితల ప్రణవ్ ఆదేశాల మేరకు బహుముఖ ప్రజ్ఞాశాలి బహుభాషా కోవిదుడు హుజురాబాద్ ప్రాంత ముద్దుబిడ్డ భారత మాజీ ప్రధాని పివి నరసింహారావు జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారత ప్రధానిగా తొలి తెలుగు వ్యక్తి పీవీ నరసింహారావు దేశానికి ఎనలేని సేవలు చేశారని భారత దేశ ప్రధానిగా ఎన్నో ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చారని ఈ సందర్భంగా వారు అన్నారు. పీవీ నరసింహా రావు తన విద్యాభ్యాసం హుజురాబాద్ లో జరిగిందని ఈ ప్రాంత వాసులకు పివి నరసింహారావు కు ఎనలేని బంధం ఉందని వారు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ మండల పట్టణ కాంగ్రెస్ నాయకులు కొల్లూరి సోమ కిరణ్ కుమార్, యండి అఫ్సర్,కొలిపాక శంకర్, నేరేళ్ళ మహేందర్ గౌడ్,మున్సిపల్ మాజీ చైర్మన్ వడ్లూరి విజయ్ కుమార్, ఖాజీపేట శ్రీనివాస్, సందమల్ల బాబు,లంకదాసరి లావణ్య, యేముల పుష్పలత, ఆలేటి సుశీల,మిడిదొడ్డి రాజు, హుజురాబాద్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రెసిడెంట్ చల్లూరి రాహుల్, దుబాసి బాబు, గంట కిరణ్ రెడ్డి, కుర్ర శ్రీనివాస్,మండ సాయి, చంద్రశేఖర్, ఉప్పు శ్రీనివాస్,యండి ఇమ్రాన్, నర్సింగ్, యండి రియాజ్,కడారి తిరుమల,యండి కరీమా, గొస్కుల రిబ్కా, గడ్డం రాఘవేంద్ర తోపాటు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ భక్తాంజనేయ స్వామి వార్షికోత్సవ వేడుకలు



**జమ్మికుంట, జూన్ 28 (నినాదం న్యూస్) :**
జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్త పల్లిలో శుక్రవారం రోజున శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయ 32వ వార్షికోత్సవ పూజా మహెూత్సవం ఘనంగా నిర్వహించారు .ప్రముఖ వేద పండితుల గూడా జగదీశ్వర శర్మ (జగ్గయ్య ) ఆధ్వర్యంలో ఆలయంలో ప్రాతఃకాలం నుండి పూజాది కార్యక్రమాలు నిత్యా ఆరాధన, గణపతి పూజ స్థాపితమంట పారాధన, అంకురార్పణ, గణపతి హెూమం నవగ్రహ హెూమం హనుమత్ మూల మంత్ర హెూమం, శతఘటాభిషేకం, సహస్ర నాగవల్లి దళార్చన, పంచామృతాభిషేకం, మహా కుంభా భిషేకం తదితర పూజాది కార్యక్రమాలను ఆలయ అర్చకులు శేషం వరప్రసాద్ వేద పండితులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కరీంనగర్ జిల్లా పరిషత్ చైర్పర్సన్ కనుమల్ల విజయ గణపతి, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కల్లపల్లి రాజేశ్వరరావు హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ కౌన్సిలర్లు బొద్దుల అరుణ, జూగురు సదానంద ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు బొద్దుల రవీందర్ ఉపాధ్యక్షులు సిరిమల జయేందర్ ,ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి రామ్మూర్తి, కూరపాటి సాయికృష్ణ గట్టు రాజ్ కుమార్ పూసాల సతీష్, చిరంజీవి, తిరుపతి మల్లయ్య వందలాది మంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

## సిపిఆర్ ద్వారా నిండు ప్రాణం కాపాడిన డాక్టర్ ఆకుల శ్రీనివాస్



**జమ్మికుంట, జూన్ 28 (నినాదం న్యూస్):**
జమ్మికుంట పట్టణంలోని ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ లో ఒక రోగికి సిపిఆర్ చేసి నిండు ప్రాణాలను కాపాడి తన వృత్తి ధర్మానికి న్యాయం చేసిన డాక్టర్ ఆకుల శ్రీనివాస్. ఈ సందర్భంగా ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ ఏ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ, భూపాలపల్లి జిల్లా పర్లపెల్లి గ్రామానికి చెందిన దాదాపు 65 సంవత్సరాల వయసు గల వృద్ధురాలు అనారోగ్య సమస్యల కారణంగా శుక్రవారం జమ్మికుంట ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ కి రావడం జరిగిందని ఆమె వచ్చిన 15 నిమిషాల సమయంలోనే ఆమెకి హార్ట్ స్ట్రోక్ రావడం జరిగిందని అది గమనించిన వారి కుటుంబ సభ్యులు వెంటనే హాస్పిటల్ సిబ్బందికి తెలపడంతో వారు వెంటనే స్పదించి డాక్టర్ ఆకుల శ్రీనివాస్ కి తెలియజేయడం జరిగిందని ఆయన తెలిపారు. డాక్టర్ ఆకుల శ్రీనివాస్ ఎం.డి. జనరల్ ఫిజీషియన్ ఆ వృద్ధురాలికి సి పి ఆర్ చేయడం జరిగిందని సి పి ఆర్ చేసిన వెంటనే ఆమె మళ్ళీ తిరిగి స్పృహలోకి వచ్చిందని ఆయన తెలిపారు. రోజు ప్రాణాలను కాపాడడం లో నిర్లక్ష్యం వహించకుండా వెంటనే స్పందించి ఆమె ప్రాణాలను కాపాడిన పేషెంట్ బంధువులు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ కి హాస్పటల్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

## దేశ ఆర్థిక అభివృద్ధికి పునాది వేసిన పీవీ నరసింహారావు

### -డా.కవ్వంపల్లి సత్యనారాయణ, మానకొండూరు ఎమ్మెల్యే



**కరీంనగర్, జూన్ 28(నినాదం న్యూస్):**
మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహారావు జయంతి కార్యక్రమాన్ని నేడు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి మానకొండూరు ఎమ్మెల్యే కరీంనగర్ డిసిసి అధ్యక్షులు డాక్టర్. కవ్వంపల్లి సత్యనారాయణ , కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పురుమల్ల శ్రీనివాస్ హాజరై పలువురు నాయకులతో కలిసి పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ,దేశాన్ని ఆర్థికంగా అభివృద్ధి పరిచిన ఆర్థిక పితామహుడు పీవీ నరసింహారావు, బహుభాషా కోవిదుడు అయిన పీవీ గారు ఈ దేశాన్ని ఆధునికంగా ఆర్థికంగా బలోపేతం చేయడానికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టిన దేశం గర్వించదగ్గ గొప్ప వ్యక్తి గారైన వారు కరీంనగర్ బిడ్డ కావడం మనకు ఎంతో గర్వకారణం. వారు చేసిన సేవలను నేడు కాంగ్రెస్ పార్టీ మాత్రమే కాకుండా దేశమంతా కీర్తిస్తున్నారు. అలాంటి మహానేత జయంతి వేడుకలు నేడు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వైద్యుల అంజన్ కుమార్, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, శ్రావణ్ నాయక్, పులి ఆంజనేయులు గౌడ్, కొర్వి అరుణ్ కుమార్, వెన్న రాజ మల్లయ్య, బొబ్బిలి విక్టర్, ముస్తాక్ హైమద్, పడి శెట్టి భూమయ్య, వంగల విద్యాసాగర్ పాల్గొన్నారు.

## నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా పివి జయంతి వేడుకలు

### -కాంగ్రెస్ అధ్యక్షులు కోమిటి రెడ్డి నరేందర్ రెడ్డి



**కరీంనగర్, జూన్ 28(నినాదం న్యూస్ ):**
మాజీ ప్రధాని పివి నరసింహారావు జయంతి వేడుకలు నగర కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పివి నరసింహారావు చిత్ర పటానికి సు డా చైర్మన్ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, దేశం ఆర్థికంగా క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో ప్రధాన మంత్రి పదవి చేపట్టి ఎన్నో సంస్కరణలు చేపట్టి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన గొప్ప మేధావి పివి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కొరివి అరుణ్ కుమార్ , శ్రవణ్ నాయక్,గుండేటి శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్, పెద్ది గారి తిరుపతి, పోరాండ్ల రమేష్ , మేకల నర్సయ్య, విద్యాసాగర్ , గంగుల దిలీప్ , నెల్లి నరేష్, దీకొండ శేఖర్, షేక్ షహెన్షామహమ్మద్ చాంద , మహమ్మద్ అబ్దుల్ భారీ , గాలి అనిల్, రాజ్ కుమార్, అస్తపురం రమేష్, మదాసుశ్రీనివాస్, సతీష్ కుమార్,షబానామహమ్మద్ ,రజిత రెడ్డి, అస్తపురం తిరుమల, హసీనా, శిల్ప, నీనాల పద్మ,, సత్యనారాయణ రెడ్డి, భరత్, కీర్తి కుమార్, అహ్మద్, తదితరులు పాల్గొనడం జరిగింది.

## ప్రమోషన్లు పొందిన ఉపాధ్యాయులకు అభినందనలు

### -కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జ్ వెలిచాల



**కరీంనగర్, జూన్ 28(నినాదం న్యూస్):**
పదోన్నతి కోసం 10 ఏళ్ల పాటు ఎదురు చూసి విసిగిపోయిన ఉపాధ్యాయులకు ప్రమోషన్లు రావడం పట్ల కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జ్ వెలిచాల రాజేందర్ రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అన్ని వర్గాల వారికి న్యాయం జరుగుతుందని చెప్పడానికి ఈ పదోన్నతులే నిదర్శనం అన్నారు. గత పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం మాటలతో కోటలు కట్టింది తప్ప ఏ ఒక్కరికి న్యాయం చేయలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అనతికాలలోనే ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి ప్రభుత్వ రంగ విద్యపై ఉన్న మమకారాన్ని చూపిందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరినీ ప్రభుత్వ పాఠశాలలో చదివించాలనే సదుద్దేశంతో నడుస్తున్న బడిబాట కార్యక్రమం విజయవంతంగా ముందుకు సాగుతున్న తరుణంలో ఉపాధ్యాయులకు ప్రమోషన్లు కల్పించడం హర్షణీయమని పేర్కొన్నారు.

# పలు భావాల సమాహారం...




# ఫొటోగ్రఫీ

## జాతీయ కెమెరా దినోత్సవం సందర్భంగా

నాగరికంగా మనిషి ఎదగటం మొదలైన దశలో మానవుడికి తాను చూస్తున్న వాటిని వారసత్వ సంపదగా అందించాలనే కోరిక ఉండేది. కోరిక నుండి ఉద్భవించిన మహాద్భుతమే ఫొటోగ్రఫీ. ఎక్కడో రాతి గుహల గోడల మీద సూర్యకాంతి పడిన చోట నల్లగా మారటం గమనించి, కొన్ని రసాయ నాలు వెలుతురు పడిన మేర నల్లటి ఆకృతిని ఏర్పరుస్తాయన్న విషయం అర్థంచేసుకుని క్రమంగా ఫొటోగ్రఫీ ఆవిర్భావానికి బీజం వేసాడు మానవుడు. ఎన్నో భావాలను ఒక్క చిత్రంతో తెలిపే గొప్పదనం ఒక్క ఫొటోగ్రఫీకి ఉంది. ఈ ఆధునిక కాలంలో మానవ జీవితంతో ఫొటోగ్రఫీకి విడదీయలేని బంధం ఉంది. ఫొటోగ్రఫీకి శతాబ్దాల చరిత్ర ఉంది. రసాయనాలతో రూపొందించిన ప్లేటుపై కాంతిచర్యతో ఓ రూపాన్ని బంధించడాన్ని ఫొటోగ్రఫీ అంటారు. రెండు గ్రీకు పదాల కలయికే ఫొటోగ్రఫీ. "ఫోటో అంటే చిత్రం", "గ్రఫీ అంటే గీయడం" అని అర్థం. ఫొటోగ్రఫీ అంటే కాంతితో చిత్రాన్ని గీయడం. 18వ శతాబ్దంలో పారిస్‌లో నలుకు తెలుపులతో ప్రారంభమైన ఫొటోగ్రఫీ కాల క్రమంలో రంగులు అద్దుకుంటూ కొత్త పుంతలు తొక్కుతోంది. ఫ్రాన్స్‌కు చెందిన లూయిస్ జే.ఎం.డాగ్యూరే 1837లో ఫొటోగ్రఫీ ప్రాసెస్‌ను కనుగొన్నారు. 1839 జనవరి 9న ఫ్రెంచ్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ డాగ్యురే టైప్ ప్రాసెస్‌ను అధికారికంగా ప్రకటించింది. పూర్తి రూపం ఇచ్చి ఫొటోగ్రఫీ అనే ప్రక్రియను ప్రపంచానికి తెలియజెప్పేందుకు ఆ తర్వాత మరో 280 సంవత్సరాలు పట్టింది. ఈ మధ్యలో ఎందరెందరో పరి శోధకులు ప్రయోగాత్మకం గా దృశ్యాన్ని లోహం మీద బంధించేందుకు ప్రయత్నా లు చేశారు. కానీ చివరికి ఆ ఖ్యాతి దక్కింది ఎల్.జె. ఎల్.కు, 1837 ఫ్రెంచి ప్రభుత్వం ఆకాడమీ ఆఫ్ సైన్సెస్ వారి ముందు డాగురే తాను కనుగొన్న ఒక కొత్త పరి కరాన్ని ప్రదర్శించాడు. బయటవున్న చిత్రాన్ని ఒక నల్లటి ఫలకంపై ముద్రించి, ఆ పైన దానిని ప్రాసెస్' చేసి ఆ చిత్రాన్ని శాశ్వతంగా ప్రదర్శించ గలిగి నదే ఆ ప్రక్రియ. అది జరిగింది జనవరి 9, 1839. ఆ అద్భుత మైన ఆవిష్కారానికి హక్కులు పరిశోధకుడికి ఇచ్చారు. అయితే ఇది ఒక వ్యక్తి హక్కు కాకూడదని భావించిన ఫ్రాన్స్ ప్రభుత్వం, ఆ పాటోగ్రఫీ పేటెంట్ తాను కొనుగోలు చేసి, ప్రపంచానికి ఉచిత బహు మతిగా ప్రకటించిన తేదీ ఆగష్టు 19, 1839. అలా ప్రపంచమంతా పోటోలు తీసుకునే హక్కును పొందిన ఆ తేదీని ప్రపంచ పాటోగ్రఫీ దినోత్సవంగా జరుపు కుంటారు. డిజిటల్ కెమెరా, చిత్రాలు మరియు వాటి ఆవిష్కరణ జ్ఞాపకార్థం జూన్ 29 న జాతీయ కెమెరా దినోత్సవం జరుపుకుంటారు. డిజిటల్ కెమెరా అనే పదం లాటిన్ పదబంధం "డిజిటల్ కెమెరా అబ్స్క్యూ రా" నుండి ఉద్భవించింది, ఇది "చీకటి గది" అని సూచిస్తుంది. ప్రపంచంలోని మొట్టమొదటి ఛాయా చిత్రాన్ని 1826 లో ఫ్రెంచ్ శాస్త్రవేత్త జోసెఫ్ నికోఫోర్ నిప్సే డిజిటల్ కెమెరా అబ్స్క్యూరాతో తీశారు. ప్రాథ మిక 35 ఎంఎం ఎస్ ఎల్ఆర్ డిజిటల్ కెమెరాను ఇహాగీ – కైన్ ఎక్సాక్తా 1 ప్రారంభించింది. ప్రాథమిక రంగు ఛాయాచిత్రం 1861 ను స్కాటిష్ భౌతిక శాస్త్రవేత్త జేమ్స్ క్లర్క్ మాక్స్వెల్ ప్రారంభించారు. ప్రపంచంలోని మొట్ట మొదటి రంగు ఛాయాచిత్రం గులాబీ, నీలం మరియు పసుపు వడపోతల ద్వారా 3 సార్లు ఫోటో తీయడం ద్వారా ఉత్పత్తి చేయబడిన టార్టాన్ రిబ్బన్, ఇది ఒక రంగు మిశ్రమంగా తిరిగి కలపబడింది. 1878 లో, ఇంగ్లీష్ ఫోటోగ్రాఫర్ ఈడ్వర్డ్ ముయిబ్రిడ్జ్ చలనంలో మొదటి ఛాయాచిత్రాన్ని రూపొందించారు, తరువాత ఇది మొదటి కదలిక ఫోటోలకు దారితీసింది.నీటి అడుగున ఫోటోగ్రాఫ్‌ను గల్ఫ్ ఆఫ్ మెక్సికోలోని ఫ్లోరిడా కీస్‌ను డాక్టర్ విలియం లాంగ్లీ మరియు నేషనల్ జియోగ్రాఫిక్ వర్కర్స్ ఫోటోగ్రాఫర్ చార్లెస్ మార్టిన్ 1926 లో తీశారు. నాసా యొక్క అపోలో 11 మూన్ మిషన్లలోని ఛాయాచి త్రాలను స్వాధీనం చేసుకోవడానికి ఉపయోగించిన మూవీని కొడాక్ తయారు చేసింది. ప్రస్తుతం, అతిపెద్ద డిజిటల్ కెమెరా కలగలుపు ముంబైకి చెందిన ఫోటో జర్నలిస్ట్ దిలీష్ పరేఖ్ సొంతం. అతను 4,425 పాతకాలపు కెమెరాలను కలిగి ఉన్నాడు. మనదేశంలో 1857 వరకు ఫోటోగ్రఫీ అందుబాటులోకి రాలేదు. కేవలం బ్రిటిష్ రాజు, జమీందారులు, సిపాయిలు మాత్రమే దీనిని ఉపయోగించే వారు. 1977 నుంచి ఫోటోగ్రఫీ సామాన్యులకు అందుబాటులోకి వచ్చింది. భారత్‌లో మొట్ట మొదటి సారిగా లాలా దీనదయాళ్ ఫొటోగ్రఫీకి శ్రీకారం చుట్టారు. సమయం, సందర్భం ఏదైనా, నేడు ఫోటో లేని జీవితం ఊహించుకోలేం. ఎన్నో భావాలను ఒక్క చిత్రంతో తెలిపే గొప్పదనం ఒక్క ఫొటోగ్రఫీకి ఉంది. ఈ ఆధునిక కాలంలో మానవ జీవితంతో ఫొటోగ్రఫీకి విడదీయలేని బంధం ఉంది. అప్పుడే పుట్టిన పసిబిడ్డ నుండి, అంతిమ యాత్ర వరకు ప్రతి దశ కెమెరాతో బంధించాల్సిందే. ఇప్పుడు ప్రతి సెల్ ఫోన్ ఒక కెమెరా. సెల్ ఫోన్ వున్న ప్రతి ఒక్కరూ ఫొటోగ్రాఫిలో నైపుణ్యం పొందుతున్నారు. ఫోటోగ్రాఫర్ తీసే ఫోటో చూస్తే కలిగే ఆనందం వేరు. నలుపు తెలుపు అయినా, సప్త వర్ణాలతో తీసింది అయినా మనసును తట్టి తీరుతుంది. ఎందరెందరో కెమెరాతో ట్రిక్కులు చేస్తున్నారు. తమ సృజనను ప్రదర్శిస్తున్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

## రంగుల నాలుక.. రోగాల సూచిక!

మనం జబ్బుపడినప్పుడు డాక్టర్‌ను సంప్రదిస్తాం. మనం వెళ్లి వెళ్లగానే ఆయన మనల్ని నోరు తెరవమంటాడు. నాలుకను పరిశీలిస్తాడు. మరి ఎప్పుడైనా మన నాలుక మన ఆరోగ్య వివరాలను వెల్లడిస్తుందనే విషయం గురించి ఆలోచించారా? అందువల్ల, నాలుక రంగులో మార్పులను గమనిస్తూ ఉండాలి. అవి వివిధ వ్యాధులకు సూచికలు కావొచ్చు. నాలుక మీద ఉండే రంగు మన శరీర ఆరోగ్యం గురించి కీలకమైన రహస్యాలను తెలియజేస్తుంది. అంతేకాదు కొన్ని ప్రత్యేకమైన వ్యాధులకు ఆయా రంగులు సంకేతాలుగా నిలుస్తాయి. ఆరోగ్యకరమైన నాలుక గులాబీ రంగులో, పల్చటి తెల్లరంగు పొరతో ఉంటుంది. ఈ రెండిటిలో ఎలాంటి తేడాలు వచ్చినా మనకు ఏవో ఆరోగ్య సమస్యలు ఉన్నట్టుగానే భావించాలి. నలుపురంగు: కొన్ని సందర్భాల్లో నాలుక నలుపు రంగులోకి మారిపోతుంది. ఇది క్యాన్సర్ లాంటి ప్రమాదకరమైన వ్యాధులకు సంకేతం కావొచ్చు. ఇంకా ఫంగస్, అల్సర్ లాంటి రుగ్మతల లక్షణం కూడా అయ్యుండొచ్చు. తెలుపు రంగు: నాలుక తెలుపు రంగులో కనిపిస్తున్నదంటే శరీరంలో డీహైడ్రేషన్ పెరిగే అవకాశాలు ఉన్నట్టు. ఇది మాత్రమే కాకుండా ల్యూకోప్లేకియా (నోట్లో తెల్లటి మచ్చలు ఉంటాయి. నోటి క్యాన్సర్ ముప్పు పొంచి ఉంటుంది) లాంటి తీవ్రమైన వ్యాధులకు సంకేతం కూడా కావొచ్చు. పసుపు రంగు: నాలుక పసుపు రంగులో ఉందంటే మనం ఆహారం అరుగుదల మెరుగుపడటం మీద దృష్టి సారించాలని అర్థం. అంతేకాకుండా నాలుక మీద బ్యాక్టీరియా పేరుకుపోయినా కూడా పచ్చగా మారిపోతుంది. ఒక్కోసారి పసుపు రంగు నాలుక కాలేయ ఆరోగ్య సమస్యలకు సంబంధించిన సంకేతం కూడా అయ్యుండొచ్చు. ఎరుపు రంగు: విటమిన్ బి, ఐరన్ లోపం ఉంటే నాలుక ఎరుపు రంగులోకి మారుతుంది. ఇంకా ఫ్లూ, జ్వరం, ఇతర ఇన్ఫెక్షన్ల లక్షణం కూడా కావొచ్చు. మీ నాలుక ఎరుపు రంగులోకి మారిన విషయం గుర్తిస్తే, వెంటనే వైద్యుణ్ని సంప్రదించాలి. నాలుక రంగును బట్టి.. మనకేదో జబ్బు వచ్చిందని గాబరా పడిపోవద్దు. రంగులో గుర్తించదగ్గ మార్పు కనిపిస్తే మాత్రం.. వెంటనే వైద్యుణ్ని సంప్రదిస్తే మంచిది.



## అవని

## ఇవి తెలిస్తే మీరు బ్రౌన్ షుగర్‌ను వాడకుండా అస్సలు ఉండలేరు..!

బీపీ, షుగర్ లాంటి దీర్ఘకాలిక అనారోగ్యాలు సర్వసాధారణమయ్యాయి. దీర్ఘ కాలిక రోగాల బారినపడకుండా ఉండాలన్నా.. ఇప్పటికే అలాంటి అరోగ్య సమస్యలు ఉన్నవాళ్లు వ్యాధిని అదుపులో పెట్టుకోవాలన్నా బ్రౌన్ రైస్, బ్రౌన్ బ్రెడ్ లాంటివి ఎక్కువగా తీసుకోవాలని వైద్యులు సూచిస్తుంటారు. వైద్యులు చెప్పినట్లే రోగులు కూడా అవసరమైన జాగ్రత్తలు పాటిస్తుంటారు. తాజాగా వైద్యులు బ్రౌన్ షుగర్ కూడా ఆరోగ్యానికి మంచిదని రిఫర్ చేస్తున్నారు. బ్రౌన్ షుగర్‌తో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని చెబుతున్నారు. మరి అవేంటో చూద్దాం..



**ప్రయోజనాలు...**

1. బ్రౌన్ షుగర్‌ను చెరుకు నుంచి కాకుండా నేరుగా బెల్లం నుంచి సేకరి స్తారు. అందుకే ఇది ఆరోగ్యానికి చాలా మంచిది. వైట్ షుగర్ కంటే బ్రౌన్ షుగర్?లో పోషకాలు ఎక్కువగా ఉంటాయి. పొటాషియం, జింక్, రాగి, భాస్వరం, విటమిన్ బి–6 వంటి పోషకాలు ఉంటాయి. ఈ పోషకాలు ఆరోగ్యానికి చాలా మంచివి. కానీ, వైట్ షుగర్ తీసుకోవడంవల్ల కేలరీలు పెరుగుతాయి. దానివల్ల బరువు కూడా పెరిగే ప్రమాదం ఉంది.
2. బ్రౌన్ షుగర్‌తో జీర్ణ సంబంధ సమస్యలు తొలగిపోతాయి. దాంతో మలబద్ధకం సమస్య కూడా తీరిపోతుంది. అందుకోసం రోజూ ఉదయాన్నే ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో అల్లం ముక్క, ఒక టీస్పూన్ బ్రౌన్ షుగర్ కలిపి తీసుకోవాలి.
3. అదేవిధంగా శరీరంలో తిమ్మిర్లను తగ్గించడానికి కూడా బ్రౌన్ షుగర్ సహాయపడుతుంది. ఇందులో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. కాబట్టి కాళ్లు, చేతుల్లో తిమ్మిరితోపాటు నొప్పిని కూడా తగ్గిస్తుంది.
4. బ్రౌన్ షుగర్‌లో కేలరీలు కూడా తక్కువగా ఉంటాయి. కాబట్టి బరువు తగ్గడానికి ఇది తోడ్పడుతుంది. అలాగే జీవక్రియలను మెరుగుపరుస్తుంది. బ్రౌన్ షుగర్‌లో విటమిన్ బి6, నియాసిన్, పాంతోటెనిక్ ఆమ్లం, ఇతర ఖనిజాలు కూడా విరివిగా ఉంటాయి. ఇవి చర్మం కోసం యాంటీ ఏజింగ్ కాంపోనెంట్‌గా పనిచేస్తాయి. చర్మంపై మృత కణాలను తొలగించే స్క్రబ్‌గా పనిచేస్తాయి.
5. బ్రౌన్ షుగర్ యాంటీ అలర్జీ లక్షణాలను కూడా కలిగి ఉంటుంది. అందుకే ఇది ఉబ్బసం రోగులకు చేసే చికిత్సలో సాయపడుతుంది. అదేవిధంగా బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి సహాయపడే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలను కూడా బ్రౌన్ షుగర్ కలిగి ఉంటుంది.

## నినాదం మార్కెట్

### జూలైలో బ్యాంకులకు 12 రోజులు సెలవులు.




గతంతో పోలిస్తే ప్రస్తుతం ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతా నిర్వహిస్తున్నారు. ఇప్పుడు అన్ని లావాదేవీలు డిజిటల్ మయమైనా కొన్ని సందర్భాల్లో బ్యాంకు శాఖకు వెళ్లాల్సి రావచ్చు. ప్రస్తుత పరుగుల జీవితంలో ప్రతి క్షణం కీలకమే. బ్యాంకు శాఖకు వెళ్లాల్సి వచ్చినప్పుడు ఏయే రోజుల్లో బ్యాంకులు పని చేస్తాయి.. ఏయే రోజుల్లో బ్యాంకులకు సెలవులు ఉంటాయన్న సంగతి తెలుసుకోవాలి. ఇక ప్రస్తుతం మరో రెండు రోజుల్లో 2024 జూన్ నెల చరిత్ర కాలగర్భంలో కలిసిపోనున్నది. సోమవారం నుంచి జూలై నెల ప్రారంభం అవుతుంది. ఈ నేపథ్యంలో జాతీయ, ప్రాంతీయ సెలవు దినాలతో కలిపి జూలైలో 12 రోజులు బ్యాంకులకు సెలవులు ఉన్నాయి. ఆ సెలవుల జాబితా తెలుసుకుందామా.. !

జూలై 3 (బుధవారం) : బెహ్ డైన్ ఖ్లామ్ (మేఘాలయ).
జూలై 6 (శనివారం) : ఎంహెచ్ఐపీ డే (మిజోరం)
జూలై 7 (ఆదివారం) –వారాంతపు సెలవు
జూలై 8 (సోమవారం): కాంగ్ (రథ జాతర – మణిపూర్).
జూలై 9 (మంగళవారం) దృక్పా షేజీ (సిక్కిం).
జూలై 13 (రెండో శనివారం) : వారాంతపు సెలవు.
జూలై 14 (ఆదివారం) : వారాంతపు సెలవు జూలై 16 (మంగళవారం): హరెలా (ఉత్తరాఖండ్)
జూలై 17 (బుధవారం) : ముహర్రం / అషూరా / యూ టిరోట్ సింగ్ డే (పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, న్యూఢిల్లీ, బీహార్, జార?ండ్, ఛత్తీస్‌గఢ్, హిమాచల్ ప్రదేశ్, జమ్ము కశ్మీర్, మేఘాలయ, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, మిజోరం, కర్ణాటక, మధ్యప్రదేశ్, త్రిపుర).
జూలై 21 (ఆదివారం): వారాంతపు సెలవు.
జూలై 27 (నాలుగో శనివారం) : వారాంతపు సెలవు
జూలై 28 (ఆదివారం) : వారాంతపు సెలవు.

### తిరిగి పుంజుకున్న ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు..

భారత్ ఫారెక్స్ రిజర్వు నిల్వలు మళ్లీ పెరిగాయి. ఈ నెల 21తో ముగిసిన వారానికి 816 మిలియన్ డాలర్లు వృద్ధి చెంది 653.7 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని ఆర్బీఐ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. జూన్ 14తో ముగిసిన వారానికి ఫారెక్స్ రిజర్వు నిల్వలు 2.92 బిలియన్ డాలర్లు తగ్గి 652.9 బిలియన్ డాలర్లతో సరి పెట్టుకున్నాయి. ఫారిన్ కరెన్సీ అసెట్స్ (ఎఫ్ సీఏ'స్) 106 మిలియన్ డాలర్లు పడిపోయి 574.1 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. బంగారం రిజర్వు నిల్వలు 988 మిలియన్ డాలర్లు పెరిగి 56.95 బిలియన్ డాలర్ల వద్ద స్థిర పడ్డాయి. ఎస్డీఆర్స్ 57 మిలియన్ డాలర్లు తగ్గి 18.04 బిలియన్ డాలర్ల వద్ద ముగిశాయి. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్)లో ఫారెక్స్ రిజర్వు నిల్వలు 9 మిలియన్ డాలర్లు తగ్గి 4.57 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అంతకుముందు ఈ నెల ఏడో తేదీతో ముగిసిన వారానికి ఫారెక్స్ నిల్వలు 430 కోట్ల డాలర్లు వృద్ధితో 655.8 బిలియన్ డాలర్లకు చేరాయి. దీంతో తొలిసారి ఫారెక్స్ రిజర్వు నిల్వలు జీవిత కాల గరిష్టాన్ని తాకాయి.

### మారుతి బ్రెజా టు ఫోక్స్ వ్యాగన్ టిగువాన్ వరకూ

# డిస్కౌంట్ల వర్షం

**1.4 లక్షల నుంచి రూ.3.40 లక్షల రాయితీలు.. !**



గతంతో పోలిస్తే ప్రతి ఒక్కరూ పర్సనల్ మొబిలిటీకి ప్రాధాన్యం ఇస్తున్నారు. అందునా స్పేసియస్‌గా ఉండే, సేఫ్టీ, సౌకర్యవంతమైన ఫీచర్లు గల కార్ల కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు. రోజురోజుకు కార్ల విక్రయాలు పెరుగుతుండటంతో దేశంలోని ప్రముఖ కార్ల తయారీ సంస్థలు డిస్కౌంట్లు ఆఫర్ చేస్తున్నాయి. ఈ జాబితాలో అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకి కూడా జత కలిసింది. మారుతి సుజుకి తన టాప్ ఎస్ యూవీ కారుపై గరిష్టంగా రూ.1.4 లక్షల డిస్కౌంట్ ఆఫర్ చేసింది. గ్రాండ్ విటారా కారుపై రూ.1.4 లక్షల డిస్కౌంట్ ప్రకటించింది మారుతి సుజుకి. అయితే హైబ్రీడ్ మోడల్ కార్లకు మాత్రమే గరిష్ట డిస్కౌంట్ లభిస్తుంది. ఇతర మోడల్ కార్లకు దాదాపు రూ.65 వేల రాయితీ ప్రకటించింది. మారుతి సుజుకి గ్రాండ్ విటారా కారు ధర రూ.10.99 లక్షల నుంచి ప్రారంభం అవుతుంది. ఈ కారు పెట్రోల్, సీఎన్జీ వర్షన్లలో లభిస్తుంది. సిగ్మా, డెల్టా, జెటా, ఆల్ఫా, జెటాం, ఆల్ఫాం వేరియంట్లలో లభిస్తుంది. మాన్యువల్, ఈ–సీవీ వర్షన్‌లతోపాటు వేర్వేరు ట్రాన్స్ మిషన్ ఆప్షన్లలో అందుబాటులో ఉంటుంది. ఇంతకుముందు మారుతి సుజుకి తన జిమ్నీ మోడల్ కారుపై గరిష్టంగా రూ.1.5 లక్షల డిస్కౌంట్ ప్రకటించింది. ఇక మిగతా స్విఫ్ట్, బ్రెజా, ఆల్టో, వ్యాగన్ఆర్, డిజైర్, సెలెరియో వంటి కార్లపై రూ.58 వేల వరకూ, ఫ్రాంక్స్ మోడల్ మీద రూ.72 వేల వరకూ డిస్కౌంట్ ప్రకటించినట్లు వార్తలొచ్చాయి.టాటా మోటార్స్ తన నెక్సాన్ కారుపై రూ.లక్ష డిస్కౌంట్ అందిస్తోంది. హోండా ఎలివేట్ కారు మీద రూ.55 వేల వరకూ రాయితీ, హోండా అమేజ్ అండ్ హోండా సిటీ మోడల్ కార్లపై రూ.30 వేల వరకూ డిస్కౌంట్ లభిస్తుంది. హ్యుండాయ్ వెన్యూపై ఎక్స్ఛేంజ్ ఆఫర్‌తోపాటు రూ.30 వేల వరకూ క్యాష్ డిస్కౌంట్, అల్కాజర్ మీద రూ.65 వేల వరకూ, ఐ10 నియోస్ మీద రూ.35 వేల వరకూ డిస్కౌంట్ ప్రకటించింది. ఫోక్స్ వ్యాగన్ తన టిగువాన్ మీద గరిష్టంగా రూ.3.40 లక్షల డిస్కౌంట్ ఆఫర్ చేసింది. విర్టస్ మోడల్ కారు మీద రూ.20 వేల రాయితీ, టైగూన్ మీద రూ.1.80 లక్షల డిస్కౌంట్ ఆఫర్ చేసింది.

## 55 అంగుళాల స్మార్ట్ టీవీ ధర కేవలం రూ.36,499..




స్మార్ట్ టీవీ కొనాలనే ఆలోచనలో ఉన్నవారికి శుభవార్త. ఎందుకంటే ఇప్పుడు పెద్ద టీవీల ధరలు తగ్గాయి. తక్కువ ధరకే పెద్ద టీవీలు వస్తున్నాయి. చిన్న టీవీల ధరకే పెద్ద టీవీని కొనుగోలుచేసే ఆఫర్స్ అందుబాటులో ఉన్నాయి. సాధారణంగా మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా 32 అంగుళాల టీవీలు కొంటారు. అంతకంటే పెద్ద టీవీ అయితే కనీసం రూ.50 వేల నుంచి 60 వేలు పెట్టాల్సి ఉంటుంది. అయితే ఇప్పుడు అందులో సగం ధరకే మీరు 55 అంగుళాల స్మార్ట్ టీవీని సొంతం చేసుకోవచ్చు. వీయూ కంపెనీ 55 అంగుళాల 'ది గ్లోలెడ్ సిరీస్ 4కే స్మార్ట్ ఎల్ఈడీ గూగుల్ టీవీ'పై ఈ ఆఫర్ ఇస్తోంది. 4కే రిజల్యూషన్‌తో 60 హెడ్జెస్ రీఫ్రెష్ రేటుతో వస్తుంది. ఏఐ పీక్యూ ఇంజిన్, డైనమిక్ బ్యాక్ లైట్ కంట్రోల్, యాంబియంట్ లైట్ సెన్సార్, ఎంఈఎంసీఐ మోషన్ ఎన్‌హాన్స్‌మెంట్, డిజిటల్ నాయిస్ రిడక్షన్, గ్లో ఏఐ ప్రాసెసర్ లాంటి ఫీచర్స్ తో వస్తుంది. 2 జీబీ ర్యామ్, 16 జీబీ స్టోరేజ్ స్పేస్‌తో లభిస్తుంది. ఇందులో 104 వాట్ డీజీ సౌండ్, బిల్ట్ ఇన్ సబ్ ఊఫర్, డాల్బీ అట్మాస్, ఫుల్ రేంజ్ 4 స్పీకర్, సరౌండ్ సౌండ్, బాస్ బూస్ట్ ఫీచర్స్‌తో వస్తుంది. దీని మీద కంపెనీ ఏడాది వారంటీ ఇస్తుంది. ఈ టీవీ ప్రత్యేకత ఏంటంటే టేబుల్ మీద కావాలంటే టేబుల్ మీద పెట్టుకోవడానికి స్టాండ్, గోడకు తగిలించుకోవాలనుంటే ఒక వాల్ మౌంటెడ్ బ్రాకెట్ ఇస్తున్నారు. ఆన్ లైన్‌లో దీని ధర రూ.65 వేలు కాగా ఇప్పుడు డిస్కౌంట్ ఆఫర్‌లో కేవలం రూ.36,499కే సొంతం చేసుకోవచ్చు. అలానే ఎంపిక చేయబడ్డ క్రెడిట్ కార్డుల మీద రూ.1750 వరకు అదనపు డిస్కౌంట్ పొందవచ్చు.

## ఇకపై జీఐఎస్ డిడక్షన్‌లు ఉండవు..

### కీలక నిర్ణయం తీసుకున్న ఈపీఎఫ్‌వో




ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. 2013 సెప్టెంబర్ 1 తర్వాత ఉద్యోగంలో చేరిన ప్రభుత్వ ఉద్యోగుల గ్రూప్ ఇన్సూరెన్స్ స్కీమ్ కింద డిడక్షన్‌లను నిలిపివేయనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఈపీఎఫ్ఓ ఒక సర్క్యులర్ జారీ చేసింది. ఈపీఎఫ్ఓ తీసుకున్న ఈ నిర్ణయం 2013 సెప్టెంబర్ 1 తర్వాత సర్వీస్‌లో చేరిన ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే వర్తిస్తుంది. అంతకు ముందు ఉద్యోగంలో చేరిన వారికి పాత నిబంధనలే వర్తిస్తాయి. వీరికి యథావిధిగా గ్రూప్ ఇన్సూరెన్స్ స్కీమ్ అమౌంట్ డిడక్ట్ అవుతుంది. కాబట్టి 2013 సెప్టెంబర్ 1 తర్వాత జాబ్‌లో చేరిన ఆయా కేటగిరిలో ఉన్న ఉద్యోగులు వచ్చే నెల నుంచి ఎక్కువ వేతనం పొందనున్నారు. 2013 సెప్టెంబర్ 1 తర్వాత ఉద్యోగంలో చేరిన వారికి ఇప్పటివరకు డిడక్షన్ అయిన మొత్తం కూడా రీఫండ్ అవుతుంది. జీఐఎస్ పరిధి నుంచి వీరిని శాశ్వతంగా తొలగించనున్నారు. జీఐఎస్ కింద తగ్గింపులు నిలిపివేయడంతో ఉద్యోగుల టేక్ హోమ్ శాలరీలు కూడా పెరగనున్నాయి. గ్రూప్ ఇన్సూరెన్స్ స్కీమ్ అనేది 1982 జనవరి 1 నుంచి సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ గ్రూప్ ఇన్సూరెన్స్ స్కీమ్ పేరుతో అమల్లోకి వచ్చింది. ఉద్యోగులు, వారిపై ఆధారపడిన వారు ప్రమాదాలకు గురైనప్పుడు సామాజిక, ఆర్థిక రక్షణ కల్పించడమే ఈ స్కీమ్ ప్రధాన ఉద్దేశంగా దీన్ని తీసుకొచ్చారు.

## రియల్‌మీ నుంచి బడ్జెట్ ఫ్రెండ్లీ ఫోన్

## రియల్‌మీ సీ 61 5జీ.. ఇవీ స్పెషిఫికేషన్స్..!




ప్రముఖ చైనా స్మార్ట్ ఫోన్ల తయారీ సంస్థ రియల్‌మీ బడ్జెట్ ఫ్రెండ్లీ ఫోన్ రియల్‌మీ సీ 61ను శుక్రవారం భారత్ మార్కెట్లో ఆవిష్కరించింది. బడ్జెట్ ధరలో లభిస్తున్న రియల్ మీ సీ61 ఫోన్ 90 హెర్ట్జ్ రీఫ్రెష్ రేటు మద్దతుతో 450 నిట్స్ పీక్ బ్రైట్ నెస్‌తో కూడిన 6.78 అంగుళాల హెచ్డీ ఎల్‌సీడీ స్క్రీన్ కలిగి ఉంటుంది. ఇది యూనిసాక్ టీ612 ప్రాసెసర్ తో పని చేస్తుంది. 32 మెగా పిక్సెల్ డెప్త్ రేర్ సెన్సర్ కెమెరా, సెల్ఫీలూ వీడియో కాల్స్ కోసం 5 మెగా పిక్సెల్ సెన్సర్ కెమెరా జత చేశారు. వై–ఫై 2.4 గిగా హెర్ట్జ్ / 5 గిగా హెర్ట్జ్, బ్లూ టూత్ 5.0, యూఎస్బీ టైప్ సీ పోర్ట్ కనెక్టివిటీ కలిగి ఉంటుంది. 10వాట్ల ఫాస్ట్ చార్జింగ్ మద్దతుతో 5000 ఎంఏహెచ్ కెపాసిటీతో కూడిన బ్యాటరీతో వస్తోంది. రియల్ మీ సీ61 ఫోన్ రెండు కలర్ ఆప్షన్లు – సఫారీ గ్రీన్, మార్బుల్ బ్లాక్ రంగుల్లో లభిస్తుంది. మూడు వేరియంట్లలో రియల్ మీ సీ61 – ఫోన్ మార్కెట్లో అందుబాటులో ఉంటుంది. 4 జీబీ ర్యామ్ విత్ 64 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.7,699, 4 జీబీ ర్యామ్ విత్ 128 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.8,499, 6 జీబీ ర్యామ్ విత్ 128 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.8,999 పలుకుతుంది.

## ఏసిపి ఆకస్మిక తనిఖీ



**భీమదేవరపల్లి జూన్ 28 (నినాదం న్యూస్):** శుక్రవారం రోజు కాజీపేట ఏసిపి తిరుమల్ వంగర పోలీస్ స్టేషన్ అకస్మికతనికి చేయడం జరిగినది. ఇట్టి తనిఖీలో భాగంగా పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలు, పోలీస్ స్టేషన్ ఎస్సై రూము స్టాఫ్ రూమ్, రైటర్ రూము, రికార్డు రూమ్స్ ,మరియు బాత్రూమ్స్ అన్ని క్షుణ్ణంగా పరిశీలించడం జరిగినది. మరియు పోలీస్ స్టేషన్ రికార్డ్స్, సన్నిహిత జనరల్ డైరీ,కేడి,డీసి, రౌడీ షీట్స్, అన్ని రికార్డ్స్ పరిశీలించి సూచనలు ఇవ్వడం జరిగినది. పోలీస్ స్టేషన్లో ఉన్న సీసీ కెమెరాలు అన్ని పనిచేస్తున్నవా లేదా అని తనిఖీ చేయడం జరిగినది. సిబ్బందితో మాట్లాడి డ్యూటీ విషయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలి ప్రజల దరఖాస్తుదారుల మంచిగా రిసీవ్ చేసుకుని సరైన న్యాయం చేయగలరని, ప్రతి దరఖాస్తుదారుని సమస్యను తత్వరలో పరిష్కరించవలెను. ప్రజల సమస్యలు మన సమస్యలుగా అనుకోని తగు న్యాయం చేయవలెను. దరఖాస్తుదారులను ఎక్కువ రోజులు పోలీస్ స్టేషన్ చుట్టూ తిప్పకూడదు.అవసరమైన వాటికి చట్టపరంగా కేసులు నమోదు చేయవలెను. ప్రజలతో సత్సంబంధాలు పెంచుకోవాలని సూచించడం జరిగినది. సిబ్బందితో మాట్లాడి వారి వ్యక్తిగతమైన సమస్యలు, కుటుంబ సమస్యలు అడిగి తెలుసుకోవడం జరిగినది. సిబ్బంది శాఖ పరమైన సమస్యలు గానీ, శాఖ పరంగా రావాల్సిన లావాదేవీలు గాని ఉంటే తెలియపరచాలని కోరడము జరిగినది.ఇట్టి ఆకస్మిక తనిఖీలు చేసిన ఏసీపి కాజీపేట, ఎలుకతుర్తి సీఐ,ప్రవీణ్ పాల్గొనడం జరిగినది.

## పెద్దపల్లిలో మౌలిక వసతుల కల్పన పై ప్రత్యేక దృష్టి

**పలు వార్డుల్లో పర్యటించిన ఎమ్మెల్యే విజయరమణ రావు**



**పెద్దపల్లి ప్రతినిధి, జూన్ 28( నినాదం):** జిల్లా కేంద్రమైన పెద్దపల్లి పట్టణంలో మౌలిక వసతుల కల్పన పై ప్రత్యేక దృష్టి సారిస్తానని ఎమ్మెల్యే విజయరమణ రావు తెలిపారు. పెద్దపల్లి పట్టణం 19, 34 వార్డుల్లో శుక్రవారం ఆయన మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా విజయరమణారావు మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణంలో త్రాగునీటి సరఫరా, డ్రైనేజీ, విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేష్ ను ఎమ్మెల్యే ఆదేశించారు. రానున్న వారం, పదిహేను రోజుల్లో పెద్దపల్లి పట్టణంలోని అన్ని వార్డుల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

# సివిల్ సప్లై అధికారుల దాడుల్లో బయటపడ్డ భారీ కుంభకోణం

- సుమారు 62 కోట్ల ప్రభుత్వ ధాన్యాన్ని అమ్ముకున్న మిల్లు యజమానులు
- మహాశక్తి ఆగ్రో ఇండస్ట్రీస్‌పై ఫిర్యాదు చేసిన సివిల్ సప్లై అధికారులు
- రైస్ మిల్ యజమానులపై కేసు నమోదు చేసిన జమ్మికుంట పోలీసులు

**జమ్మికుంట, జూన్ 28 (నినాదం న్యూస్) :** జమ్మికుంట పట్టణానికి చెందిన మహాలక్ష్మి ఆగ్రో ఇండస్ట్రీస్ యజమానులు బండారి శారద, బండారి మారుతి ల పై శుక్రవారం కరీంనగర్ జిల్లా సివిల్ సప్లై మేనేజర్ ఎం రజనీ కాంత్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణానికి చెందిన మహాలక్ష్మి ఇండస్ట్రీస్ కు రాష్ట్ర ప్రభుత్వం రబీ, ఖరీఫ్ సీజన్ల లో ఒక లక్ష 96 వేల 620 క్వింటాళ్ల సీఎంఆర్ వడ్లను మిల్లింగ్ చేయమని వారికి అప్పగించగా ఇప్పటి వరకు అట్టి వడ్లను మిల్లింగ్ చేసి ప్రభుత్వానికి అప్పగించకపోవడంతో వారిపై అనుమానం వచ్చి గత రెండు రోజులుగా మహాలక్ష్మి అగ్రస్ ఇండస్ట్రీస్ లో కరీంనగర్ జిల్లా సివిల్ సప్లై టాస్క్ ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించి పలు విస్తుపోయే నిజాలను బయటపెట్టారు. వారికి అప్పగించిన కోట్లాది రూపాయల వడ్లను వారు మిల్లింగ్ చేసి అధిక ధరలకు బయట విక్రయించుకున్నారని ప్రభుత్వానికి చెందిన వారి స్వార్థం కొరకు అమ్ముకున్నారని అధికారులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సుమారు 62 కోట్ల 20 లక్షల 64 వేల ఎనిమిది వందల ఇరవై ఒక్క రూపాయల బియ్యాన్ని ప్రభుత్వానికి ఇవ్వకుండా నష్టం చేశారని ఆ మిల్లు యజమానిపై జమ్మికుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. సివిల్ సప్లై మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరగంటి రవి ఒక ప్రకటనలో తెలిపారు.



**ఒక మిల్లు లోనే ఇంత అక్రమమా...?**
సివిల్ సప్లై అధికారులు గత రెండు రోజులుగా జమ్మికుంట పట్టణ పరిసర ప్రాంతాల మిల్లులో దాడులు నిర్వహిస్తూ ప్రభుత్వానికి రావాల్సిన బియ్యం గురించి ఆరా తీస్తున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతుంది. ఒక మహాశక్తి ఆగ్రోస్ ఇండస్ట్రీస్ లోనే సుమారు 60 కోట్ల పైచిలుకు ధాన్యాన్ని మిల్లు యజమానులు పక్కదారి పట్టించడం తో మిగతా బిల్లులో ఇంకా ఎంత కుంభకోణం ఉందో అని స్థానికం గా జోరుగా చర్చ జరుగుతుంది. ఒక మిల్లులోనే ఇన్ని కోట్ల రూపాయల మేర అవకతవకలు జరిగితే ఇన్ని రోజులు అటు అప్పటి ప్రభుత్వం కానీ అధికారులు కానీ ఏం చేశారో అర్థం కావడం లేదు. వ్యాపారులతో కుమ్మక్కైన కొంతమంది ఇంత కుంభకోణం జరిగిన బయట పెట్టలేదని గుసగుసలు వినబడుతున్నాయి. అధికారులు మరిన్ని నిర్వహిస్తే ఇంకొన్ని నిజాలు బయటకు వచ్చే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు.

## పీవీని అవమానించిన చరిత్ర కాంగ్రెస్‌దే

**పీవీ ఆర్థిక సంస్కరణలతోనే దేశాభివృద్ధి - జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్**



**మంథని టౌన్ జూన్ 28 (నినాదం న్యూస్)** భారతదేశ మాజీప్రధాని, బహుబా షాకో విదుడు, పీవీ నరసింహ రావు జయంతిని పురస్కరించు కుని శుక్రవారం మంథని పట్టణంలోని పీవీ కాంస్య విగ్రహానికి జడ్పీ చైర్మన్ పుట్ట మదూకర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ ఆనాడు ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చి దేశ ఆర్థిక వ్యవస్థలో మార్పులు తీసుకువచ్చిన ఘనత పీవీకే దక్కిందన్నారు. అయితే పీవీ మరణిస్తే ఆయనకు కాంగ్రెస్ పార్టీ సరైన గౌరవం ఇవ్వలేదని, ఆయన పార్థివ దేహాన్ని పూర్తిగా కాలకుండాఅవమానపర్చారని అన్నారు. అయితే పీవీ సామాజికవర్గానికి చెందిన వారుమంథనినియోజకవర్గంలో ఆయన పేరుతో ఎదిగి అనేక పదవులు పొందారే కానీ ఏనాడు పీవీ గురించి ప్రజలకు చెప్పలేదని, కనీసం పీవీ చిత్రపటాన్ని ప్రజలకు చూపించకుండా అవమానపర్చారని విమర్శించారు. అట్టడుగు వర్గాల కోసం త్యాగాలుచేసిన మహనీయులనుచూ పించాల్సిన బాధ్యతను గత పాలకులు తీసుకోకపోగా వారిని అవమానించారని,కానీ బీసీ సామాజికవర్గం నుంచి వచ్చిన తాను ఇక్కడ మహనీయుల చరిత్రను చాటి చెప్పడంతో పాటు మంథని ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా చాటిన మాజీప్రధాని పీవీ నరసింహరావు కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసిన చరిత్ర మాదేనన్నారు. గాంధీ కుటుంబేతర వ్యక్తి ప్రధాన మంత్రి అయితే ఏ విధంగా అవమాన పర్చిందో పీవీని చూస్తే కాంగ్రెస్ పార్టీ విధానం అర్థం అవుతుందన్నారు. ఈనాడు దేశం ఆర్థికంగా అభివృద్ధి పథంలో ముందుకు నడువడానికి పీవీ ఆర్థిక సంస్కరణలే కారణమని ఆయన స్పష్టం చేశారు.

## నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గనికి ముఖ్యమంత్రి ఇచ్చింది గాడిద గుడ్డు

**పార్లమెంట్ సాక్షిగా అసదుద్దీన్ చేసిన వ్యాఖ్యలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి - నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ**



**నిజామాబాద్ ప్రతినిధి, జూన్ 28 (నినాదం న్యూస్) :**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిజామాబాద్ అర్బన్ నియోజకర్గానికి ఇప్పటి వరకు ఒక్క రూపాయి ఇచ్చిన పాపానపోలేదని, ఇచ్చింది గాడిద గుడ్డు అని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ ఎద్దేవా చేశారు. శుక్రవారం భారతీయ జనతా పార్టీ ఇందూర్ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికసమావేశంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే మాట్లాడుతూ రేవంత్ రెడ్డి పరిపాలన గాలికి వదిలేసి, ప్రజా సమస్యలు పట్టించుకోకుండా ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నాడని, గడిచిన ఆరు నెలలలో 11 సార్లు ఢిల్లీకి పోయి సోనియా, రాహుల్ చుట్టూ తిరగడానికే సరిపోయిందని విమర్శించారు. ఎంఐఎం పార్టీ అధినేత ఒవైసీ పార్లమెంట్ సాక్షిగా జై పాలస్తినా అనడాన్ని బిజెపి తీవ్రంగా ఖండిస్తుందన్నారు. గత ప్రభుత్వం చేసిన విద్యుత్ కొనుగోలు కుంభకోణం, కాళేశ్వరం కుంభకోనం, గొర్రెలపంపిణీ, ఫోన్ టాపింగ్ కుంభకోనల నుండి కెసిఆర్‌ను కాపాడటానికి, బీఆర్ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేయడానికి సోనియాతో రేవంత్ పావులు కదుపుతున్నారని ఆరోపించారు. పాఠశాలలో కనీస మౌలిక సౌకర్యాల కల్పన లేదని ఏబీవీపీ రాష్ట్ర వ్యాప్తంగా బంద్‌కు పిలుపునిస్తే పోలీసులు ఏబీవీపీ కార్యకర్తల పైన దాడి చేసి కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నిజామాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణ రావు సొంత జిల్లాలో చెంచు మహిళను అతికిరతకంగా మానభంగం చేసిన పరిస్థితి రాష్ట్రంలో లా ఆర్డర్ పరిస్థితి ఎట్లా ఉందంటే మూడు హత్యలు, ఆరు మానభంగాలు అన్నట్లు ఉందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్న ఒక్క గ్యారంటీ పూర్తిగా అమలు చేయాలేదని, రుణమాఫీకి ఎటువంటి షరతులు లేకుండా ఏక కాలంలో రైతులందరికి 2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.



## భారతీయ సినీ పతాకను రెపరెపలాడించిన కల్కి

- నటుడు చిరంజీవి ప్రశంసల వర్షం
- నన్ను మరో ప్రపంచంలోకి తీసుకెళ్లిందన్న రాజమౌళి



ప్రభాస్ హీరోగా నటించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రంపై సినీ సెలబ్రిటీలు ప్రశం సల వర్షం కురిపిసున్నారు. నాగ అశ్విన్ దర్శకత్వంలో సి. అశ్వినీదత్ నిర్మించిన ఈ చిత్రం గురువారం ప్రేక్షకుల ముం దుకొచ్చి సూపర్‌హిట్ టాక్ తెచ్చు కొంది. తాజాగా మెగాస్టార్, చిరం జీవి, రాజమౌళి ఈ చిత్ర బృందాన్ని సోషల్ మీడియాలో అభినం దించారు. ఈ మేరకు చిరు ట్వీట్ చేశారు. 'కల్కి గురించి అన్ని చోట్ల చక్కని స్పందన వినిపిస్తోంది. నాగ్ అశ్వి ను మైథాలజీ, సైంటి ఫిక్ జానర్ కథను ప్రభాస్, అమితాబ్, కమల్ హాసన్, దీపికా వంటి భారీ క్యాస్టింగ్‌తో అద్భుతంగా తెరకెక్కిం చారు. నా అభిమాన నిర్మా తలు అశ్వినీదత్, ప్రియాంక, స్వప్నాలకు అభినందనలు. ప్యాషన్, కరేజ్‌తో టీమంతా సాధించిన సక్సెస్ ఇది. మన సినిమాలు భారతీ య జెండాను మరింత ఎత్తున రెపరెప లాడేలా చేస్తున్నాయని అన్నా రు. రాజమౌళి సినిమా గురించి ట్వీట్‌లో రివ్యూ ఇచ్చారు. 'కల్కి' మూవీలో కొత్త ప్రపంచం నిర్మాణా న్ని ఇష్టపడ్డా. అద్భుతమైన సెట్టింగ్‌లతో ఇది నన్ను మరో ప్రపం చంలోకి తీసుకెళ్లింది. డార్లింగ్ తన టైమింగ్, టాలెంట్‌తో చంపే శాడు. అమితాబ్ జీ, కమల్ సర్, దీపిక నుంచి ఫుల్ సపోర్ట్ దొరి కింది. అయితే సినిమా చివరి 30 నిమిషాలు నన్ను ఓ కొత్త ప్రపం చంలోకి తీసుకెళ్లింది. తమ ప్లాన్‌ను అమలు చేయడంలో వంద శాతం ప్రయత్నం సక్సెస్ సాధించారు. నాగి, అలాగే మొత్తం వైజ యంతి టీమ్‌కు అభినందనలు' అంటూ పోస్ట్ చేశారు. ప్రభాస్ పెద్దమ్మ శ్యామలా దేవి ఆయనపై ప్రశంసల వర్షం కురిపించారు. 1000 రెబల్ స్టార్‌లను కలిపితే అది ప్రభాసః అంటూ ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఐమాక్స్‌లో సినిమాను వీక్షించిన ఆమె మీడి యాతో మాట్లాడారు. ఈ సినిమాని ఆదరించిన పవన్ కల్యాణ్ ఫ్యాన్స్, ఇతర హీరోల ఫ్యాన్స్, మా కుటుంబ అభిమానులకు హృద యపూర్వక కృతజ్ఞతలు. ఈ చిత్రంలో ÷ట్లు మరో స్థాయిలో ఉన్నా యి.

## సేనాపతి వయసుపై సందేహాలు

**అది ముఖ్యం కాదన్న దర్శకుడు శంకర్**



కమల్ హాసన్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ ఫిల్మ్ 'భారతీయుడు2' 1996లో వచ్చిన 'భారతీయుడు' చిత్రానికి సీక్వెల్‌గా రాబోతోంది. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ జులై 12న తమిళ, తెలుగు భాషలతో పాటు, ఇతర భారతీయ భాషల్లోనూ విడుదల కానుంది. ఇటీవల విడుదల చేసిన ట్రైలర్ సినిమాపై అంచనాలను పెంచింది. అయితే, వృద్ధుడైన సేనాపతి పాత్రలో కమల్ చేయడంపై సామాజిక మాధ్యమాల వేదికగా చర్చ నడుస్తోంది. ఎందుకంటే 'భారతీయుడు' చిత్రం జరిగే సమయానికి సేనాపతి పాత్రకు వయసు 75ఏళ్లుగా చూపించారు. ఆ లెక్క ప్రకారం 2024కు వచ్చే సరికి ఆ పాత్ర వయసు 103 సంవత్సరాలు. అంత వయసున్న వృద్ధుడు మార్షల్ ఆర్ట్స్ ఫైట్స్ చేయడం సాధ్యమేనా?అన్న ప్రశ్న దర్శకుడు శంకర్‌కు ఎదురైంది. దీనికి వివరణ ఇస్తూ సేనాపతి సాధారణ వ్యక్తిగా చూడొద్దని, సూపర్‌హీరోగా చూడాలంటూ సమాధానం ఇచ్చారు. 'సేనాపతి వృద్ధుడే కావచ్చు కానీ, సూపర్‌మ్యాన్. ఈ ప్రశ్న నన్ను చాలా మంది అడిగారు. నేను ఫస్ట్ పార్ట్ చేసినప్పుడు సీక్వెల్ గురించి ఆలోచనే లేదు. కేవలం ఆ ఒక్క చిత్రమే అనుకున్నా. అందుకు తగినట్లుగానే దాన్ని రాసుకున్నా. సేనాపతిని స్వాతంత్య సమరయోధుడిగా చూపించాలనుకున్నా. అందుకే అతడి పుట్టిన సంవత్సరాన్ని అందులో చూపించాం. సేనాపతి గురించి పోలీసులు విచారణ చేసే క్రమంలో అతడు పుట్టిన సంవత్సరం ఏంటో తెలుస్తుంది. ఆ విషయం నాకు గుర్తు లేదు. ప్రస్తుతం సేనాపతి చైనాలో మార్షల్ ఆర్ట్స్ ÷ట్రైనర్‌గా కనిపిస్తాడు. సేనాపతి కూడా అలాంటి వాడే. మర్మకళలో అతడు మాస్టర్. అందుకే నేను అతడిని సూపర్‌హీరోగా చూస్తా' అని శంకర్ చెప్పుకొచ్చారు. 'భారతీయుడు' కోసం వేసుకున్నట్లే ప్రోస్థటిక్ మేకప్ వేసుకోవడం విసుగ్గా అనిపించడం లేదా? అని కమల్‌ను ప్రశ్నించగా, 'సినిమా కథ ఆసక్తిగా లేకపోయినా, దర్శకుడు డిమాండ్ చేయకపోయినా అది సాధ్యమయ్యేది కాదు. ఇక ప్రోస్థటిక్ మేకప్‌లు వేసుకోవద్దని చాలా సార్లు అనుకునేవాడిని. కానీ, మంచి చిత్రాలు, కథలు రావటం వల్ల మళ్లీ నేను ఆ దిశగా పయనించాల్సి వస్తోంది' అని కమల్ అన్నారు. 'భారతీయుడు2'లో సిద్ధార్థ్, రకుల్‌ప్రీత్ సింగ్, ఎస్‌జే సూర్య, బాబీ సింహా, దివంగత నటుడు వివేక్, ప్రియా భవానీ శంకర్, బ్రహ్మానందం తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.




## సైలెంట్‌గా ఓటిటిలోకి వచ్చేసిన సత్యభామ

సుమన్ చిక్కాల దర్శకత్వంలో కాజల్ అగర్వాల్ పోలీసు ఆఫీసర్‌గా నటించిన చిత్రం 'సత్యభామ' క్రైమ్ థ్రిల్లర్ కథతో రూపొందిన ఈ చిత్రం ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చి మెప్పించింది. ఇప్పుడీ సినిమా సైలెంట్‌గా ఓటీటీలోకి వచ్చేసింది. అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా అలరిస్తోంది. నవీన్‌చంద్ర కీలకపాత్రలో కనిపించిన ఈ చిత్రంలో ప్రకాశ్ రాజ్, నాగినీడు, హర్షవర్ధన్, రవి వర్మ, తదితరులు నటించారు. కె.సత్యభామ షీ టీమ్‌లో ఏసీపీ స్థాయిలో పనిచేస్తుంటారు. చూడటానికి శాంతంగా కనిపించినా, నేరస్థుల నుంచి నిజాలు రాబట్టడంలో దిట్ట. తనకు అప్పజెప్పిన కేసుల్ని అంత సులభంగా వదిలిపెట్టదని పేరు. రచయిత అమరేందర్ (నవీన్‌చంద్ర)ని ఇష్టపడి పెళ్లి చేసుకున్న ఆమె వ్యక్తిగత జీవితానికంటే, వృత్తికే ఎక్కువ సమయం కేటాయిస్తుంటుంది. షీ టీమ్‌లో పనిచేస్తున్నప్పుడే హసీనా అనే ఓ బాధితురాలు గృహహింసని అనుభవిస్తూ సాయం కోసం సత్యభామ దగ్గరికి వస్తుంది. ఆ తర్వాత హసీనా తన భర్త చేతిలో దారుణ హత్యకి గురవుతుంది. హసీనాతోపాటు, ఎంతోమంది జీవితాలతో ఆడుకున్న ఆ నేరస్థుడిని పట్టుకునే క్రమంలో సత్యభామకి ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయి? ఆ కేసుని ఆమె వ్యక్తిగతంగా తీసుకోవడానికి కారణమేమిటి? తదితర విషయాలు తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

## రికార్డుల కోసం సినిమా తీయలేదు

**కల్కి నిర్మాత స్వప్నదత్ స్పష్టీకరణ**



ప్రభాస్ తాజా చిత్రం 'కల్కి 2898 ఏడీ' విడుదలైనప్పటి నుంచి సోషల్ మీడియాలో దాని రికార్డ్స్ గురించి చర్చ నడుస్తూనే ఉంది. ప్రభాస్ గత చిత్రాల రికార్డులను ఇది క్రాస్ చేసిందా లేదా.. అంటూ నెటిజన్లు పోస్టులు పెడుతున్నారు. దీంతో ఈ విషయంపై నిర్మాతల్లో ఒకరైన స్వప్నదత్ స్పందించారు. తాము రికార్డుల కోసం సినిమా తీయలేదని వెల్లడించారు. 'ఇతర సినిమాల రికార్డులను 'కల్కి' క్రాస్ చేసిందా? అని కొందరు అభిమానులు ఫోన్ చేసి అడగడం చాలా ఆశ్చర్యంగా, హాస్యాస్పదంగా ఉంది. ఇప్పటికే రికార్డులు సృష్టించిన వారెవ్వరూ మరోసారి వాటికోసమే సినిమాలు చేయరు. మేము ప్రేక్షకుల కోసం సినిమా తీశాం. ఎంతో ప్రేమతో దీన్ని రూపొందించాం అని పేర్కొన్నారు. ఇక 'కల్కి' మొదటి రోజు ప్రపంచవ్యాప్తంగా రూ.180కోట్లు వసూళ్లు చేసినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇండియాలో రూ.95కోట్లు వసూలు చేసినట్లు తెలుస్తోంది. దీనిపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. మరోవైపు నార్త్ అమెరికాలో 3.8మిలియన్ల డాలర్ల కలెక్షన్స్‌తో కల్కి రికార్డు నెలకొల్పింది. అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ చిత్రంగా రికార్డును సొంతం చేసుకుంది నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రంలో అగ్ర నటీనటులు భాగమయ్యారు. అలాగే మృణాల్ ఠాకూర్ కూడా అతిథి పాత్రలో తళుక్కున మెరిశారు. తాజాగా మృణాల్ ఈ సినిమాలో తన పాత్ర గురించి మాట్లాడుతూ..'కల్కి' కోసం నిర్మాతలు నన్ను సంప్రదించినప్పుడు ఒక్క క్షణంలో అంగీకరించాను. చిత్రబృందంపై నాకు అపారమైన నమ్మకం ఉంది. 'సీతారామం' సమయం నుంచి వారు నాకు తెలుసు. ఇంత గొప్ప ప్రాజెక్ట్‌లో భాగం కావడం ఆనందంగా ఉంది' అని తెలిపారు.

నినాదం సినిమా

## అమెరికాలో కల్కి ఫోబియా

**వసూళ్లలో భారీ రికార్డు**



ప్రభాస్ 'కల్కి' సినిమా సంచలనం సృష్టిస్తోంది. పురాణాలకు సైన్స్‌ను ముడిపెట్టి నాగ్ అశ్విన్ తెరకెక్కించిన ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకుంటోంది. ప్రభాస్‌తో పాటు అగ్రనటీనటుల నటనకు ఆడియన్స్ ఫిదా అవుతున్నారు. రిలీజ్‌కు ముందే ఎన్నో రికార్డులు సొంతం చేసుకున్న 'కల్కి'.. విడుదల తర్వాత కూడా హవా కొనసాగిస్తోంది. నార్త్ అమెరికాలో ఆల్ టైమ్ రికార్డును నమోదు చేసింది. నాగ్ అశ్విన్ ఈ చిత్రాన్ని హాలీవుడ్ రేంజ్‌లో రూపొందించారు. దీంతో అక్కడి ప్రేక్షకులనూ ఈ సినిమా మెప్పిస్తోంది. నార్త్ అమెరికాలో ప్రీ సేల్ బుకింగ్స్‌లోనే పలు సినిమాల రికార్డులను బ్రేక్ చేసిన 'కల్కి'.. రిలీజ్ తర్వాత అన్నిటిని దాటి టాప్‌లో నిలిచింది. ప్రీమియర్స్ కలెక్షన్స్‌లోనే 3.8 మిలియన్ డాలర్లతో అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ చిత్రంగా రికార్డును సొంతం చేసుకుంది. ప్రీమియర్స్‌లోనే 'ఆర్ఆర్ఆర్' కలెక్షన్స్ క్రాస్ చేయడం విశేషం. ఈ సినిమా తర్వాత స్థానాల్లో 'ఆర్ఆర్ఆర్' (3.46మిలియన్లు), 'సలార్' (2.6ఓ), 'బాహుబలి2' నిలిచాయి. ప్రీమియర్స్, మొదటిరోజు కలెక్షన్స్ కలిపి అమెరికాలో 'కల్కి' 5 మిలియన్ డాలర్లు వసూలుచేసింది. అమెరికాలో ఎక్కువ కలెక్షన్లు సాధించిన తెలుగు సినిమాల్లో 'కల్కి' ఒక్క రోజులోనే 5వ స్థానాన్ని సొంతం చేసుకుంది. అలాగే అత్యంత వేగంగా 5 మిలియన్లు వసూలు చేసిన సినిమాగా రికార్డు నెలకొల్పింది. ఈ కలెక్షన్లు ఇలాగే కొనసాగితే బెంచ్ మార్క్‌ను క్రియేట్ చేయడం ఖాయమని అభిమానులు అంటున్నారు. ఈ వీకెండ్‌కు కలెక్షన్స్ మరింత పెరిగే అవకాశముందని అభిప్రాయపడుతున్నారు.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrial Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S). Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, RNI NO. APTEL /2003/11288, CELL : +91 80742 79741